



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 41 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 4 నవంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-



# టిప్పర్ టెర్రర్



## ఓవర్ లోడ్ కంకరతో ఆర్టీసీ బస్సును ఢీకొన్న వాహనం

## వికారాబాద్-హైదరాబాద్ హైవేపై ఘోర ప్రమాదం





- ఘటనకు ముందు పలు వాహనాల్ని దాటిన టిప్పర్
- గుంతను తప్పించబోయి బస్సు మీదకు నేరుగా..
- డ్రైవర్ వెనక ఉన్న బస్సు భాగం నుజ్జునుజ్జు
- టిప్పర్ ఒరిగిపడి కంకర కుప్పలా మారిన బస్సు
- కంకర మీదపడి.. ఊపిరాడక ఎక్కువ మంది మృతి
- అరగంటలోపే అందర్నీ వెలికితీసినా దక్కనిప్రాణాలు
- 8 మంది మృతదేహాలపై ఎలాంటి గాయాలూ లేవు
- మృతుల్లో 13 మంది మహిళలు, ఒక పసికందు

10

ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళుతోంది! టిప్పర్ చేవెళ్ల నుంచి వికారాబాద్ వెళుతోంది! రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద ఉన్న మూల మలుపు వద్ద రెండూ ఎదురెదురుగా వచ్చాయి! 40 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్‌లో 55 టన్నుల కంకర వేశారు! లారీ బాడీని మించి కంకరను ఓవర్ లోడ్ చేశారు! దానికితోడు టిప్పర్ అతి వేగంగా దూసుకొచ్చింది! మూల మలుపులో ఓ చిన్న గుంతను డ్రైవర్ చూశాడు! దానిని తప్పించడానికి ప్రయత్నించాడు! అంతే.. అతి వేగంగా ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు! అతి వేగం కారణంగా లారీ బ్యాలెన్స్ తప్పింది! లారీ బాడీ మొత్తం బస్సువైపు ఒరిగింది! అందులోని కంకర బస్సులో కుప్పగా పడిపోయింది! దాదాపు 20-30 టన్నుల కంకర మీద పడడంతో బస్సులో కుడివైపు ముందు భాగంలో కూర్చున్నవాళ్లు దాని కింద సజీవ సమాధి అయిపోయారు!

# జైలుకు జోగి బ్రదర్స్



- రమేశ్, రాముకు 13 వరకు రిమాండ్
- తెల్లవారుజామున 5 గంటలకు తీర్పు
- నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలింపు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

నకిలీ మద్యం తయారీ కేసులో అరెస్టయిన వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రాముకు విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధించింది. ఈ నెల 13వ తేదీ వరకు రిమాండ్ విధిస్తున్నట్టు న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. జోగి సోదరులను నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశించారు. ముందుగా విజయవాడ జిల్లా జైలుకు తరలించి అక్కడి నుంచి నెల్లూరు కేంద్ర కారాగారానికి పంపాలని స్పష్టం చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే విజయలక్ష్మి, జోగి సోదరుల తరఫున మాజీ ఏజీ పొన్న వోలు సుధాకర్‌రెడ్డి, మన్మథరావు వాదనలు వినిపించారు. ముందుగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే విజయలక్ష్మి వాదనలు వినిపించారు. "జోగి సోదరులకు, ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్ధనరావుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. జోగి సోదరులు వెనకుండి జనార్ధనరావును నడిపించారు. - మిగతా2లో



## పరిస్థితి దిగజారినప్పుడు కాదు..

# ముందుగానే సిద్ధం కావాలి

- ఢిల్లీ వాయు కాలుష్యంపై 'సుప్రీం' వ్యాఖ్యలు..!
- పరిస్థితి మరింత దిగజారినప్పుడు మాత్రమే అధికారులు చర్యలు తీసుకోకూడదు
- 37 స్టేషన్లలో తొమ్మిది మాత్రమే నిరంతరాయంగా పని చేస్తున్నాయి

# వైసీపీ విద్వేషాలను రెచ్చగొడుతోంది

- 410 ఒప్పందాలు.. 9,80,000 కోట్ల పెట్టుబడులు
- ఈ నెలంతా వరుస శంకుస్థాపనలు, ఎంవోయూలు
- రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు
- అందుకే జోగి అరెస్ట్.. కులాన్ని రాజకీయం కోసం వాడతారా?
- మద్యం ముడుపులు తీసుకోలేదని ఏ దేవుడి ముందైనా ప్రమాణం చేస్తా
- అలాగే జగన్ ప్రమాణం చేస్తారా?
- విపత్తులు, ప్రమాదాలపై వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాం




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

"ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఓడించి ఆ పార్టీని 11 అసెంబ్లీ సీట్లకే పరిమితం చేయడంతో ప్రజాకాంక్షేమిటో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు గ్రహించాయి. సుస్థిర పాలనను రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని పారిశ్రామిక వేత్తలు గుర్తించినందునే 15 నెలల్లోనే 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. ఈ నెలంతా వరుసగా భారీ పరిశ్రమల శంకుస్థాపనలు, అవగాహనా ఒప్పందాలు ఉంటాయి. 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నాం. ఈ సదస్సులో రూ.9,80,000 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. 410 ఒప్పందాలు జరుగుతాయి. 12 బహుళ - మిగతా2లో

# జైలుకు జోగి బ్రదర్స్

-మొదటిపేజీ తరువాయి

అన్నమయ్య జిల్లా ములకలచెరువులోను, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోను కల్తీ మద్యం తయారీ మొత్తం వారి కనుసన్నల్లోనే జరిగింది. దీనికి సంబంధించి జోగి సోదరులకు అద్దేపల్లి సోదరులు దఫదఫాలుగా లక్షలాది రూపాయల ముడుపులు ముట్టజెప్పారు. కొన్నిసార్లు ఈ డబ్బులను ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద తీసుకున్నట్టు ఇప్పటికే అరెస్టయిన నిందితులు వాంగ్మూలంలో వెల్లడించారు. ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం తయారీని ప్రారంభించడానికి ముందు జోగి సోదరులు పలుమార్లు అద్దేపల్లి జనార్ధనరావును కలిశారు. జనార్ధనరావు ఈ విషయంపై చర్చించడానికి జోగి రమేశ్ ఇంటికి వెళ్లారు. వారిద్దరి మధ్య ఫోన్లలో సంభాషణ మొత్తం వాట్సాప్ ద్వారా జరిగింది. రమేశ్, జనార్ధనరావు కలిసి ఆఫ్రికా పర్యటనలకు వెళ్లారు" అని పీపీ వివరించారు. జోగి సోదరుల తరఫున పొన్నవోలు వాదనలు వినిపిస్తూ.. ప్రధాన నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా జోగి సోదరులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఈ కేసులో ఏర్పాటైన సిట్ గానీ, ఎక్సైజ్ పోలీసులు గానీ ఎలాంటి ఆధారాలను సేకరించలేదని వివరించారు.

**జైలు నుంచి జైలుకు**

వాదప్రతివాదనలను విన్న తర్వాత న్యాయాధికారి జి.లెనిన్‌బాబు సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు తీర్పును వెలువరించారు. జోగి సోదరులకు ఈ నెల 13 వరకు రిమాండ్ విధించారు. తెల్లవారుజాము వరకు ఎస్కార్ట్ పోలీసులు మేల్కొని ఉండడంతో అప్పటికప్పుడు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించడం కష్టమవుతుందని భావించి, ముందుగా నిందితులను విజయవాడ జిల్లా జైలుకు తరలించాలని ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఈ జైలు సిబ్బంది ద్వారా వారిని నెల్లూరు కేంద్ర కారాగారానికి పంపాలని స్పష్టం చేశారు. దీంతో వారిని విజయవాడ జిల్లా జైలుకు తీసుకెళ్లి, సోమవారం మధ్యాహ్నం నెల్లూరు జైలుకు తరలించారు.

**అజ్ఞాతంలోకి జోగి అనుచరులు**

విజయవాడ ప్రభుత్వాసుపత్రి వద్ద జోగి రమేశ్ కుమారుడు రాజీవ్, అనుచరులు చేసిన వీరంగంపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. జోగి సోదరులను క్యాజువాలిటీలోకి తీసుకెళ్తుండగా రమేశ్ కుమారుడు రాజీవ్ అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శంకర్‌పై దౌర్జన్యం చేశారు. ఆయన అనుచరులు పోలీసులను తోసుకుంటూ లోపలికి ప్రవేశించారు. ఈ ఘటనలో అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ రెండు ఘటనలపై ఆసుపత్రి అవుట్ పోస్టు కానిస్టేబుల్ తాతనంబోయిన శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదుపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. జోగి రమేశ్ భార్య శకుంతల, కుమారుడు రాజీవ్, జోగి రాము కుమారుడు రోహిత్‌పై కేసు నమోదు చేశారు. జోగి రాజీవ్, రోహిత్ వెనుక క్యాజువాలిటీలోకి దూసుకొచ్చిన అనుచరులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. వారిలో కొంతమంది అరెస్టుల భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ కేసులో జోగి బ్రదర్స్ అరెస్టులతో కలిపి 19 మందిని నిందితులుగా పేర్కొన్నారు. తాజాగా మరో నలుగురిని నిందితులుగా చేర్చారు. దీంతో నిందితుల సంఖ్య 23కి చేరింది.

**జోగి బ్రదర్స్‌ను కస్టడీకి ఇవ్వండి**

నకిలీ మద్యం తయారీ కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రామును పది రోజులపాటు పోలీసుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎక్సైజ్ అధికారులు విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో వారి నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని పేర్కొన్నారు. పిటిషన్‌ను అనుమతించిన కోర్టు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. విజయవాడ తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌లో జోగి సోదరులను సుదీర్ఘంగా విచారించినప్పటికీ కొన్ని విషయాలు మాత్రమే వెల్లడించారు. చాలా విషయాలను గోప్యంగా ఉంచినట్టు అధికారులు భావిస్తున్నారు.

# వైసీపీ విద్వేషాలను రెచ్చగొడుతోంది

-మొదటిపేజీ తరువాయి

జాతి సంస్థలు వస్తున్నాయి. 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని సమాచారం ఇచ్చారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వనీ వైష్ణవ్, పీయూష్ గోయల్ హాజరవుతున్నారు. యువగళం యాత్రలో నేను రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కష్టపడుతున్నాం. అనకాపల్లి జిల్లాకు మిట్టల్ స్టీల్స్ ద్వారా లక్షన్నర కోట్ల పెట్టుబడులు రానున్నాయి. గూగుల్ డేటా సెంటర్ రూ.1,33,000 కోట్ల పెట్టుబడులు తీసుకురానుంది. బీపీసీఎల్ లక్షన్నర కోట్ల పెట్టుబడులు పెడుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు వైసీపీ విద్వేషాలను రెచ్చగొడుతోంది. ఈ ప్రచారాలను పెట్టుబడిదారులు విశ్వసించడంలేదు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని అమలు చేయడం వల్లే పెట్టుబడులు రాబట్టడంలో ముందంజలో ఉన్నాం. ఏ అంశంపైనా పట్టు, అవగాహన లేని జగన్ ముఖ్యమంత్రి ఎలా అయ్యారో?" అని లోకేశ్ అన్నారు.




**మహిళా క్రికెటర్లకు ప్రోత్సాహకాలు**

మహిళల క్రికెట్ ప్రపంచకప్ విజేత భారత జట్టులోని ఇద్దరు తెలుగు క్రికెటర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామని లోకేశ్ చెప్పారు. సీఎం చంద్రబాబు లండన్ నుంచి తిరిగొచ్చిన వెంటనే ఆయనతో చర్చించి ప్రకటిస్తామని అన్నారు.

**ఆధారాలున్నాయ్**

నకిలీ మద్యం కేసులో ఆధారాలు ఉన్నందునే వైసీపీ నేత జోగి రమేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారని మంత్రి లోకేశ్ స్పష్టంచేశారు. తప్పు చేశారో లేదో చెప్పకుండా కులాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకునేందుకు వైసీపీ ప్రయత్నించడం ఏమిటని నిలదీశారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్‌తో కలసి లోకేశ్ మీడియాతో మాట్లాడారు. 'మా రాజకీయ జీవితంలో మద్యం ముడుపులు తీసుకోలేదని ఏ దేవుడి ముందైనా ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అదే తరహాలో వైసీపీ అధ్యక్షుడు జగన్ తాను నమ్మిన దేవుడి ముందు లిక్కర్ ముడుపులు తీసుకోలేదని ప్రమాణం చేస్తారా?' నకిలీ మద్యం కుంభకోణం తంబళ్లపల్లెలో మొదలైంది. టీడీపీ నాయకుడిపై కేసు పెడితే ఒకాయన విదేశాలకు వెళ్లిపోయారు. మరొకరు అరెస్టయ్యారు. ఈ కేసులో వైసీపీ నేతలున్నారని తెలిసి కూపీ లాగితే జోగి రమేశ్ వ్యవహారం బయటపడింది. రమేశ్ మాటలన్నీ రికార్డయ్యాయి. ఈ కేసులో కులాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకునేందుకు ప్రయత్నించడం ఏమిటి?' అనీ ప్రశ్నించారు.

**జగన్ ఎందుకు రాలేదు?**

"తప్పు చేస్తే నన్నైనా ముఖ్యమంత్రి చంద్రబాబు చట్టం ముందు దోషిగా నిలబెడతారు. మొంథా తుఫాను, కర్నూలు బస్సు ప్రమాదం, శ్రీకాకుళం జిల్లా ఆలయంలో తొక్కిసలాట.. అన్ని ఘటనల్లోనూ ప్రభుత్వం వెంటనే స్పందించి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తోంది. తుఫాను సమయంలో సీఎం, నేను, మంత్రులు సమష్టిగా పనిచేసి ప్రాణ, ఆస్తి నష్ట నివారణ కోసం కష్టపడ్డాం. జగన్ బెంగళూరులో ఉంటూ తుఫాను ప్రభావం తగ్గాక తాడేపల్లికి వచ్చి ముఖ్యమంత్రి సృష్టించిన విపత్తుగా విమర్శలు చేయడం ఏమిటి? ఈ మూడు ఘటనలపై అసెంబ్లీలో చర్చకు రావాలంటూ జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ చేస్తే ఎందుకు రావడం లేదు? శ్రీకాకుళం జిల్లాలో తొక్కిసలాట సమాచారం తెలియగానే ఎమ్మెల్యే గౌతు శిరీష సహా మంత్రి అచ్చెన్న అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత నేను, మంత్రి అనిత, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కూన రవికుమార్ తదితరులంతా బాధితులకు అండగా నిలిచాం. పొరుగునే ఉన్న వైసీపీ నేత బొత్స సత్యనారాయణ వెంటనే ఎందుకు రాలేదు? జగన్ శ్రీకాకుళం జిల్లాలో ఘటానా స్థలికి ఎందుకు వెళ్లలేదు" అని లోకేశ్ నిలదీశారు. కాగా, ఎమ్మెల్యేల క్రమశిక్షణకు ఇకపై అత్యంత ప్రాధాన్యమిస్తామని లోకేశ్ అన్నారు.

# ఏపీలో హిందూజా పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి

స్థాపిస్తుంది. రాయలసీమలో భారీ సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులు ఏర్పా టు చేస్తుంది. ఆధునిక ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాణిజ్య వాహనాల తయారీ లక్ష్యంగా కృష్ణా జిల్లా మల్లవల్లిలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్ నెలకొల్పనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈవీ చార్జింగ్ నెట్‌వర్క్ తీసుకురానుంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపైన హిందూ జా ప్రతినిధులు సంతకాలు చేశారు.

**రోల్స్ రాయిస్‌కు ఆహ్వానం**

ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్, డీజిల్ ప్రొపెల్షన్ సిస్టమ్స్ తయారీలో అంతర్జాతీయ స్థాయిలో పేరున్న రోల్స్ రాయిస్ గ్రూప్ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. సంస్థ సీటీవో నిక్కి గ్రేడి స్మిత్‌తో జరిగిన భేటీలో.. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఓర్వకల్లులో మిలటరీ ఎయిర్ స్ట్రిప్, విమానాల మెయింటెనెన్స్, రిపెయిర్, ఓవర్ హాలింగ్(ఎంఆర్ఓ) యూనిట్ ఏర్పాటుకు అవకాశాలున్నాయని తెలిపారు. ఏరో స్పేస్ విడిభాగాల ఉత్పత్తికి మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. విశాఖ, తిరుపతిలో జీసీసీ(గ్లోబల్ కేపబుల్ సెంటర్) ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. భోగాపురం విమానాశ్రయం సమీపంలోనూ ఏవియేషన్ ఎకోసిస్టమ్, ఎమ్మార్వో ఫెసిలిటీ ఏర్పాటుకు అవకాశముందని వివరించారు.



**పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీలు**

ఎస్ఆర్ఏఎం, ఎంఆర్ఏఎం గ్రూప్ ఛైర్మన్ శైలేశ్ హీరానందానీ, శామ్కో హెూల్డింగ్ లిమిటెడ్ ఛైర్మన్ సంపత్ కుమార్ మల్లాయతో నూ సీఎం సమావేశమయ్యారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. సెమీ కండక్టర్స్, ఆధునిక ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటుకు ఎస్ఆర్ఏఎం, ఎంఆర్ఏఎం గ్రూప్ ఆసక్తి చూపింది. లండన్‌లో అతిపెద్ద విద్యుత్తు సరఫరా సంస్థ ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ క్రిస్ ఫిటార్డ్‌తో సీఎం భేటీ అయ్యారు. పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం వారిని ఆహ్వానించారు. క్లీన్ ఎనర్జీ, స్మార్ట్ గ్రి డ్, డేటా అనలిటిక్స్‌లో ఏపీలో పనిచేసేందుకు అవకాశాలు ఉన్నాయని వివరించారు..

**టెక్నాలజీ రంగంలో అపార అవకాశాలు**

ఏపీలో టెక్నాలజీ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అమరావతిలో ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీలో ఏఐ వినియోగం, నిపుణులను తయారు చేసే అంశంతోపాటు ఎకో సిస్టమ్ అభివృద్ధికి అవకాశాలు పరిశీలించాలని కోరారు. అరుదైన భూగర్భఖనిజాల వెలికితీతపై వివిధ వర్సిటీలతో భాగస్వామ్యం, అవకాశాలు అందిపుచ్చుకొనే ఆస్కారం ఉందన్నారు. విశాఖలో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఏఐ పాలసీ ల్యాబ్స్ ఫౌండర్ డైరెక్టర్ ఉదయ్ నాగరాజు, ఫ్లుయెంట్ గ్రిడ్ ప్రెసిడెంట్ రత్న గారపాటి, బ్రిటీష్ హెల్త్ ఇండస్ట్రీ అసోసియేషన్ ప్రతినిధి పాల్ బెంటన్, ఆరుప్ గ్లోబల్ అఫైర్స్ డైరెక్టర్ జేమ్స్ కెన్నీ, అల్తెరిన్ టెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫ్రెడి వూలాండ్, ఫిడో టెక్, ఫిజీ పేపర్ కంపెనీ, నేషనల్ గ్రాఫైన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బైయర్స్ మార్కెట్ విజయవాడ రియల్ ఎస్టేట్

విజయవాడ

కృష్ణా నది ఒడ్డున ప్రశాంతంగా ఉండే విజయవాడ, ఆంధ్రప్రదేశ్ వాణిజ్యరాజధాని. ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ సెక్టార్ 2025లో విశాఖపట్నం, గుంటూరు తర్వాత మూడో స్థానంలో నిలుస్తోంది విజయవాడ. రెంటల్ మార్కెట్‌లో హై డిమాండ్ చూపిస్తోంది. ఇళ్ల,స్థలాల ధరలు హైదరాబాద్‌తో పోలిస్తే 30–40% తక్కువ ఉంటాయి. కానీ రెంటల్స్ ఇతర నగరాలతో సమానం.పెనమలూరు వైపు 3 సంవత్సరాల్లో 65శాతం పెరుగుదల కనిపించింది. నివాసాలకు ఈ ప్రాంతం చాలా ఉత్తమంగా ఉంటుంది. కంకిపాడులో 30.8 శాతం పెరుగుదల కనిపించింది. ఇది కమర్షియల్ పెట్టుబడులకు అనుకూలం. బెంజ్ సర్కిల్, గన్నవరం, మంగళగిరి ప్రైమ్ లొకేషన్లుగా మారాయి. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ ప్రాపర్టీలకు కేంద్రంగా ఉన్నాయి. ఉండవల్లి, తాడేపల్లిలో విల్లాలకు డిమాండ్ పెరిగింది.ప్రస్తుతం అపార్టుమెంట్లలో ఎస్ఎఫ్టీకి రూ. 4,000 నుంచి రూ. 6,000 వరకూ అమ్ముతున్నారు. ప్రదేశాన్ని బట్టి. పెరుగుతోంది. గన్నరవం వైపు అయితే ఏడు వేల వరకూ చెబుతున్నారు. విల్లాల్లో రూ.ఎనిమిది వేల వరకూ ఎస్ఎఫ్‌టీ పలుకుతున్నాయి. ఏడాది పదిహేను శాతం వరకూ ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కంకిపాడులో కమర్షియల్ కాబట్టి ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఎస్ఎఫ్టీ ఏడు వేల వరకూ చెబుతున్నారు.2025లో విజయవాడ రియల్ ఎస్టేట్ 'బైయర్స్ మార్కెట్'గా మారి, హై ఖీూఎ (10–15%) అందిస్తోంది. అమరావతి బ్యాకప్‌తో ఇది దక్షిణ భారతదేశంలో టాప్ డెస్టినేషన్ అవుతుందని అంచనా.

## అంత కాన్ఫిడెన్స్ ఎందుకో

విజయవాడ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా కాన్ఫిడెన్స్ తో ఉన్నారు. కూటమితో మరికొన్నేళ్ల పాటు తమకు తిరుగులేని విజయం దక్కుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే చంద్రబాబు పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో టీడీపీ ఇక ఎప్పుడూ ప్రతిపక్షంలో ఉండదని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎవరికైనా ఇలాంటి ఆలోచనలు రావడం సహజం. ఆ మాత్రం కాన్ఫిడెన్స్ ఉండటంలో తప్పులేదు. అలాగని అతి విశ్వాసానికి పోతే గెలిపించేది ప్రజలు అని గుర్తుంచుకోవాలన్నది అందరూ గమనించుకోవాలి. గత ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ కూడా వైసీపీ ముప్పయి ఏళ్ల పాటు అధికారంలో కానసాగుతుందని చెప్పారు. మొన్నటి ఎన్నికలలో ఏమైంది దేశంలో ఎక్కడ చూసినా... కేవలం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలే కాదు.. పొరుగున ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా అదే ధీమాతో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తనను ప్రజలు శాశ్వతంగా తననే ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని భావించారు. పదేళ్ల తర్వాత ఫాం హౌస్ కు పరిమితం చేశారు. ఇక ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఐదు సార్లు ముఖ్యమంత్రిగా గెలిచినా సరే.. చివరకు మొన్నటి ఎన్నికల్లో ఆయనను ఇంటికి పంపారు. ఇలాంటి ఉదాహరణలు దేశంలో ఎన్నో ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉండదని చంద్రబాబు అనడం నేతల్లోనూ, క్యాడర్ లోనూ ఆయన ఉత్సాహంతో పాటు జోష్ పెంచేందుకే అయినా ఎవరూ రాజకీయాల్లో అధికారంలో ఉండటం శాశ్వతంగా ఉండదని దేశంలోనే అనేక రాష్ట్రాల్లో చూసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఏర్పడిన తర్వాత అంతా బాగుందని అనుకుంటే పరవాలేదు కానీ.. పూర్తిగా తమకు అనుకూలంగా ఉందని భావించడం మాత్రం చంద్రబాబు అతి విశ్వాసానికి నిదర్శనమనే చెప్పాలి. కూటమి అనేది కలిసి ఉండొచ్చు. ఉండకపోవచ్చు. అలాగే కూటమిలో ఉన్న పార్టీలపై జనాలకు మోహం మొత్తే అవకాశం కూడా ఉంది. చంద్రబాబు యాభై ఏళ్ల రాజకీయ అనుభవంతో ఆయన ఇక ప్రతిపక్షంలో ఉండదని చెప్పడాన్ని మాత్రం పార్టీ నేతలే నవ్వుకుంటున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతమని భావిస్తే అదే ఓటమికి ప్రధాన కారణమవుతుందని కూడా అనేక విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఆల్ ఈజ్ వెల్ అనుకున్న వారంతా రాజకీయాల్లో కనుమరుగైన విషయాన్ని కూడా ఈ సందర్భంగా కొందరు గుర్తు చేస్తున్నారు.

## 4న క్రమశిక్షణ కమిటీ ముందుకు ఎంపీ, ఎమ్మెల్యే

విజయవాడ

టీడీపీలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మధ్య వివాదం చెలరేగింది బహిరంగంగానే ఒకరిపై మరొకరు తీవ్ర ఆరోపణలు, విమర్శలు చేసుకున్నారు. సై అంటే సై అంటూ కయ్యానికి కాలు దువ్వారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ఎంపీ చిన్ని డబ్బులు తీసుకున్నారంటూ ఎమ్మెల్యే కొలికపూడి చేసిన తీవ్ర ఆరోపణలు కలకలం రేపాయి.వీరిద్దరి తీరు పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ క్రమంలో వీరి వివాదం పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందుకు చేరింది. వారిద్దరికి క్రమశిక్షణ కమిటీ నుంచి పిలుపొచ్చింది. ఈ నెల 4న క్రమశిక్షణ కమిటీ ముందుకు రావాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ కేశినేని చిన్నిలకు ఆదేశాలు అందాయి. 4వ తేదీన ఉదయం 11 గంటలకు క్రమశిక్షణ కమిటీ ముందు హాజరుకావాలని ఎమ్మెల్యే కొలికపూడికి, అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు క్రమశిక్షణ కమిటీ ముందుకు రావాలని ఎంపీ కేశినేని చిన్నికి సమాచారం పంపింది టీడీపీ కేంద్ర కార్యాలయం. అంతేకాదు.. అనుచరులతో కాకుండా సింగిల్ గానే రావాలని సమాచారం పంపింది.గత ఎన్నికల్లో తనకు టికెట్ కేటాయించేందుకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని రూ.5కోట్లు తీసుకున్నారని ఎమ్మెల్యే కొలికపూడి సంచలన ఆరోపణలు చేశారు. వాటి బ్యాంకు స్టేట్‌మెంట్లు ఇవే అంటూ తన వాట్సప్ స్టేటస్‌లో పెట్టడం తీవ్ర కలకలం రేపింది. అంతేకాదు మరికొన్ని వివాదాస్పద పోస్టులు సైతం తన స్టేటస్‌లో పెట్టారాయన.తన మీద కొలికపూడి చేసిన ఆరోపణలపై అంతే ఘాటుగా స్పందించారు ఎంపీ చిన్ని. తాను వైసీపీ నేతలతో అంటకాగే నాయకుడిని కానన్నారు. నిఖార్సైన టీడీపీ నాయకుడినని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లను విమర్శించే వాళ్లను తాను శత్రువుల్లానే చూస్తానన్నారు. 12 నెలల వరకు నన్ను దేవుడు అన్నాడు, ఇప్పుడు దెయ్యం అని ఎందుకంటున్నాడో కొలికపూడినే సమాధానం చెప్పాలన్నారు.కొన్నాళ్లుగా నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్ల గొడవలు పార్టీకి పెద్ద తలనొప్పిగా మారాయి. టీడీపీలో క్రమశిక్షణ కట్టు తప్పుతోందన్న ప్రచారంపై అధినాయకత్వం మదన పడుతోంది. పార్టీలో కీలక నేతలు, పైగా పదవుల్లో ఉన్న వారు ఒకరి మీద మరొకరు తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేసుకోవడం.. వీధికెక్కడంపై సీరియస్‌గా ఉంది హైకమాండ్. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య వివాదంపై పార్టీ ముఖ్య నాయకులతో చర్చించారు చంద్రబాబు.ఇక మీదట ఎవరైనా గీత దాటితే అసలు సహించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు. కొన్నాళ్లుగా నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్ల గొడవలు పార్టీకి హెడెక్‌గా మారాయి. టీడీపీలో క్రమశిక్షణ కట్టు తప్పుతోందన్న ప్రచారంపై అధినాయకత్వం మధన పడుతోంది. పార్టీలో కీలక నేతలు పదవుల్లో ఉన్నవారు ఒకరి మీద మరొకరు తీవ్ర విమర్శలు చేసుకోవడంపై సీరియస్‌గా ఉంది హైకమాండ్. లేటెస్ట్‌గా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య వివాదంపై పార్టీ ముఖ్య నాయకులతో చర్చించారు చంద్రబాబు.ఇక మీదట ఎవరైనా కట్టు తప్పితే అసలు సహించేది లేదని హెచ్చరించారు. పార్టీనే సుప్రీం అని..ఎవరూ కూడా పార్టీ కంటే అతీతులు కారని స్పష్టం చేశారు. తాను చేయాల్సిన ప్రయత్నం చేస్తానన్న బాబు..అప్పటికి మార్పు లేకపోతే గట్టి చర్యలకు సిద్ధమని బాబు సీరియస్ వార్నింగే ఇచ్చేశారు. అయితే ఇప్పటికే అటు కొలికపూడి..ఇటు కేశినేని చిన్ని సైలెంట్ అయిపోయారు. టీడీపీ అధిష్టానం కోరుకున్నది కూడా ఇదే. ఇంటర్నల్‌గా ఎన్ని సమస్యలు ఉన్నా రచ్చకెక్కొద్దనే చెప్పుకుంటూ వస్తోంది పార్టీ హైకమాండ్. ఒకరి కామెంట్స్‌కు మరొకరు రియాక్ట్ అవడం అంతా అయిపోయింది. ఆ తర్వాత పార్టీ పెద్దలు సీరియస్‌గా ఉన్నారన్న వార్తలతో ఆ ఇద్దరు నేతల కామ్ అయిపోయారు.అయినా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి విజయవాడ ఎంపీ వివాదాన్ని పార్టీ క్రమశిక్షణా కమిటీకి బాబు అప్పగించారు. వారిద్దరితో కమిటీ మాట్లాడాలని అధినాయకత్వం ఆలోచనలు వారికి చెప్పాలని సూచించారు. ఇద్దరి అభిప్రాయలను తనకు ఒక లేఖ రూపంలో ఇవ్వాలన్న బాబు..లండన్ టూర్ నుంచి వచ్చిన తర్వాత ఆ ఇద్దరిని పిలిచి మాట్లాడుతానని చెప్పారట. వాళ్లిద్దరి పిలిచి మాట్లాడటం కంటే ముందే..ఇండైరెక్ట్ వార్నింగ్స్‌తోనే లైన్‌లోనే పెట్టే ప్రయత్నం చేస్తున్నారట చంద్రబాబు.



## మృగాళ్ళ ఆటవిక వాంఛలకు

# బలైపోతున్న పసిగుడ్లు



❑ ప్రజా ప్రతినిధుల ముసుగులో పాశవిక మృగాళ్ల చర్యలు ❑ బాపూజీ కోరిన స్వాతంత్ర్యం, అందని ద్రాక్షలా మారిన వైనం ❑ అర్ధరాత్రి ఆడది నడవడం ప్రక్కన పెడితే, పసి పిల్లలకే కరువై పోయిన రక్షణ

❑ మొన్న మాచవరం, నిన్న తుని, నేడు బాణాపురం అనేట్లు కనబడుతున్న పరిస్థితి ❑ అరచేతిలో అశ్లీలతను పెంచే వెబ్‌సైట్‌లు, వెబ్ సిరీస్‌లపై కొరడా తప్పనిసరి

ప్రత్యేక కథనం రిపోర్టర్ చందు రాయవరం

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో పురుషుల వేదింపులు, అమానవీయ చర్యలతో స్త్రీలకు రక్షణ కరువైందని ఆవేదనతో కూడిన ఆర్తనాదాలు మిన్నంటుతుండగా, అంతకంటే భయంకరంగా పసిపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న మృగాళ్ల సంఖ్య పెరిగిపోవడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. మొన్న మాచవరం,నిన్న తుని , నేడు బాణాపురం అన్నట్లుగా, జరిగిన ఘటనలు ఇందుకు ఉదాహరణలు. మాచవరం లో ఉపాధ్యాయుని ముసుగులో మైనర్ బాలికను తల్లిని చేసిన ఉపాధ్యాయ వృత్తికే అపకీర్తి తెచ్చిన మృగాడి ఘటన మరువక ముందే, గత వారం లో కాకినాడ జిల్లా, తుని గురుకుల పాఠశాల లో చదువుతున్న మైనర్ బాలికను మాయ మాటలు చెప్పి, తాతను అని నమ్మించి, బాలికకు చిన్న, చిన్న వస్తువులు ఇచ్చి సహాయపడుతున్నట్లుగా నటించి, ఆ బాలిక పై పలుమార్లు అఘాయిత్యానికి ఒడిగట్టడం జరగగా, స్థానిక యువకుల ప్రశ్నించడంతో ఘటన వెలుగు లోకి వచ్చి, రాష్ట్రంలో సంచలనంగా మారింది. ఘటన జరిగి నెల రోజులైనా గడవకుండానే మరో పాశవిక ఘటన వెలుగు చూడడం చిన్నారుల భవితవ్యానికే ప్రశ్నార్థకంగా కనబడుతుంది. ఉపాధ్యాయునిగా కనబడుతూనే కీచకుని గా వ్యవహరించి, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం మండలం,బాణాపురం లో చిన్నారి జీవితాన్ని చిదిమేసిన ఘటన మరింత ఆందోళన కలిగిస్తుంది. బాలికలకు చిన్నపాటి తినుబండారాలు అందిస్తూ వారిని లొంగదీసుకుని వారిపై అఘాయిత్యాలకు పాల్పడడం పరిపాటిగా మారింది. తమ జాతికి చెందిన పసి జంతువులపై, పశువులైనా జాలి చూపిస్తాయి కాని కళ్ళముందు నడయాడిన పసిపిల్లలతో తమ కామవాంఛ తీర్చుకోవడానికి ఏమాత్రం వెనకాడని మృగాళ్ళ పోకడలు. మనిషి కన్నా పశువులే నయం అనిపించేలా చేస్తున్నాయి. కాగా రెండు ఘటనల లో అఘాయిత్యాలకు పాల్పడిన వారు ప్రజా ప్రతినిధులుగా సమాజంలో చెలామణి అవడం మరొక దౌర్భాగ్య అంశం. బాధ్యత కలిగిన స్థానంలో ఉండి, ప్రజా సమస్యలపై మాట్లాడే స్థానంలో ఉన్న వారు పాశవిక చర్యలకు పాల్పడడం చూస్తే, అధికార మధం ,ఏం చేసినా చెల్లుతుంది అనే స్వభావం మరింత దిగజారి పోయేలా ప్రవర్తింపచేస్తున్నాయా అనే అనుమానం కలుగుతోంది. బ్రిటిష్ వారు వెళ్ళిపోతే కాదు, అర్థరాత్రి ఆడది ఒంటరిగా తిరిగిన నాడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లని మహాత్మా గాంధీ గంటాపదంగా చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ, అర్థరాత్రి స్త్రీ ఒంటరిగా నడిచి వెళ్ళడం సంగతి ప్రక్కన పెడితే, పట్టపగలు ఆడుకునే పసిపిల్లలకే భద్రత కరువైందని మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గాంధీజీ కోరిన స్వాతంత్ర్యం దేశంలో రావాలంటే పటిష్ఠమైన చట్టాలు దేశంలో అమలు కావాలని, అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులను వాయిదా పద్ధతిలో కాక, పాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నేర నిరూపణ జరిగించి, నిందితుడిని నెలలు,సంవత్సరాలు పోషించకుండా నిర్ధారణ జరిగిన వెంటనే కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. దేశ ద్రోహ నేరానికి ఎలాంటి శిక్షలు అమలు చేస్తున్నారో, అలాంటి కఠినమైన శిక్షలను నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా, శిక్షిస్తే ఫలితం ఉంటుందని పలువురు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా దేశంలో మహిళలంటే ప్రారంభం నుండి సమాజంలో చిన్నచూపు చోటుచేసుకోవడం, దీనిని అలుసుగా తీసుకుని పురుషాహంకారం రాజ్యమేలడం మహిళలు, మైనర్ బాలికలపై అఘాయిత్యాలు జరిగేందుకు మూల కారణమని చెప్పవచ్చు, భారత విద్యా వ్యవస్థలో ప్రాథమిక స్థాయి నుండే మహిళలపై గౌరవం పెరిగేలా పాఠ్యాంశాలు రూపొందించాలి, అరచేతిలో ఉన్న మొబైల్ ఫోన్ ద్వారా అశ్లీలతను ప్రోత్సహించే వెబ్సైట్ లు, వెబ్ సిరీస్ లను అదుపు చేయడం అత్యవసరం, నిఘా వ్యవస్థ ను పటిష్ఠం చేసి మహిళలు, మైనర్ లకు భద్రత కల్పించేలా పాఠశాలలు, పలు ప్రాంతాలలో మహిళా పోలీసుల పర్యవేక్షణ ఏర్పాటు చేసి, పాఠశాలలను వారానికి ఒకసారి సందర్శించి విద్యార్థిని లతో మాట్లాడి, పరిస్థితులను గమనించేలా చర్యలు తీసుకోవాలి , తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు "గుడ్ టచ్, బ్యాడ్ టచ్" అవగాహన కల్పించి ఎలా స్పందించాలో వారికి నేర్పించాలి, పిల్లల భద్రత విషయంలో రాజీ పడకూడదనే విషయం గతం లో జరిగిన పలు సంఘటనలు సాక్ష్యాలుగా కనబడుతున్నాయి. ముక్కు పచ్చలారని పసితనంలో మృగాళ్లకు పుట్టే కామవాంఛ, అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రుల జీవితాలలో వెలుగును దూరం చేసి మోడువారేలా చేస్తోంది.



మహిళల భద్రతకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా పాఠశాలలు, బాలికలు తిరిగే ప్రాంతాలలో మహిళా పోలీసులు, భద్రతా సిబ్బంది పర్యవేక్షణ పెంచి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. మహిళలు,బాలికల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి చట్టాలు బలహీనంగా ఉంటే వాటిని సమీక్షించి, తప్పు చేయడానికి భయపడేలా చట్టాలను రూపొందించాలి.

**డి.ఆదిలక్ష్మి**
**ఐద్వా జిల్లా కార్యదర్శి, పసలపూడి**



సమాజంలో మహిళలపై ఉన్న చిన్న చూపు, సోషల్ మీడియా వంటి ప్లాట్ ఫాంలలో అశ్లీలత అధికమై పోవడం వలన పాశవికత వైపు యువతను నడిపిస్తుంది. ప్రజా ప్రతినిధులే చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడడం దేశ భవిష్యత్తును నాశనం చేయడమే అవుతుంది. ఆధ్యాత్మికత, సమాజంలో బాధ్యత కలిగిన ప్రవర్తన యువతకు నేర్పించడం ద్వారా సమాజాన్ని, తదుపరి తరాలను కాపాడుకోవచ్చు.

**ఎస్. కాంతికళ**
**మోటివేషనల్ స్పీకర్, బలభద్రపురం**

---

### ప్రభుత్వ వైద్య కళాశాలను

## ప్రైవేటుపరం చేస్తే పతనం తప్పదు : కంటే

### జగన్ సంక్షేమ పథకాలు ఎత్తేశారు



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటుపరం చెయ్యడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ప్రజాగ్రహానికి గురైన ఎన్డీఏ ప్రభుత్వానికి పతనం తప్పదని వైయస్సార్సీపి జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ సభ్యుల కంటే వినయ్ తేజ జోష్యం చెప్పారు. సోమవారం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటు పరం చేయడంపై పార్టీ, కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా కంటే మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రానికి సుమారు 15 ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులు తీసుకువచ్చి ఐదు వైద్య కళాశాలను పూర్తి చేశారని,ఎన్డీఏ ప్రభుత్వం కుట్రపూరితంగా వీటిని ప్రైవేట్ పరం చేయడానికి చర్యలు చేపట్టిందని దీనిని సహించేది లేదని కంటే ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విధానం వల్ల పేదల వైద్యవృత్తికి దూరం కాక తప్పదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం జగన్ పథకాలకు పేరు మార్చి, పరాకోరా సంక్షేమ పథకాలను తూతూ మంత్రంగా కొనసాగిస్తుందన్నారు. బూరుగుపూడి గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పిట్టా కృష్ణ, సూర్యనారాయణ, గణేశుల పోసియ్య, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ఉమా మార్కండేయస్వామి ఆలయం నూతన కమిటీ

### భక్తుల మనోభావాలకు అనుగుణంగా పని చేయాలి - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భక్తుల మనోభావాలకు అనుగుణంగా పని చేయాలని ఉమా మార్కండేయస్వామి ఆలయం నూతన పాలకవర్గానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం పరిధిలో దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆలయాలకు వరుసగా కమిటీలు వేయడం జరుగుతోంది. ఈ కమిటీలో భాగంగా నగరంలో అతి ముఖ్యమైన ప్రాచీన దేవాలయమైన గోదావరి గట్టున ఉన్న శ్రీ ఉమా మార్కండేయస్వామి ఆలయానికి నూతనంగా నియమించబడిన కమిటీని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదివారం తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో నగర టీడీపీ కమిటీ కోశాధికారి శెట్టి జగదీష్‌తో కలిసి వెల్లడిరచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైర్మన్‌గా మదన్ సింగ్ రాజా పురోహిత్, సభ్యులుగా పెండ్యాల నాగేశ్వరరావు, రాజా పురోహిత్ రూప్‌సింగ్, బి రవికుమార్, బ్రింగిమళ్ళ పద్మావతి, శనపతి సత్తిబాబు, గ్రంధి సువర్చల, పుచ్చల లీలావతి, బంగారు దీపిక, గొంగాడ సురేష్, బి గౌతమిలను నియమించినట్టు తెలిపారు. అలాగే ఎక్స్ అఫిషియో సభ్యులుగా నీలకంఠ శర్మను నియమించినట్టు తెలిపారు. ఈ కమిటీ త్వరలోనే అధికారికంగా ప్రమాణస్వీకారం చేయనుందన్నారు. ఉమా మార్కండేయస్వామి ఆలయం ఎంతో ప్రతిష్టాత్మకమైనదన్నారు. పుష్కరాల ఆ ఆలయం సమీప ప్రాంతంలో జరుగుతాయన్నారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని, భక్తులకు కావాల్సిన సౌకార్యాలు కల్పిస్తూ సమర్ధవంతంగా పని చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. కూటమి విజయం కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి పదవులు ఇవ్వడం జరుగుతోంద న్నారు.గత వైకాపా పాలనలో అప్పటి పాలకులు ఈ దేవాలయాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. క్షమించరాని పాపం చేశారని దుయ్యబట్టారు. వారు చేసిన తప్పిదాన్ని గుర్తించి కూటమి అధికారంలోకి వచ్చిన ఈ 15 నెలల్లోనే సరి చేశామన్న విషయాలను త్వరలోనే చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

---

### తుఫాన్ బాధిత కుటుంబాలకు

## ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనపర్తి నియోజకవర్గం తహసీల్దార్ కార్యాలయంలో "మొంథా" తుపాన్ బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ఒక్కొక్కరికి రూ.1000/- చొప్పున, కుటుంబానికి గరిష్టముగా రూ.3000/- చొప్పున నగదు రిలీఫ్ పంపిణి కార్యక్రమంలో భాగంగా అనపర్తి మండలానికి సంబంధించిన 166 కుటుంబాలకు 408 మందికి 3 లక్షల 45 వేల రూపాయలు, బిక్కవోలు మండలానికి సంబంధించి 81 మందికి 74 వేల రూపాయలు తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అందించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఈరోజు ఏదైతే మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలలో పునరావాస కేంద్రాలకి కొంతమంది బాధితులను తరలించడం జరిగింది. ఆ బాధితులకి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలి,ఆర్థిక సహకారం అందించాలి, నిత్యవసర వస్తువులను ఇవ్వాలని ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. దానిలో భాగంగానే ఇప్పటికే నిత్యవసర వస్తువులు ఇవ్వడం జరిగింది. ఈరోజు ఒక్కొక్కరికి 1,000/- రూపాయలు గరిష్టంగా కుటుంబానికి 3,000/- రూపాయలు చొప్పున అనపర్తి మండలానికి సంబంధించిన 166 కుటుంబాలకు 408 మందికి 3 లక్షల 45 వేల రూపాయలు, బిక్కవోలు మండలానికి సంబంధించి 81 మందికి 74 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించడం జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా ఆర్థిక సహకారం అందించింది అనపర్తి నియోజకవర్గంలోనే కావటం విశేషం. ముఖ్యంగా ఏదైతే చంద్రబాబు నాయుడు ముందస్తు ప్రణాళికతో ఈ తుఫాను ప్రజలకు పెద్ద ఎత్తున ఇబ్బంది కలిగించకుండా ముందస్తు చర్యలు చేసుకోవడం జరిగింది. ముఖ్యమంత్రి సూచనలని అధికార యంత్రాంగం పూర్తిగా పాటించి సంపూర్ణంగా ప్రజలను రక్షించడంలో అధికార యంత్రాంగం కూడా తీవ్రంగా కృషి చేసింది దానికి అధికార యంత్రాంగానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూన్నాను. అదేవిధంగా రైతులకు సంబంధించి పెద్ద ఎత్తున సహకారం అందించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే అనపర్తి నియోజకవర్గంలో దాదాపుగా 150 కోట్ల రూపాయల మేరకు పంట నష్టం వాటిల్లిందనేది ప్రాథమిక అంశానికి వచ్చాం. పూర్తిస్థాయిలో ఎన్యూమిరేషన్ జరిగిన తర్వాత ప్రభుత్వానికి అధికారికంగా నివేదిక ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కలిసి పెద్ద ఎత్తున రైతులను ఆదుకునే దిశగా ముందు వెళ్తా ఉండడం జరుగుతోంది. ఏది ఏమైనా ఈ తుఫాను వైపరీత్యం ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోకుండా నివారించడంలో ముఖ్యమంత్రి సూచనలు మేరకు అధికార యంత్రాంగం తీవ్ర కృషి చేసింది. వారందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## 4వ డివిజన్ ఎంపీపీ స్కూల్ ఆధునీకరణ పనులు ప్రారంభం

### సమాజంలో కీలకమైన ఆయుధం విద్య : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో అతి కీలకమైన ఆయుధం కేవలం ఒక విద్య మాత్రమేనని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 4వ డివిజన్ రాజేంద్రనగర్‌లో రౌండ్ టేబుల్ ఇండియా వారి సీఎస్ఆర్ నిధులు రూ. 9 లక్షలతో ఎంపీపీ (సంఘం పాక స్కూల్) స్కూల్‌లో ఆధునీకరించిన పనులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం తాడేపల్లిగూడెం పరిశీలకులు నక్కా చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పాఠశాల పరిస్థితిని నక్కా చిట్టిబాబు తన దృష్టికి తీసుకురాగా మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. అయితే సాంకేతిక కారణాల ఆ పనులు చేసేందుకు వీల్లేనందున తాను రౌండ్ టేబుల్ ఇండియా వారి సహకారాన్ని కోరగా వారు వెంటనే స్పందించి సదరు పాఠశాల శ్లాబ్ లీకేజ్‌లు, మరుగు దొడ్ల అభివృద్ధి తదతర పనులను రూ. 9 లక్షలతో చేపట్టారని అభినందించారు. పాఠశాల అనేది ప్రతి ఒక్కరిది అని అన్నారు. అటువంటి దానికి సమస్య వస్తే ప్రతి ఒక్కరూ స్పందించి సహకారం అందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను శాసన సభ్యుడిగా ఎన్నికైన తరువాత నగరంలో మూడు స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా మార్చామని గుర్తు చేశారు. మోరంపూడి స్కూల్లో తరగతి గదులు నిర్మించాలని రౌండ్ టేబుల్ ఇండియా వారిని కోరగా అందుకు వారు అంగీకరించడం సంతోషించదగిన విషయమన్నారు. అలాగే మరిన్ని పాఠశాలల అభివృద్ధికి సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. గత పాలకులు పేదలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాళ్లను సచివాలయాలుగా మార్చేశారని అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సదరు కమ్యూనిటీ హాళ్లను పేదలకు అందుకు బాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టిందని, త్వరలోనే ఆ కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించనున్నామని తెలిపారు. నక్కా చిట్టిబాబు మాట్లాడుతూ సమస్యల పట్ల త్వరగా స్పందించి పరిష్కారం దిశగా ఆలోచనలు చేసే వ్యక్తి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అని కొనియాడారు. తన వద్దకు సమస్య అంటూ వచ్చిన ప్రజలకు క్షణాల్లో పరిష్కారం చూపుతున్నారని, తన జీవితంలో ఇటువంటి నాయకుడు, ప్రజా ప్రతినిధిని ఎన్నడూ చూడలేదన్నారు. నగరాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన పని చేస్తూ అందరి మన్నన్నలు పొందుతున్నారని అన్నారు. అలాగే కార్పొరేటర్‌గా పాఠశాలతో ఉన్న అనుబంధం, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా వివరించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన రౌండ్ టేబుల్ ఇండియా చైర్మన్ మోహన్, వైస్ చైర్మన్ వరుణ్ జెట్టి, సెక్రటరీ సూర్య, శ్రీనివాస్, ఆది శంకర్, తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశి నవీన్ కుమార్, బండారు శ్రీనివాస్, జక్కంపూడి అర్జున్, యాళ్ల శ్రీనివాస్, బుడ్డిగ రవి, గూటాల సంజీవ్, గుత్తుల రమేష్, అప్పిరెడ్డి కుమార్, బొట్టా వీరబాబు, శేఖర్, విద్య శాఖ అధికారులు, అధిక సంఖ్యలో స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం 4 నవంబర్ 2025
www.viswamvoice.com
ఎడిటోరియల్
విశ్వంవాయిస్

# ఎడిటర్ వాయిస్

## రైతుల వెన్నువిరుస్తున్న విపత్తులు!

తెలుగు రాష్ట్రాలను, అందులో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌ను కకావికలం చేసిన మొంథా తుపాను సృష్టించిన విలయానికి తీరప్రాంత ప్రజల జీవనం అస్తవ్యవస్థమై పోయింది. తుపాను ధాటికి పంటలు నీట మునిగి రైతులు నిండా మునిగి పోయారు. ఎటు చూసినా పంట పొలాలు సముద్రాలను తలపించాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు నీటి పాలు కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంట నీళ్లలో తెలియాడుతుంది. పూత కాత దశలోని పత్తి, ఇతర పంటలు మురిగి పోతున్నాయి. కళ్లాల్లో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న చేతికి అందకుండా పోయింది. మిర్చి, మొక్కజొన్న, కందులు, పెసరతో పాటు బొప్పాయి, అరటి వంటి ఉద్యానవన పంటలూ ప్రకృతి ప్రకోపానికి గురయ్యాయి. ఎడతెరిపి లేని కుండపోత వానలకు తోడు తుపాన్ తీరం దాటేవేళ విరుచుకుపడ్డ పెనుగాలుల బీభత్సం రైతులకు అపార కష్టం మిగిల్చింది. చేతికొచ్చిన పంటలు నీట మునగ డంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రతి సీజన్‌లోనూ, పకృతి వ్యవసాయ రంగానికి ఒక సవాల్ విసురుతుంది. ప్రతికూల వాతావరణం ప్రతిఫలం రైతు చేతికి అందకుండా చేస్తుంది. రైతుకు కష్టాలే పెట్టుబడి, కన్నీళ్లే దిగుబడిగా మారింది. ప్రతి ఏడాది రైతులకు వాయుగండమే. ఈ ఏడాది కూడా వదలలేదు. వరుణ దేవుడు పంట చేతికి వస్తుందనుకుంటున్న సమయానికి తన ప్రతాపం చూపనే చూపాడు. మొంథా తుఫాన్ దాటికి 17 శాఖలకు చెందిన వివిధ రంగాలకు మొత్తం రూ. 5,244 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇవి ప్రాథమిక అంచనాలు మాత్రమే, పూర్తిస్థాయి వివరాలు అందాక నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. 250 మండలాల పరిధిలోని 1,434 గ్రామాలు, 48 పట్టణాలపై తుపాన్ ప్రభావం పడింది. 161 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు సమాచారం. ప్రభుత్వం సచివాలయంలో రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కార్యాలయం నుంచి 'మొంథా' గమనాన్ని పరిశీలిస్తూ.. ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆస్తి నష్టం, ప్రాణ నష్టం లేకుండా నివారించింది. అయినా నష్టం సంభవించింది. వ్యవసాయ రంగానికి సంబంధించి 1.38 లక్షల హెక్టార్ల లోని 2.96 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు దెబ్బతిని దాదాపు రూ. 829 కోట్ల మేర రైతులు నష్టపోయినట్లు సమాచారం. మొత్తం 1.74 లక్షల మంది రైతులపై తుపాన్ ప్రభావం పడింది. 12,215 హెక్టార్లలో రూ. 40 కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 23,979 మంది రైతులకు నష్టం వాటిల్లింది. ఆక్వా రంగంలో 32 వేల ఎకరాల్లోని రూ. 514 కోట్ల విలువైన పంటను నష్ట పోయారు. 2,261 పశుసంపదను పశుపోషకులు కోల్పోయారు. 4,794 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్లు, 311 కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఈ నష్టం రూ. 2,774 కోట్ల వరకు ఉంది. ?ఇక రాష్ట్ర వ్యాప్తంగా 2,817 విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా.. 26,575 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. 429 కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ శాఖకు రూ. 19 కోట్ల నష్టం జరిగినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం విపత్తు బాధితులను ఆదుకునే పరిస్థితి లేదు. గతంలో వలే కేంద్ర ప్రభుత్వం అరకొర సాయం చేసి చేతులు దులుపుకోకుండా రాష్ట్రాన్ని పూర్తి స్థాయిలో ఆదుకోవడానికి ముందుకు రావాలి. వానలొచ్చి పంటలు పాడైన ప్రతీ రైతన్నను ఆదుకోవాలి. ఆపత్కాలంలో సత్వరం సరైన చేయూత అందిస్తేనే రైతుల బతుకులు తెరిపిన పడతాయి. ప్రకృతి ఉత్పాతాలకు బలైన రైతులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం మానవీయంగా వ్యవహరించాలి. విపత్తులు నష్టాన్ని అంచనా వేయడానికి వచ్చే కేంద్ర బృందాలు వారికి తీరినప్పుడు నష్టం అంచనా వేయడానికి చుట్టపు చూపుగా రావడం తప్ప రాష్ట్రానికి వస్తున్న పరిహారం అరకొరే. విపత్తుల వల్ల జరిగిన నష్టాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు సరైన నమూనా అను సరించడం లేదు. ఖరీఫ్‌లో పంటలు దెబ్బ తింటే నష్టం అంచనా వేయడానికి రబీలో వస్తారు. రబీ పంటలు దెబ్బ తింటే ఖరీఫ్‌లో వస్తున్నాయి ఈ కేంద్ర బృందాలు.. పైగా నష్టం అంచనా



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# అసమాన మేధావి శకుంతలా దేవి

ఆమె అంక గణితంలో నిపుణురాలు. గణితావధాని. చాలా వేగంగా గణనలు చేయగల సామర్థ్యం కలిగిన ఆమెను "మానవ కంప్యూటర్" అని పిలుస్తారు. గణిత మాంత్రికు రాలిగా సుప్రసి ద్ధులు. శతాబ్దంలో ఆమెకు ఏదైనా తేదీ ఇస్తే, అది వారంలో ఏ రోజు పడిపోయిందో చెప్పగలిగిన అసాధారణ ప్రజ్ఞాశాలి. మైండ్ డైనమిక్స్' అని పిలిచే భావనను అభివృద్ధి చేసిన మేధావి. ఆమెనే మానవ నిర్మిత కంప్యూటర్ కన్న గొప్ప గణకురాలిగా ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందిన గణిత శాస్త్ర వేత్త శకుంతలా దేవి. శకుంతలా దేవిని (నవంబరు 4, 1929 –ఏప్రిల్ 21, 2013 ) మానవ గణన యంత్రము అని పిలుస్తారు. ఆమె ప్రపంచ వ్యాప్తంగా అనేక గణితావ ధానములు నిర్వహించి గణన యంత్రము కంటే వేగంగా పలు సమస్యలను పరిష్కరించారు. ప్రపంచంలో అతి వేగంగా గణనలు చేయుటలో గిన్నిస్ వరల్డ్ రికార్డును స్వంతం చేసుకున్నారు. బెంగళూరులోని బ్రాహ్మణ పూజారుల ప్రసిద్ధ కుటుంబంలో జన్మించిన శకుంతల దేవి తన తాత నుండి గణితంలో ప్రారంభ పాఠాలు పొందారు. ఐదు సంవత్సరాల వయస్సులో ఆమె చైల్డ్ ప్రాడిజీగా మరియు సంక్లిష్ట మానసిక అంక గణితంలో నిపుణురాలిగా గుర్తించ బడింది. ఆ చిన్న వయస్సులో, ఆమె క్యూబ్ మూలాలను లెక్కించటం వంటి గణిత సమస్య లను పరిష్కరించడంలో నిపుణు రాలు అయ్యింది. ఒక సంవత్సరం తరువాత మైసూర్ విశ్వ విద్యా లయంలోని విద్యార్థులు, ప్రొఫెసర్ల పెద్ద సమావేశానికి వెళ్ళి ఆమె తన ప్రతిభను ప్రదర్శించింది. ఎనిమిదేళ్ల వయసులో అన్నామలై విశ్వ విద్యాలయంలో ఆమె ప్రదర్శనతో శకుంతలాదేవిని బాలమేధావిగా గుర్తించారు. శకుంతలాదేవి 1960లో కోల్‌కతాకు చెందిన ఐఏఎస్ పరితోష్ బెనర్జీని వివాహం చేసుకున్నారు. బెనర్జీ స్వలింగ సంపర్కం గురించి వెల్లడి కావడంతో ఆ వివాహం త్వర లోనే విడిపోయింది. అయితే ఈ ఘటన శకుంతల దేవికి, ఉత్ప్రేరకంగా పనిచేసింది, ఆమె మానవత్వం గురించి లోతుగా పరిశోధించడానికి సహాయపడింది. 1977 లో ది వరల్డ్ ఆఫ్ హెూమో సెక్సువల్స్ అనే పుస్తకాన్ని రాయడానికి ఆమెను దారితీసింది. అమె రాసిన పుస్తకంలో స్వలింగ సంపర్కం అనైతికం అనే విషయాన్ని ఆమె సవాలు చేసింది. శకుంతలాదేవి తన సామర్థ్యాలను, తన సామర్థ్యాలను ఉపయోగించు కుంటూ, తన జీవితాన్ని అన్వే షించి,



మానవత్వాన్ని చాటుకునే తపనతో, తన జీవితాన్ని గురించి ప్రసంగాలలో చెబుతూ ఉండేవారు. ఆమె ఎన్నో రచనకు చేశారు. మానవ మనస్సు కంప్యూటర్ కంటే సాటిలేని సామర్థ్యాలను కలిగి ఉందని, మానవ మనస్సును కంప్యూటర్లతో పోల్చడం సము చితం కాదని ఆమె అభిప్రాయ పడ్డారు. శకుంతలా దేవి తమ గణిత ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో పర్యటించారు. ఆమె తన తండ్రితో కలిసి 1944 లో లండన్‌కు వెళ్లారు. ఆమె 1950 లో ఐరోపా పర్యటన 1976లో న్యూయార్క్ నగరంలో ప్రదర్శనలు ఇచ్చారు. 1988 లో, బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో విద్యా మనస్తత్వ శాస్త్రం ప్రొఫెసర్ ఆర్థర్ జెన్సన్ వద్ద అధ్యయనం చేయటానికి ఆమె వెళ్లారు. ఆర్థర్ జెన్సెన్ స్వయంగా శకుంతలా దేవి గణిత ప్రతిభను పరిశీలించి అవాక్కయ్యారు. 1977లో అమెరికాలో ఓసారి ఒక కంప్యూటర్ తో శకుంతలా దేవికి పోటీ పెట్టారు. 188132517 అనే సంఖ్యకు మూడో వర్గం కనుక్కో వడంలో పోటీ పెట్టగా, ఆమె కంప్యూటర్ ను ఓడించారు. 1980 జూన్ నెలలో 13 అంకెలున్న రెండు సంఖ్యలు తీసుకున్నారు. 76,86,36,97,74,870 అనే సంఖ్యతో 24,65,09,97, 45,779 అనే సంఖ్యను హెచ్చవేస్తే ఎంత వస్తుందని లండన్ ఇంపీరియల్ కాలేజిలోని కంప్యూటర్ విభాగంలోని ఓ సూపర్ కంప్యూటర్ శకుంతలా దేవిని ప్రశ్నించింది. దానికిఅయితే ఆమె కేవలం 28 సెకన్లలో... 18,947,668, 177,995, 426, 462, 773,730... సమాధానం ఇచ్చారు. అలా గిన్నిస్ బుక్ రికార్డ్ ఆమె సొంతం అయింది. ఆమె గత శతాబ్ద కాలంలో ఏ తేదీ చెప్పినా అది ఏ వారం అవుతుందో క్షణంలో ఆమె చెప్పేవారు. దేవి 1969 లో ఫిలిప్పీన్స్ విశ్వ విద్యాలయం విశిష్ట మహిళల పురస్కారాన్ని గెలుచుకుంది. ఆమె 1988 లో వాషింగ్టన్ డిసిలో రామానుజన్ మ్యాథమెటికల్ జీనియస్ అవార్డుతో సత్కరించింది. తమ 83వ ఏట 2013 ఏప్రిల్ 21న ఆమె బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో కన్ను మూశారు. గణితశాస్త్రాన్ని, ప్రాచీనకాలం నుండి ఎంతోమంది భారతీయులు అభివృద్ధి పరుస్తూ వచ్చారు. భారతీయ గణిత ఆవిష్కరణల్లో ముఖ్యమైనవిగా సున్నా వాడకం, బీజ గణితం వంటివాటిని చెబుతారు. ప్రపంచంలో మేధావులుగా గుర్తించ బడిన ఆర్యభట్ట, వరాహ మిహిర కాలం నుండి అంకగణిత ప్రాధాన్యత ఉన్నప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో విద్యార్థులలో గణిత ఫోబియా అధికం అవుతుంది. ఉన్నత చదువుల కోసం గణితాన్ని ఎంచుకునే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. భారతదేశంలో సుమారు 1.3 మిలియన్ల పాఠశాలలు, 800 విశ్వవిద్యాలయాలను కలిగి ఉన్నా, గణిత ఉపాధ్యాయుల సంఖ్య నానాటికీ దిగదుడుపే అవుతున్నది. దేశంలో ఇంజనీరింగ్, ఉత్పత్తి, సమాచార సాంకేతికత, అంతరిక్ష తదితర శాస్త్రాలలో గణిత శాస్త్ర నిపుణులు అవసరం ఉన్న దృష్ట్యా, ప్రభుత్వాలు గణిత శాస్త్ర నిపుణులను తయారు చేయాల్సి ఉంది. అలాగే ఐదేళ్ళ నుండి 80ఏళ్ళ పైబడిన వయసు దాటే వరకు వరకు అవిశ్రాంతంగా కృషి గణిత శాస్త్రం లో విశేష కృషి చేసిన మాస్టర్ మైండ్ శకుంతలా దేవి ఆదర్శంగా, విద్యార్థులు భయాన్ని వీడి గణితంలో నిపుణులు కావలసిన అవసరం అనివార్యంగా ఉంది.

# పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం

రాజ్యాంగ ముసాయిదాను 21 ఫిబ్రవరి 1948 నాటికే పూర్తి చేశారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన 04 నవంబర్ 1948 రోజున రాజ్యాంగ సభలో అధికారికంగా రాజ్యాంగ ముసాయిదాను ప్రవేశపెట్టిన కీలక ఘట్టం తర్వాత రాజ్యాంగ ముసాయిదాపై తొలి పఠనం ప్రారంభమైనది. ఈ రోజున రాజ్యాంగ ముసాయిదాపై లోతైన చర్చలు, సవరణలు ప్రతిపాదించడం జరిగింది. నాటి రాజ్యాంగ సభ(కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ)లో ప్రతి సభ్యుడికి రాజ్యాంగ ముసాయిదా కాపీని అందించారు. తదుపరి 04 నవంబర్ నుంచి 09 నవంబర్ 1948 వరకు మొదటి పఠనం జరిగింది. ముసాయిదాపై దాదాపు 10 రోజున పాటు చర్చలు జరిగిన పిమ్మట 17 నవంబర్ 1948 వరకు కొనసాగాయి. రాజ్యాంగ సభలోని నాటి సభ్యులు రాజ్యాంగ ముసాయిదాలోని పలు అంశాలపై చర్చలు జరిపి సూచనలు, సవరణలు తెలియజేశారు. తదుపరి వివిధ అధికారిక వాటాదారుల సూచనల ఆధారంగా కొన్ని సవరణలు కూడా జరిగాయి. భారత రాజ్యాంగాన్ని 2 ఏండ్ల 11 నెలల, 18 రోజుల్లో తయారు చేయడం జరిగింది. రాజ్యాంగ సభ 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశం అయ్యింది. ఇందులో 114 రోజులు రాజ్యాంగ రాతప్రతిపై చర్చకు వెచ్చించారు. రాతప్రతిలో 7,635 సవరణలు ప్రతిపాదించగా, అందులో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరిం చింది. భారత రాజ్యాంగాన్ని 26 నవంబర్ 1949న సభలో ఆమోదించారు. 24 జనవరి 1950న 284 మంది రాజ్యాంగ సభ్యులు చిరు జల్లు పడుతున్న శుభవేళ సంతకాలు చేసారు. 26 జనవరి 1950 రోజున భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వేళ మనం గణతంత్ర దినోత్సవాన్ని ప్రతి ఏట ఒక పరమ పవిత్ర పర్వదినంగా, ఘనంగా



నిర్వహించుకుంటున్నాం. ఆ రోజున భారత రాజ్యాంగ సభ రద్దయి, తాత్కాలిక పార్లమెంట్‌గా మారింది. 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో కొత్త పార్లమెంట్ ఏర్పడింది. స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని తయారు చేయడానికి ఒక రాజ్యాంగ సభ లేక రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. ఈ సభలో రాష్ట్ర శాసనసభల ద్వారా ఎన్నికైన సభ్యులు 292, భారత్ సంస్థానాల నుండి ఎన్నికైన సభ్యులు 93 మంది, ఛీఫ్ కమీషనర్ ప్రావిన్సుల ప్రతినిధులు నలుగురు కలిపి మొత్తం 389 మంది ఉన్నారు. రాజ్యాంగ సభ తొలి సమావేశం పార్లమెంట్ భవనంలో 09 డిసెంబర్ 1946న జరిగింది. జవహర్ లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్, ఆచార్య కృపలానీ, డా రాజేంద్రా ప్రసాద్?, సరోజినీ నాయుడు, బి ఆర్ అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాలి సీతారామరాజు మొదలైన సభ్యులు ఉన్నారు. రాజ్యాంగ రాతప్రతిని తయారు చేయడానికి బి ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేసారు. భారత రాజ్యాంగంలో అవతారిక, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశిక సూత్రాలు, కార్యనిర్వాహక వ్యవస్థ (ప్రభుత్వం, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలి), శాసన వ్యవస్థ (పార్లమెంట్, ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు, జిల్లా కోర్టు), రాష్ట్రాలు (శాసన సభ, శాసన మండలి, గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం), ఎన్నికల వ్యవస్థ (రాజకీయ పార్టీలు, లోకసభ, రాజ్యసభ, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, రాష్ట్ర పార్టీలు, రాష్ట్ర శాసన సభ, రాష్ట్ర శాసన మండలి, స్థానిక సంస్థల ఎన్నికలు) లాంటివి పొందుపరుచబడ్డాయి. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగం సగర్వంగా నిలుస్తున్నది. ఇందులో అవతారిక, 448 అధికరణాలు, 12 షెడ్యూళ్ళతో కూడిన మహా గ్రంథం మన రాజ్యాంగం. మొదట్లో అవతారికలా భారత దేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పేర్కొన్నారు. తదుపరి జరిగిన 42వ రాజ్యాంగ సమరణ ద్వారా సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా మార్చారు. నేటికి భారత రాజ్యాంగంలో మొత్తం 106 సవరణలు జరిగాయి. మొదటి రాజ్యాంగ సవరణ 1951లో జరుగగా, 106వ రాజ్యాంగ సవరణగా "నారీ శక్తి వందన్ చట్టం(చట్ట సభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు)" 2023లో జరిగింది. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు శాంతి, సమైక్యత, సంపద, సౌభాగ్యాలను అందించే మహా గ్రంథంగా మనకు మార్గనిర్దేశనం చేస్తున్నది. సమయానుకూలంగా, ప్రాధాన్యతా క్రమంలో భారత రాజ్యాంగంలో సవరణలు చేస్తున్నాం. రాజ్యాంగం గురించి తెలుసుకోవడం మాత్రమే ముఖ్యం కాదని, దానిని తూచా తప్పకుండా పాటించాలనా మరిచిపోరాదు. రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తే భరతమాత పౌరులుగా జీవించే హక్కును కోల్పోతారు. భారతీయులకు పరమ పవిత్ర జీవన గ్రంథంగా భారత రాజ్యాంగం సదా పూజించబడాలి, ఆచరణ మార్గం చూపాలి.

# అపర అన్నవరం... మరో శబరి మల

"శ్రీ రత్నగిరీశాయ గౌతమీ తీరవాసినే, ఆదినారాయణాయ శ్రీసత్య దేవాయ మంగళమ్", తెలంగాణ ప్రాంతంలోనే అరుదైనదై, పవిత్ర గోదావరి నదీ తీరాన గుట్టపై వెలసి, సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురికి 11కిలో మీటర్ల దూరాన మంచిర్యాల జిల్లా సరిహద్దున దండేపెల్లి మండలం గూడెం వద్ద భక్తుల పాలిటి వరదునిగా వాసి కెక్కిన సర్వజన బాంధవుడైన గూడెం రమా సహిత సత్యనారాయణ స్వామి కార్తీక పౌర్ణమి జాతర వేడుకలు నవంబర్ 3 నుండి అత్యంత వైభవంగా జరుగ నున్నాయి. పూర్వము గూడెం గ్రామ వాస్తవ్యుడైన శ్రీ గోవర్ధన పెరుమాండ్ల స్వామి అనే చాత్తాద శ్రీ వైష్ణవునికి శ్రీ స్వామి, స్వప్న దర్శనం గావించి, మీగ్రామ శివారు రాట్నపు చెవులు కొండపై వెలిశాను అని చెప్పారట. అది స్వప్నమే కదా! అని విశ్వసించక మిన్నకుండి నాడట. కాని మరునాడు స్వప్నములో మళ్ళీ స్వామి రావడంతో... పెరుమాండ్ల స్వామి కొండ ఎక్కి, స్వామి వెలసిన చోటు కోసం వెతక నారంభించి తిరిగి తిరిగి ఎంత వెతికినా 'జాడ తెలియక పోవడంతో సాయంత్రం ఇంటి కేగి నిద్రకు ఉపక్రమించగా, నీవుండే జాడ తెలుసుకునేంత జ్ఞానము నాకెక్కడిది స్వామి? నన్ను మన్నించి దర్శనమివ్వు! అని మనసులో తలచుకొని నిద్రించడం జరిగింది. ఆ రాత్రి స్వప్నములో స్వామి అగుపించి ఆ కనపడుతున్న అదే రాట్నపు చెవుల కొండపై ఒక చిన్ననీటి కొలను (సారితే) దానికి దగ్గరగా ఉత్తర దిశలో ఉన్న గుహలో నేనున్నాను అని చెప్పి అదృశ్యమైనాడు. తెల్ల వారగానే ఆతృత పట్ట జాలక కొండపై వేగి కలలో అగుపించిన గుహలో వెదికితే, గుహలో చిన్న విగ్రహం దర్శన మిచ్చింది. విగ్రహన్ని వెంటనే పెరుమాళ్లు పరుగున వెళ్ళి గోదావరిలో శుచిగా స్నానమాచరించి పూజా ద్రవ్యాలతో కొండ చేరుకొని విగ్రహమున్నచోట శుభ్రపరచి స్వామివారికి అభిషేకాదులు, పూజలు జరిపి నైవేద్యం పెట్టగా, విషయం తెలుసుకున్న . గ్రామ ప్రజలు కొండను చేరుకొని స్వామి దర్శనం చేసుకున్నారు. దైవ ప్రభావము చేత వారి కోరికలన్నియు తీరాయట. ఇలా కొండ పై దేవుడు వెలిశాడన్న వార్త ఊరూరా పాకి అందరూ దర్శనానికి రావడం మొక్క డము భక్తుల కోర్కెలు తీరడము, పెరుమాండ్లు ప్రతి రోజు స్వామి వారికి పూజాధికాలు, నిర్వహించడము ద్వారా స్వామి మహత్యము తొందరలో అందరికి తెలిసి పోవడము జరిగింది. రోజులు గడిచిన కొలది శ్రీ పెరుమాండ్లు స్వామి ఆలోచించి శ్రీ సత్యనారాయణ స్వామి, రమాదేవి విగ్రహాలు పెద్దవి చేయించి భక్తుల సహకారముతో ఆలయ నిర్మాణము గావించి శ్రీ క్రోధి నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి (1964) లో విగ్రహ ప్రతిష్ట చేశారు. కొండ పైకి వెళ్ళుటకై దారి, మంచి నీటి బావి త్రవ్వించారు. నాటి నుండి అసంఖ్యాక భక్తుల కోర్కెలు తీర్చుతూ శ్రీ స్వామి వారు నిత్య వినూత్న కళలతో వెలుగొందు చున్నాడు. ఈ దేవాలయము తెలంగాణలో ఎంతో ప్రసిద్ధి గాంచిన ఏకైక శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయము. కొండకు దాదాపు 1.కి.మీ. దూరాన పరమ పవిత్రమైన గోదావరి నది ప్రవహిస్తున్నది. భక్తులు అందు స్నానమాచరించి శ్రీ స్వామి వారిని దర్శించుకొనుట పరిపాటి. ఈ దేవస్థానములో ఎక్కువ సంఖ్యలో శ్రీ స్వామి వారి వ్రతమును చేసుకుంటారు. కుంకుమార్చనలు, అష్టోత్తరము లు, అభిషేకము, హారతులు, ఇత్యాది అర్చనలు చేయించు కొని భక్తులు భగవదనుగ్రహ పాత్రులు అవుతున్నారు. గోదావరి తీరాన ఒక గుట్టపై సత్యనారాయణ స్వామి, అదే ప్రాంతంలో పక్కన ఎత్తైన ప్రదేశంలో అయ్యప్ప స్వామి వెలసి, తెలంగాణలో అపర అన్నవరంగా, మరో శబరిమలైగా పేరెన్నకగన్న గూడెం గుట్ట విశేష ప్రాధాన్యత కలిగి ఉంది. కార్తీక పౌర్ణమి జాతర నిర్వహణకై దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, అర్చకులు, కార్యనిర్వహ ణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణకై తగు ఏర్పాట్లు గావి స్తున్నారు. మారహిత శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 5న కార్తీక పౌర్ణమి రోజున నిత్య హవనం, బలిహరణం, మహా పూర్ణాహుతి, యజ్ఞ పరి సమా ప్తి, మహదాశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ తదితర ఉత్స వ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యం లో మంచిర్యాల, కరీంనగర్, జగిత్యాల ఆర్టీసీ వారు ప్రత్యేకంగా బస్సులు నడప నున్నారని ఈఓ శ్రీనివాస్ సంకటాల వివరించారు.



# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం రచ్చ బండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మందపల్లి గ్రామ ఇంచార్జ్ విళ్ల వీర్రాజు అధ్యక్షత వహించగా రాష్ట్ర వైఎస్సార్ సిపి నాయకులు, మాజీ ఆముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజ్, కొత్తపేట మండల వైసీపీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, కొత్తపేట మండల పరిషత్ అధ్యక్షులు మార్గాని గంగాధర్, పిఏసి యాస్ మాజీ చైర్మన్ ముసునూరి వెంకటేశ్వరరావు మందపల్లి గ్రామ ఇంచార్జి విళ్ల వీర్రాజు, మందపల్లి సర్పంచ్ సాధు చెంచయ్య, మందపల్లి వైసీపీ ప్రెసిడెంట్ అడపా దొరబాబు, తోరాటి గణేష్, గ్రంధి చంద్రరావు, కుంపట్ల చిన్నా, సుబ్బారావు,ఇంకా గ్రామానికి చెందిన ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి మెడికల్ కాలేజీల ప్రయివేటీ కరణకు వ్యతిరేకంగా సంతకాలను సేకరించడం జరిగిందని తెలియజేశారు.

# భారత మహిళా క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది : రెడ్డి అనంత కుమారి

## మహిళల ప్రపంచ కప్ విజయంపై ఏపీ బీసీ కార్పొరేషన్ చైర్మన్ హర్షం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐసీసీ మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత జట్టు చారిత్రక విజయాన్ని నమోదు చేయడం పట్ల రెడ్డి అనంత కుమారి హర్షం వ్యక్తం చేశారు. దేశానికి తొలి ప్రపంచ కప్‌ను సాధించి పెట్టిన భారత మహిళా జట్టుకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రపంచ కప్‌ను సాధించడం ద్వారా మన భారత మహిళా క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. వారి అంకితభావం, పట్టుదల మరియు అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడికి గర్వకారణం. ముఖ్యంగా క్రీడా రంగంలో రాణించాలనుకునే ప్రతి ఆడబిడ్డకు ఈ విజయం ఒక గొప్ప స్ఫూర్తిని ఇస్తుంది. మన యువతరం తమ కలలను సాకారం చేసుకోవడానికి ఇది చక్కటి ఉదాహరణ. విజయం సాధించిన ప్రతి క్రీడాకారిణికి, కోచింగ్ సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. క్రీడలతో సహా అన్ని రంగాలలో మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

# శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పవిత్ర కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు మరోసారి భక్తులతో కిటకిటలాడాయి. "ఓం నమఃశివాయ," "హరహర మహా దేవ శంభో శంకర" అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఆలయాలన్నీ మారుమోగాయి.ప్రసిద్ధ స్వయంభూ క్షేత్రమైన పలివెల శ్రీ ఉమా కొప్పేశ్వర స్వామి దేవాలయంలో వేకువ జాము నుండే విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు.

**తోట వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ**

భక్తుల దర్శనం, పూజల అనంతరం స్వామివారి ప్రసాదాన్ని అందించడంలో భాగంగా, కార్తీక మాసం నెలరోజుల పాటు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా కొనసాగుతోంది. భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ప్రసాదాన్ని తోట వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రతీరోజు పంపిణీ చేస్తారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాయవరం విద్యార్థి



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి చెన్నూరి మహేష్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ 400 మీటర్ల విభాగంలో ఎంపికయ్యాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విప్పర్తి శాంతి సునీత సోమవారం తెలిపారు. ఇటీవల కాకినాడ జిల్లా ప్రాధికార సంస్థ లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు మహేష్ ఎంపికయ్యాడని, నవంబర్ 7 వ తేదీ నుండి శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాడని తెలిపారు. కాగా క్రీడల్లో రాణిస్తున్న చెన్నూరి మహేష్‌ను అతను రాణించడానికి ప్రోత్సహించి, తర్ఫీదునిచ్చిన పాఠశాల పీడీలు చిక్కాల అజ్జిబాబు, కందర్ప శ్రీనివాసు లను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవి శెట్టి కోటేశ్వరరావు, రాయవరం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

# మానవ మనుగడకు చెట్లే ఆధారం

## 108 మొక్కలు నాటిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవ మనుగడకు చెట్లే ఆధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం రామచంద్రపురం శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత అగస్తేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న నందివాడ సత్యనారాయణరావు ఉద్యానవనమునందు కార్తీక మాసం పర్వదినమున శివ సంకల్పంతో మంత్రి సుభాష్ చేతుల మీదుగా 108 మారేడు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ సమాజంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగి వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. నాటిన మొక్కలు పెరిగి పెద్దవి అయ్యేంతవరకు తగిన సంరక్షణ చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి,మున్సిపల్ కమిషనర్ రాజు,జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు,శ్రీ అగస్త్య స్వామి దేవాలయం ట్రస్ట్ చైర్మన్ గణేష్ శర్మ, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, కవల నానాజీ, అంకం శ్రీనివాస్ పలువురు భక్తుల పాల్గొన్నారు. అనంతరం 2026 సంవత్సరానికి గాను రూపొందించిన క్యాలెండర్ ను మంత్రి సుభాష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

# ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఆర్డీఓ అఖిల




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా మొంథా తుఫాను సమయంలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను ఉత్తమ సేవా అవార్డు అందుకున్న రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారిణి డి.అఖిల మరియు రాయవరం తహశీల్దార్ బి.వి.భాస్కర్ అందుకున్నారు.ఈ సందర్భంగా ప్రకృతి విపత్తుల్లో రెవెన్యూ యంత్రాంగం, పోలీసు, అగ్ని మాపక శాఖ, రోడ్లు మరియు భవనాలు, విద్యుత్ మరియు అన్ని శాఖల సిబ్బంది అందరూ సమన్వయంతో పని చేశారని జిల్లా కలెక్టర్ కితాబునిచ్చారు.

# ఎన్టీఆర్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం కావాలి

## తారక రామారావు విగ్రహావిష్కరణ సభలో మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయాలే నేటి యువతకు స్ఫూర్తని, ప్రజలే దేవుళ్ళు సమాజమే దేవాలయంగా భావించి పరిపాలనలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన ఎన్టీఆర్ అందరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం కొత్తూరులో నూతనంగా ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్,అనపర్తి ఎమ్మెల్యే నల్లమెల్లి రామకృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ,మాజీ ఎంపీ చుండ్రు శ్రీహరి చౌదరి,కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు తదితర నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ను స్థాపించి రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొచ్చి, తెలుగు వారి కీర్తిని, గౌరవాన్ని ప్రపంచానికి సాటి చెప్పిన ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,విశ్వ విఖ్యాత నట సార్వభౌమ, పద్మశ్రీ నందమూరి తారక రామారావు ఆశయ సాధనలో నేటితరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పేదల పెన్నిధిగా,అందరి అన్నగా స్వర్గీయ ఎన్టీఆర్ తీసుకొచ్చిన సంస్కరణలు చిరస్మరణీయమని అన్నారు.ఆ మహనీయుని స్మరించుకుంటూ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ,గ్రామ పెద్దలను మంత్రి సుభాస్ ప్రత్యేకంగా అభినందించారు.ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్,ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లు మాట్లాడుతూ పేదలకు కిలో రెండు రూపాయలకే బియ్యం,మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించడం గొప్ప నేత అన్నారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన రంజక పాలన అందిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమన్నారు. పేదల పెన్నిధిగా, అందరికీ అన్నగా రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో ఇనుమడింప చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గని కృష్ణ,మాజీ ఎంపీ చుండూరు శ్రీహరి చౌదరి లు మాట్లాడుతూ నందమూరి తారకరామారావు స్ఫూర్తితో ఆయన ఆశయాలు కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది అన్నారు. అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో చేపడుతూ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వాన్నిదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, కొమరిన వీర్రాజు, ఉండవెల్లి శివ, కొత్తపల్లి శ్రీనుబాబు,చందమామ వాసు,కవల నానాజీ, కంచుమర్తి బాబురావు, నారపురెడ్డి బలరాం, దంగేటి గౌరీ శంకర్, వీరబాబు,పెద్ద ఎత్తున అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న

# వాహనము పట్టివేత

**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో సోమవారం రావులపాలెం స్థానిక డిగ్రీ కాలేజ్ ఎదురుగా గల ఎన్హెచ్16 రోడ్డుపై అక్రమ బియ్యాన్ని పాలకొల్లు నుంచి జొన్నాడ తరలిస్తున్న జక్కంశెట్టి శ్రీనివాస్ ను అదుపులోకి తీసుకుని అతని వద్ద 94 బస్తాలు బియ్యం మూటలు సుమారుగా 4600 కేజీలు బియ్యాన్ని టాటా ఏసీ వాహనాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు ఇచ్చిన రిపోర్టుపై రావులపాలెం పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు రావులపాలెం ఎస్సై జి చంటి తెలిపారు. 4600 కేజీల అక్రమ రేషన్ బియ్యాన్ని మరియు తరలిస్తున్న ఏపీ 39డబ్ల్యూఎఫ్ 5794 నెంబరు గల వాహనాన్ని స్వాధీనపరుచుకుని అక్రమ బియ్యం తరలిస్తున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఇంటింటా స్వదేశీ వస్తువులపై అవగాహన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం రూరల్ మండల అధ్యక్షులు ఆకెటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటా - స్వదేశీ ప్రతి ఇంటా స్వదేశీ అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనకాపల్లి జిల్లా ఇంచర్చ్ కర్రి చిట్టిబాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వదేశీ వస్తువులను ప్రతి ఒక్కరూ వాడాలి అని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వాద్రేవు వెంకట్రావు, మండల యువమోర్చ తోలేటి సూర్య గంగాధర్, ఓబీసీ మూర్చ ఇంధన సత్యనారాయణ కార్యకర్తలు, ప్రజలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# వాడపల్లి వెంకన్న ఆదాయం



**కొత్తపేట/ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుపతి వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆదాయ వివరములు ప్రత్యేక దర్శనం (50/-) టిక్కెట్లు 1108 విశిష్ట దర్శనం (200/) టిక్కెట్లు 308, తులాభారం టిక్కెట్లు 17, కళ్యాణ కట్ట టిక్కెట్లు 167,లడ్డు మహా లడ్డు ప్రసాదం టికెట్లు 34, లడ్డు ప్రసాదం టిక్కెట్లు 211, పులిహోర ప్రసాద టిక్కెట్లు 3238, వేద ఆశీర్వచనం టికెట్లు 1, నిత్య అన్నదాన కార్యక్రమం నిమిత్తం 71,304 /-లు, శాశ్వత అన్నదాన కార్యక్రమం నిమిత్తం 85,469/-లు, వేద ఆశీర్వచనం ద్వారా వచ్చిన రుసుము 1,116 /- లు లడ్డూ కవర్లు విక్రయిం ద్వారా 1055/-స్వామి వారి ప్రత్యేక దర్శనం ద్వారా వచ్చిన రుసుమ 55,400 /- విశిష్ట దర్శనం ద్వారా వచ్చిన రుసుము 61,600/-లు తులాభారం టిక్కెట్ల ద్వారా వచ్చిన రుసుము 850 /-కళ్యాణ కట్ట టిక్కెట్ల ద్వారా వచ్చిన రుసుము 6,680/-లు లడ్డూ మహా ప్రసాదం టిక్కెట్లు ద్వారా వచ్చిన రుసుము 3,400/-లు లడ్డు ప్రసాదం విక్రయం ద్వారా వచ్చిన రుసుము. 1,00,500/-లు, పులిహోర ప్రసాదం విక్రయం ద్వారా వచ్చిన రుసుము 32,380/- ఆన్లైన్ ద్వారా ఆదాయం, 68,699 /-లుమొత్తం రుసుము రూ: 5,00,959/-లు వచ్చిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలియజేశారు.

## మున్సిపల్ విశ్రాంతి ఉద్యోగి

# విశ్వాస్ కుమార్ ఆకస్మిక మృతి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎంతోమంది పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్ది విశ్రాంతి ఉద్యోగి జంగా విశ్వాస్ కుమార్ సోమవారం సాయంత్రం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ప్రజాసేవ పరమావధిగా దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మీద అభిమానంతో వైస్సార్ పార్టీలో క్రియ శీలకంగా ఉంటున్నా జంగా విశ్వస్ కుమార్ సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరం లో ప్రైవేట్ హాస్పిటల్ లో వైద్యం పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన భార్య జంగా ఏఎస్ శాంత కుమారి ప్రస్తుత మున్సిపల్ కో అప్షన్ సభ్యురాలుగా ఉన్నారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. నిన్నటి వరకు తమతో కలిసి ఉన్నా విశ్వస్ కుమార్ మృతి పట్ల ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సీనియర్ నాయకులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, వైయస్సార్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ పిల్లి శ్రీనివాస్, నియోజకవర్గం ఐటీ వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, 8 వార్డ్ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, వైసిపి మున్సిపల్ శాఖ అధ్యక్షురాలు నీలం దుర్గ, 28 వార్డు కౌన్సిలర్ మొండి భవాని మురళి, గుణిపే శ్యాంసుందర్రావు, విప్పర్తి సింహాచలం, కనికెళ్ల పల్లవి దుర్గాప్రసాద్, పోలమాల సత్తిబాబు, సన్మాలా ధనరాజ్, కొమరపు సత్యనారాయణ, కోళ్ల శ్రీను లు సంతాపం తెలిపారు.

# కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది..

## పోలవరం మండలంలో మైనర్ బాలిక ఘటన కుటుంబ సభ్యులకు భరోసా కల్పించిన మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో ఓ గ్రామంలో ఇటీవల లైంగిక వేధింపులకు గురైన మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి భరోసా కల్పించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్‌తో కలిసి మంత్రి శుభాష్, ఎంపీ హరీష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కుటుంబ సభ్యులకు అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారని అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లైంగిక దాడి చేసిన రాయపురెడ్డి బాబీని ఉపేక్షించేది లేదని పోక్సో చట్టం ద్వారా కేసు నమోదు చేశామని తెలిపారన్నారు. బాధిత కుటుంబానికి ఇంటి స్థలం, అయిదు లక్షల ఆర్థిక సాయాన్ని, మైనర్ బాలిక తల్లికి ఔట్సోర్సింగ్ లో ఉద్యోగం కల్పిస్తున్నట్టు చంద్రబాబునాయుడు తెలియజేశారన్నారు. రాష్ట్రంలో ఏ మహిళకు అన్యాయం జరిగినా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంతుందని మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# విజయవంతంగా బాస్కెట్ బాల్ ఛాంపియన్షిప్ సెలక్షన్స్





**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** బాస్కెట్బాల్ అసోషియేషన్ రామచంద్రపురం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మేన్ అండ్ ఉమెన్ బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్ సెలెక్షన్ పోటీలు అక్టోబర్ 31 నుండి నవంబర్ 2 తేది వరకు శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగాణంలో కీ.శే. గన్నమని భానుమతి మెమోరియల్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బాస్కెట్బాల్ చాంపియన్షిప్ సెలెక్షన్ పోటిలు నిర్వహించారు.ఇందులో మహిళలు మరియు పురుషులు జట్లు పాల్గొన్నారు.ఈ ఛాంపియన్షిప్ లో గెలుపొందిన మహిళలు విభాగంలో రామచంద్రపురం జట్టు ప్రథమ స్థానం సాధించగా,ద్వితీయ స్థానం పిఠపురం మరియు తృతీయస్థానం డి.యస్.ఎ కాకినాడ, నాల్గవ స్థానం అమలాపురం జట్లు నిలిచాయి.అలానే పురుషుల విభాగంలో మొదటిస్థానం రామచంద్రపురం, ద్వితీయ స్థానం డి.యస్.ఎ కాకినాడ, తృతీయస్థానం సి.బి.సి రాజమండ్రి,నాల్గవ స్థానం గొల్లల మామిడాడ జట్టు గెలుపొందినవి.అయితే ఈ జట్లులలో కొంత మందిని సెలెక్ట్ చేసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషులు మరియు మహిళలలను జట్టుగా ఎంపిక చేయడం జరిగినది.ఈ ఎంపిక చేసిన తూర్పుగోదావరిజట్లు నవంబర్ 7 వ తేది నుండి 10 వ తేది వరకు విశాఖపట్నంలో జరిగే 11 వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటారని బాస్కెట్బాల్ అసోసియేషన్ తెలిపింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా రాష్ట్ర కార్మిక మంత్రి మంత్రి వాసంశెట్టి సుభాష్,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ సత్యం,అగ్రికల్చర్ మర్కేటింగ్ కమిటి చైర్మన్ అక్కల రిష్వంతాయ్,డా సి.హెచ్.రామరావు,డా కె.వి.సతీష్ కుమార్, ఎమ్.ఇ.ఒ టి. వీర్రాఘవరెడ్డి, యస్.కె.పి.పి.ట్రాస్ట్ చైర్మన్ సలాది వెంకప్పనాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాస్కెట్బాల్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ జి.చక్రవర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సెక్రటరీ బి.మాణిక్యాలరావు, అసోషియేషన్ సభ్యులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గోన్నారు.అయితే ఈ మూడు రోజులులలో వివిధ బాస్కెట్బాల్ జట్లులలో ప్రతిభ కనబరచిన వారికి ముఖ్య అధితులుగా వచ్చిన వారి చేతులు మీదగా బహుమతులు అందజేశారు.ఎంపిక అయిన జిల్లా జట్లుకు ఈ నెల 4 నుండి 6 వరుకు రామచంద్రపురం శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడాప్రాగణంలో బాస్కెట్బాల్ కోచింగ్ క్యాంప్ నిర్వహించబడునని బాస్కెట్బాల్ అసోసియేషన్ తెలిపింది. ఈ సందర్భంగా సత్యం వాసంశెట్టి మాట్లాడుతూ నేను మిలో బాస్కెట్బాల్ సభ్యుడుగా వున్నందుకు చాలా సంతోషంగా ఉందని,విద్యార్థిని విద్యార్థులు క్రీడాకారులుగా తయారు చేస్తున్న అసోసియేషన్ సభ్యులుకు అభినందనలు తెలుపుతూ,ఎటువంటి సాయం కావాలన్నా చేయడానికి నేను వెనకడానని అన్నారు. అలానే నేటి తరం పిల్లలు వివిధ రకాల వ్యసనాలకు అలవాటు పడకుండా ఇలాంటి క్రీడాకారులుగా విజయాలు సాధిస్తే అనేక ప్రభుత్వ రంగాలలో ఉద్యోగ అవకాశాలు మెండుగా వుంటాయని అవి అంధుపుచుకోవాలన్నారు. రానున్న రోజులులలో ఆడబోయే జట్లుకు బెస్ట్ అఫ్ లక్ తెలిపారు.

## విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన

# సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏరియా ఆస్పత్రిలో నిర్మించిన రోగుల విశ్రాంతి భవనాన్ని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, పురపాలకసంఘం చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవిలు ప్రారంభించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్ధం ఆస్పత్రికీ వచ్చే రోగుల కోసం విశ్రాంతి భవనాన్ని నిర్మించిన రిటైర్డ్ లైన్ ఇన్ స్పెక్టర్ అబ్దుల్ కరీం ను వాసంశెట్టి సత్యం, గాదంశెట్టి శ్రీదేవీలు అభినందించారు. సామాజికసేవలో ముందుండే అబ్దుల్ కరీంను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని వారు కోరారు.గతంలో కూడ కరీం రామచంద్రపురం పట్టణంలోని ముస్లీంల శ్మశాన వాటికను అభివృద్ధి చేయడంతో పాటు ఉర్దూ పాఠశాలలో వంటగది, ఉర్దూ పాఠశాల భవనాన్ని నిర్మించి ఎందరికో మార్గదర్శకులుగా నిలిచారని వారు కొనియాడారు.తమ ఉన్నతికి కన్నవాళ్ళు పడ్డ కష్టానికి కొంతవరకైనా రుణం తీర్చుకునే ప్రయత్నం చేయాలంటారు పెద్దలు.అదే బాటలో అబ్దుల్ కరీం పయనిస్తూ తమ తల్లిదండ్రులపై ఉన్న ప్రేమను చాటుకోవడానికి వారి జ్ఞాపకార్ధం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వాసంశెట్టి సత్యం కొనియాడారు.ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ అమ్మాజీ, గాదంశెట్టి శ్రీధర్,గడి గోవింద్,తదితరులు పాల్గొన్నారు.



# గిరిప్రదక్షణా బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం శ్రీ వీరవెంకటసత్యనారాయణ స్వామి దేవస్థాన పరిసరాల్లో 5వ తేదీ కార్తీక పౌర్ణమి సందర్భంగా దేవస్థానం నిర్వహించే గిరి ప్రదక్షణకు చేపడుతున్న బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ బిందుమాధవ్ సోమవారం స్వయంగా పరిశీలించారు. గిరి ప్రదక్షిణ వలయ మార్గమంతా ఎస్పీ నేరుగా ప్రయాణించి పరిశీలించి పరిస్థితులను అధ్యయనం చేసారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. భక్తుల రాకపోకలు, వాహనాల నిలిపిఉంచే సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. భక్తుల భద్రత దృష్ట్యా అన్నవరం పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గిరి ప్రదక్షిణ రోజున అన్నవరం గ్రామంలోనికి భారీ వాహనాలకు ప్రవేశాన్ని నిరోధించాలని, భక్తుల వాహనాల కోసం అనువైన ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించాలని ఆదేశించారు. భక్తుల రాకపోక మార్గాలు స్పష్టంగా గుర్తించబడేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రసార వ్యవస్థ (పబ్లిక్ అడ్రస్ సిస్టమ్) ద్వారా భక్తులకు మార్గదర్శక సమాచారాన్ని అందించాలి అన్నారు. సేవా దళాలు, స్వచ్ఛంద సేవకుల ద్వారా భక్తులకు సహకారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలు సమృద్ధిగా ఉండేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని సూచించారు. ఫైర్ సర్వీస్, అంబులెన్స్, రక్షణ బృందాలు తగిన సంఖ్యలో సిద్ధంగా ఉంచాలని చెప్పారు. భక్తులు శాంతి యుతంగా, క్రమపద్ధతిగా గిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు అనువైన వాతావరణం కల్పించాలని, భక్తులకు ఎప్పటికప్పుడు పోలీసుశాఖ తగు మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. భక్తులు, ప్రజలు కూడా పోలీసుల సూచనలను పాటించాలని, ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినపుడు పోలీసు సిబ్బంది సహాయం పొందాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి. కె.వి.సత్యనారాయణ, పెద్దాపురం డి.ఎస్.పి. డి.శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సి.ఐ. బి.సూర్య అప్పారావు, అన్నవరం ఎస్.ఐ. జి.శ్రీహరిబాబు, అన్నవరం సత్యదేవుని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టర్ పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 571 అర్జీలు..






**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో సోమవారం జరిగిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 571 అర్జీలు వచ్చాయి. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎన్.శ్రీధర్, ఎస్ఎస్ఏ ఏపీవో పి.వేణుగోపాల రావు, కేఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి, సీపీవో పి.త్రినాథ్, డీపీవో వి.రవికుమార్తో కూడిన అధికారుల బృందం కాకినాడ చుట్టు పక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, ఆటో డ్రైవర్ల సేవలో వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో అర్జీలు అందాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి రాలేని అర్జిదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చు. అర్జీ దార్లు వారి యొక్క అర్జీల యొక్క స్థితి తెలుసుకోవడానికి 1100 నెంబరుకి నేరుగా ఫోన్ చేసి తెలుసుకొనే సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారులు వివిధ కారణాల రీత్యా పిజిఆర్ఎస్ కార్యక్రమంకు హాజరు కాలేకపోయారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై

# అవగాహన కార్యక్రమం...



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ట్రాఫిక్ నియమాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కాకినాడ ట్రాఫిక్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డిజిటల్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమం సోమవారం కాకినాడ బాలాజీ చెరువు సెంటర్లోని పిఆర్ ఒకేషనల్ కళాశాలలో జరిగింది. ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ వాడకం, ఈవ్ టీసింగ్, సైబర్ నేరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీడియోల రూపంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను ట్రాఫిక్- 1 సిఐ ఎన్ రమేష్ వ్యవస్థ గురించి వివరించారు. మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ, కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వలన జరిగే ప్రమాదాలపై హెచ్చరించారు. జీబ్రా లైన్ లేని ప్రదేశాల్లో రోడ్డు దాటేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉపయోగాలను వివరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించరాదనీ, డ్రైవర్ పక్కన లేదా వెనుక భాగంలో కూర్చోరాదని విద్యార్థినులకు సూచించారు. బస్సుల ఫుట్పాత్ ప్రయాణం ప్రమాదకరమన్నారు. సీట్ బెల్ట్ లేకుండా, లేదా అధిక వేగంతో వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, సడన్ డోర్ ఓపెన్ చేయడం వలన జరిగే ప్రమాదాలను వివరించారు. అదేవిధంగా, విద్యార్థినులకు ఈవ్ టీసింగ్ మరియు మహిళల భద్రత అంశాలపై కూడా సిఐ రమేష్ విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల గురించి కూడా విద్యార్థినులకు వివరించారు. ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్ పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి అంశాలపై వివరణ ఇచ్చారు. అత్యవసర సేవల నంబర్లు 112, 1930, 1972 వినియోగం గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ - 1 ఆర్ఎస్సై కే.సురేష్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏడేళ్ళుగా అయ్యప్పలకు అన్నదాన సేవ...!

## కత్తిపూడిలో కొనసాగుతున్న సంప్రదాయం - భక్తులు, దాతల ఆదరతో సుసాధ్యం







**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా ఏడేళ్లుగా ఏటేటా ఇక్కడ అయ్యప్పస్వామి మాల ధారులకు అన్నదానసేవ అఖండంగా కొనసాగుతోంది. ఇదీ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడిలోని హిందూ ఆధ్యాత్మిక పెద్దలు, దాతల త్యాగ నిరతి. స్థానిక కృష్ణుడి గుడి వీధిలోని 8 వ వార్డులో ఊరు చెరువుని ఆనుకుని "అయ్యప్ప సేవా సమితి" ఆధ్వర్యంలో 2018 నుంచి అయ్యప్ప స్వాములకు అన్నదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతీ ఏడాదీ అయ్యప్ప మాల దీక్షా పరులు ఎంత మంది ఉంటే అంత మందికీ మధ్యాహ్నం ఒక్క పూట మాత్రం అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. అయ్యప్ప మాలధారణ కాలం సాధారణంగా 41 రోజుల పాటు మండల దీక్షగా ఉంటుంది. ఇది కార్తీక మాసంలో ప్రారంభమై మకర సంక్రాంతి వరకు కొనసాగుతుంది. ఈ 41 రోజులను కఠినమైన నియమ నిష్ఠలతో పాటించాల్సి ఉంటుంది. మాలధారణ నియమాలను ఎంత నిష్ఠతో పాటిస్తారో ఇక్కడ అంతే నిష్ఠతో వారికి అన్నదాన సేవ జరుగుతోంది. అన్నదాన శిబిరం వద్దే ప్రత్యేకంగా వంటశాలను ఏర్పాటు చేసుకున్నారు. అయ్యప్ప మాలధారులైన స్వాములే ఇక్కడ స్వయంచాలకంగా స్వయంపాకం చేస్తున్నారు. ఈ వంటకాలు రుచి, సుచీతో మృష్టాన్న భోజనంలా భక్తుల ఉదరాలకు ఇమిడిగ్గా ఆరోగ్యంగా వంటబడతాయి. ఆహార పదార్థాలను ప్రతీ రోజూ కూడా కేవలం కడిగిన ముత్యంలాంటి కంటికి ఇంపైన ఆకు పచ్చటి అరటి ఆకుల్లోనే వడ్డించడం ఈ అన్నదాన సేవ నిర్వాహకుల ప్రత్యేక శైలి. మాల ధారణ నియమానుసారం మధ్యాహ్నం 11 గంటల నుంచి 2.30 గంటల మధ్య మాత్రమే అన్నదానం నిర్వహించే నిష్టను పాటిస్తూ వస్తున్నారు. 2.30 గంటల సమయానికి లోపల శిబిరంలో ఎంత మంది భక్తులు ఉంటే అంత మందికీ అన్నప్రసాదం భేషుగ్గా అందుతుంది. ఇలా రోజు మొత్తం మీద స్వాములు, ఆహ్వానితులైన ఇతరులూ కలిసి ఒకే సహపంక్తిలో గరిష్టంగా సుమారు 500 మంది వరకూ విందారగిస్తారు. ఇలా 2018 లో తొమ్మిది మంది భక్తులు, రూ. 9,000 ప్రాథమిక వ్యయంతో మొదలైన అయ్యప్ప సేవా సమితి అన్నదాన సేవ 2019 ఒక్క కరోనా సంవత్సరం మినహాయించి నేటి వరకూ దినదిన ప్రవర్ధమానంగా కొనసాగుతోంది. అయ్యప్ప సేవా సమితి నిర్వాహకుల సంకల్పానికి, స్థిర చిత్తానికి నేరుగా ఆ మణికంఠుడి ఆశీస్సులు మెండుగా ఉండడంతోపాటు దాతలు కూడా ఓ కొమ్ము కాస్తుండడంతో ఈ అన్నదాన సేవ సుసాధ్యం అవుతోంది. అయ్యప్ప స్వామి భక్తులు, స్వతహాగా దాన స్వభావులు ఈ అన్నదాన సేవకు కానుకలు, విరాళాలు, ముడిసరుకు ఆహారపదార్థాలు... ఇలా ఎవరి శక్తి మేరకు వారు సాయం అందిస్తూ వస్తున్నారు. ఈ అన్నదాన సేవలో పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ పూర్వపు ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ ఒక రోజు అన్నదానంను తన వంతు విరాళంగా ఏటేటా క్రమం తప్పకుండా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం కూడా 500 భక్తులకు అన్నదాన సేవకు విరాళం అందించారు. అంతే కాకుండా కొంత మంది భక్తులకు స్వయంగా సురేష్ వడ్డించి అన్నదాన సేవలో తరించారు. అయ్యప్పలకు అన్నదాన సేవ అనేది భక్తులు అందరికీ భోజనం అందించే ఒక ముఖ్యమైన సేవ. అయ్యప్ప మాల ధరించిన భక్తులకు భోజనం పెట్టడం ద్వారా, అయ్యప్ప ఆలయాల్లో, భజన మండళ్ళల్లో మాల ధరించినవారు ఇక్కడ ఒకరికొకరు మద్దతుగా నిలుస్తారు. అన్న సమారాధనను అయ్యప్ప భక్తుల పట్ల భక్తితో కూడిన సేవగా భావిస్తారు. అయ్యప్ప దీక్షలో ఉన్న వారికి భోజనం పెట్టడం ఒక ముఖ్యమైన సంప్రదాయ విధిగా ఇక్కడ ఏటేటా పాటిస్తూ వస్తున్నారు. ఫలితంగా ప్రజల మన్ననలను అందుకుంటున్నారు.

### "రాజ్యాంగ రక్షణ సమరభేరి" సభను

# విజయవంతం చేయండి...



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత దేశం ప్రతీ సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని (సంవిధాన్ దివస్, జాతీయ చట్ట దినోత్సవం - నేషనల్ లా డే)ను ఘనంగా జరుపు కుంటోంది. ఇదే రోజున కాకినాడ సూర్య కళామందిరంలో కాకినాడ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజ్యాంగ రక్షణ సమర భేరి సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ శాఖ ఇన్చార్జ్ గునపర్తి అపురూప్ పిలుపును ఇచ్చారు. కాకినాడ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజ్యాంగ రక్షణ సమరభేరి కార్యక్రమ ప్రచార కరపత్రాలను ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరంలోని అంబేద్కర్ నగర్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రచార పర్యటనల్లో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం శంఖవరం, ఎస్.జగ్గంపేట గ్రామాల్లో ప్రజలకు రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ కమిటీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.


# మిస్సింగ్ కేసును ఛేదించిన ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మి కాంతం

## ఎనిమిది గంటల్లో మిస్సింగ్ బాలిక ఆచూకీ



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు పోలీసులు బాలిక మిస్సింగ్ కేసును సుమారు 8 గంటల వ్యవధిలో ఛేదించినట్లు ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మికాంతం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో ప్రత్తిపాడు గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక తన చదువు విషయంలో చొరవ తీసుకుని తల్లిదండ్రులు గట్టిగా మందలించడంతో ఇంట్లో ఉన్న సుమారు రూ.15 లక్షల విలువైన బంగారు ఆభరణాలు రూ.50,000 నగదు తీసుకొని ఇంటి నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయింది.తల్లిదండ్రుల ఎంతకీ కనిపించకపోగా స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి ఎస్సై ఎస్ లక్ష్మికాంతం తక్షణమే స్పందించి సెల్ఫోన్ టెక్నాలజీ ఉపయోగకరమైన సాయంతో గాలింపు చర్యలు వేగంగా ప్రారంభించారు.ప్రత్తిపా డు సిఐ. బివిస్ అప్పారావు పర్యవేక్షణలో పోలీసులు భీమవరం ప్రాంతంలో బాలికను గుర్తించారు. కేవలం.8 గంటల వ్యవధిలోనే ఎంతో చాకచక్యంగా బాలికను బంగారం, నగదుతో సహా సురక్షితంగా కనుగొని ఆమెను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.ప్రత్తిపాడు పోలీసుల వేగవంతమైన చర్యపై ప్రజలు స్థానికులు ప్రజలు ప్రశంసలు కురిపించడంతో పాటు ఉన్నతాధికారులుకూడా అభినందించారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు విశేష స్పందన : ఇన్చార్జ్ కమిషనర్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగర పాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి అర్జీదారులు తరలి వచ్చి తమ సమస్యలను పరిష్కారం కోరుతూ అధికారులకు అర్జీలు అందజేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్చార్జి కమిషనర్ కె.టి.సుధాకర్ పాల్గొని అర్జిదారుల నుండి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్యలు, టౌన్ ప్లానింగ్ అంశాలు, రోడ్డు ఆక్రమణలు, రోడ్లపై పశువుల సంచారం, చెట్టు కొమ్మల తొలగింపు, ఇల్లు స్థలాల కేటాయింపు, ఆస్తి పన్నులో పేరు మార్పు వంటి పలు సమస్యలపై దాదాపు 16 మంది అర్జీదారులు తమ వినతులు సమర్పించారు. కమిషనర్ సుధాకర్ ఆ అర్జీలను సంబంధిత శాఖాధికారులకు అందజేసి, తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అంతకుముందు నిర్వహించిన "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమంలో నలుగురు పౌరులు ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఎస్.ఇ. పి.వెంకట్రావు, డిసిపి కృష్ణరావు, టిపిఆర్వో శైలజ, మేనేజర్ సీతారాం, అకౌంటెంట్ రామశాస్త్రి తదితర అధికారులు పాల్గొన్నారు.

# జిజిహెచ్లో కొనసాగుతున్న శానిటేషన్ వర్కర్స్ ఆందోళన....

## పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, నూతన కాంట్రాక్టు సంస్థ కార్మికులతో వేతన ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ చేపట్టిన ఆందోళన సోమవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, యూనియన్ సీనియర్ మెంబర్ భాగ్యవతిలు మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా శానిటేషన్ వర్కర్స్కి పిఎఫ్ ఈఎస్ఐ కాకుండా 13,500 రూపాయలు జీతం చేతికి అందుతుందన్నారు. ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు 3 సంవత్సరాలు ఉంటుందన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ పోను చేతికి 16,000 రూపాయలు అందాలను కోరుకుంటున్నామన్నారు. కాంట్రాక్టర్స్ సానుకూలంగా స్పందించని పక్షంలో జిజిహెచ్ అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని, అవసరమైతే సమ్మె కూడా చేయాల్సి వస్తుందన్నారు. సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో మాతా శిశు విగ్రహం వద్ద నుండి నర్సింగ్ స్కూల్, మెడికల్ విభాగం, క్యాజువాలిటీ మీదుగా సెంటర్ గేటు వరకు నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ కమిటీ సభ్యురాలు బి.మంగతాయారు, సభ్యురాలు వెంకటలక్ష్మిలు మాట్లాడుతూ జీతం పెరిగే వరకు ఐక్యంగా పోరాడుదామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు పలివెల వీరబాబుతో పాటు సభ్యులు ఆర్.రమేష్, ఎస్.వాసు, ఎం.రవి, బి.కృష్ణవేణి, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# నా వంతు సహకారాలు స్వర్ణాంధ్రకు అందిస్తా..

## స్వర్ణాంధ్ర సేవలు ఆదర్శనీయం.. - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - మొబైల్ అన్నదాన సేవలు ఆరవసంత వేడుకలో ఆదిరెడ్డి స్వర్ణాంధ్ర మూల నిధి ఏర్పాటుకు సహకరిస్తా - దాతృత్వంలో పాలు పంచుకుంటున్న వారిని అభినందనలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో గత 27 సంవత్సరాలుగా స్వర్ణాంధ్ర అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి ప్రశంసించారు సమస్త దీర్ఘకాలం నడపాలంటే మూల నిధి ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని దానికి నగరవాసులందరూ సహకరించాలని తన వంతు సహాయం కూడా స్వర్ణాంధ్ర అందిస్తానని తెలిపారు కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలను ఆదిరెడ్డి పరిచయం చేసుకుంటూ నగరంలో దాతృత్వంలో పాలుపంచుకుంటున్న అందరిని అభినందించారు. ఈ సందర్భంగా పుష్కరఘాట్‌లో సుమారు 250 మందికి పండ్లు రగ్గులతో పాటు ప్రత్యేక భోజనం అందించారు సూపర్ ఇండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్‌బిఎం మురళీకృష్ణ మాట్లాడుతూ స్వర్ణాంధ్రతో తనకు మూడు దశాబ్దాలు అనుభవం ఉందని వారి సేవలు సమాజానికి ఉపయోగ అర్థంగా ఉంటాయన్నారు. రాంబాబు చేస్తున్నటు వంటి సేవలను దాతలు నగర పెద్దలు సహకరించి ప్రోత్సాహం అందించాలని మురళీ కృష్ణ కోరారు. స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు మూడు లక్షల 75000 మూల నిధిని ఏర్పాటు చేశామని మూల నిధికి లక్ష రూపాయలు అందించడానికి ముందుకు వచ్చిన సిపి రెడ్డి, పదివేల రూపాయల మూల నిధి ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేసిన మెహర్ మధు గ్రంధి వెంకటేశ్వర రావు లకు రాంబాబు ధన్యవాదాలు తెలిపారు నగరంలో మరింత మంది పెద్దలను కలిసి స్వర్ణాంధ్రకు మూల నిధి సేకరణ కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. గత ఆరు సంవత్సరాలుగా సుమారు తొమ్మిది లక్షల మందికి అన్నదానం అందించామని 22,000 మంది స్వచ్ఛంద సేవకులు సేవలందించగా, 12వేల గంటల సమయాన్ని వెచ్చించినట్లుగా రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జిల్లా నాయకులు ఉప్పులూరి జానకిరామ్, స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు పడాల రామిరెడ్డి (రావుల పాలెం), గంగరాజు పాల డైరీ అధినేత నిమ్మలపూడి గోవిందు, ఎన్ఎస్ఆర్ ట్రేడర్స్ అధినేత నాలో నరసింహారావు విశ్రాంత సిటీ ప్లానర్ ఎం.సత్యనారాయణ రాజు, నైననాల కృష్ణారావు, యువర్ హోమ్స్ ఇంటీరియర్స్ అధినేత కడియాల గోపాలకృష్ణ, అనుకుమార జైన్, కాశి, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ బెన్నీ ఇన్ని బాబు తదితరులు పాల్గొని సేవలందించారు. స్వర్ణాంధ్ర ఉచిత మొబైల్ అన్నదాన సేవల కు సహకరిస్తున్న తాతలకు సిబ్బందికి రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

# అదనంగా ఎస్టీ బాలికల హాస్టల్స్ ఏర్పాటు చేయాలి

## కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వై.భాస్కర్, ఎన్.రాజా



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి ఎస్.టి బాలికల హాస్టల్ సీట్లు ఇవ్వాలని అదనంగా హాస్టల్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కు ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు వై. భాస్కర్, ఎన్. రాజా మాట్లాడుతూ ఎస్.టి బాలికల హాస్టల్స్ లో సీట్లు నిండిపోవటం తో ఇప్పటికే చాలా ఇరుకుగా విద్యార్థులు వుంటున్నారని డిగ్రీ 2వ కౌన్సింగ్ లో వచ్చిన విద్యార్థులకు హాస్టల్ సీట్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని, రేపటి నుంచి డిగ్రీ 3వ కౌన్సిలింగ్ సీట్లు విడుదల అవుతాయని ఆ విద్యార్థులకు కూడా హాస్టల్ సీట్లు కావాలని కావున తక్షణమే ఎస్.టి బాలికల హాస్టల్ అదనంగా ఏర్పాటు చేయాలని ప్రస్తుతానికి హాస్టల్ అడ్మిషన్స్ తీసుకోవాలని త్వరతగితిన హాస్టల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసామన్నారు. కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే అదనపు హాస్టల్స్ ఏర్పాటు చేయడానికి అద్దె బిల్డింగ్ తీసుకోవాలని అలాగే సంబంధించిన అధికారులకు నూతనంగా బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు కోరుతూ పై అధికారులకు లెటర్స్ రాసామని తెలియజేసారు. బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు రాగానే నిర్మాణం ప్రారంభిస్తా మని అన్నారన్నారు. అలాగే జిల్లా ఎస్.టి వెల్ఫేర్ ఆఫీసర్ కె.జ్యోతి స్పందించి హాస్టల్స్ సీట్లు తీసుకుంటా మని కాకపోతే అద్దె బిల్డింగ్ దొరికే వరకూ విద్యార్థులు సద్దుకోవాలని అన్నారని తెలియజేసారన్నారు.

# తుపాను ప్రభావిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

## నిత్యావసర సరుకుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుపాను ప్రభావిత పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు రాజమండ్రి రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ఇప్పటికే పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందజేయడం జరిగిందనీ, రూరల్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 221 కుటుంబాలకు రూ.3.61 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక ఆల్కాట్ గార్డెన్స్ మున్సిపల్ కళ్యాణ మండపంలో పట్టణ పరిధిలోని రూరల్ నియోజక వర్గంలోనీ వార్డులకు చెందిన, మొంథా తుపాను సమయంలో పునరావాస కేంద్రాల్లో బస చేసిన కుటుంబాలకు నిత్యావసర సరుకులు మరియు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పునరావాస కేంద్రాలలో ఉన్న ప్రతి ఒక్కరికీ వెయ్యి రూపాయల చొప్పున, ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న కుటుంబాలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు 50 కేజీల బియ్యం, ఇతర కుటుంబాలకు 25 కేజీల సూపర్ ఫైన్ బియ్యంతో పాటు ఆరు రకాల నిత్యావసర సరుకులు కేజీ చొప్పున పంచదార, కంది పప్పు, పామాయిల్, బంగాళా దుంప, ఉల్లిపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. మొంథా తుపాను ప్రభావం వల్ల నష్ట పోయిన రైతాంగాన్ని గుర్తించి రైతులను ప్రభుత్వం తగిన విధంగా ఆదుకుంటుందని, ముఖ్యంగా కౌలు రైతులు అధికంగా ఉన్నందున వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. భూమి యజమానులకు ఉన్న అపోహలను నివారిస్తూ, సాగు హక్కు పత్రాలు కేవలం కౌలు రైతుల ప్రయోజనార్థమేనని, యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఆయన స్పష్టం చేశారు. మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి, ప్రమాద స్థాయిలో ఉన్న గృహాల నుండి సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారని ఎమ్మెల్యే తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రూరల్ మండలం పరిధిలో తడిసిన ధాన్యం మొత్తం పూర్తిగా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. గత 17 నెలలుగా ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను నిరంతరంగా అమలు చేస్తున్నదని, త్వరలో చేతి వృత్తుల వారికి "ఆదరణ" పరికరాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రూరల్ నియోజకవర్గ పట్టణ ప్రాంత పరిధిలో 28 కుటుంబాలకు రూ.48,000 ఆర్థిక సహాయం అందజేశామని ఎమ్మెల్యే తెలిపారు. కడియం, రాజమహేంద్రవరం రూరల్, హుకుంపేట తదితర ప్రాంతాల ప్రజలకు ఇప్పటికే నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. విపత్తు సమయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి, 24 గంటల్లోనే ఆర్థిక సాయం అందజేసిందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వానికి ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసిల్దార్ పి.హెచ్.జి.ఆర్.పాపారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు వడ్డీ వర ప్రసాద్, శీలం గోవింద్, రొంపిచర్ల ఆంటోనీ, గొందెసి హరినాథ్ రెడ్డి, కొప్పిశెట్టి చిన్ని, కక్కల రమేష్, చిట్టిబోయిన శ్రీనివాస్, ఏడాకుల వెంకటేశ్వరరావు, కుంచె హనుమంతరావు, నరసింహ మూర్తి, చలమూరి సత్యనారాయణ, సింగవరపు సత్యనారాయణ, కేత అప్పారావు, పాలిక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా యువ నాయకుడు అభిరామ్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ టిడిపి యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ సీతానగరం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పొట్నూరి అరుణ్ కుమార్ ఇటీవల కాలంలో ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళుతూ రైలు జారిపడి మృతి చెందాడు. విషయం తెలియడంతో సోమవారం సీతానగరంలో అరుణ్ కుమార్ స్వగృహానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం మృతి చెందిన పార్టీ కార్యకర్త కుటంబానికి అండగా ఉంటామని తెలిపారు. అదేవిధంగా సీతానగరం గ్రామానికి చెందిన వలవల ఆదినారాయణ ఇటీవల కాలంలో సహజ మరణం చెందారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. సింగవరం నాగరత్నం కాలనీకి చెందిన ఆళ్ళ కనకరత్నం గుండెపోటుతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, దైర్యం చెప్పారు.



## బండారు సంజయ్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి
# హాజరైన పెందుర్తి అభిరామ్

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గం శాసనసభ్యులు బండారు సత్యానందరావు కుమారుడు కొత్తపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బండారు సంజీవ్ వారి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్ హాజరయ్యారు.

## ప్రభుత్వ బాలికల హైస్కూలుకు
# వస్తువులు, పరికరాలు అందచేత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గౌతమఘాట్ రాజమండ్రి వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ బాలికల హైస్కూలు (పెద్ద పోస్టాఫీసు వద్ద) విద్యార్థినుల సులభ విద్యాభ్యాసం నిమిత్తం రూ.58 వేలు విలువ చేసే రెండు బీరువాలు, ఆరు టార్పాలిన్లు, ఒక మెగా ఫోను అందచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, ట్రస్టు ఎక్స్-అఫిషియో సభ్యుడు తవ్వా రాజా హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రస్టు గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా,సహాయ కార్యదర్శులు యలమర్తి వెంకటేశ్వరరావు (బాబు), దేవత సుధాకర్, డైరెక్టర్లు లక్కోజు వీరభద్రరావు (లక్కోజీ), శిఘాకొల్లి సీతారామాంజనేయులు తదితరుల చేతుల మీదుగా స్కూలు ప్రధానోపాధ్యాయురాలు టి.సరస్వతి, జె.కె.రేచల్, ఎ.విజయలక్ష్మి, రాజదీప, మాణిక్యాంబ తదితరులకు అందచేసినట్లు ట్రస్టు గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా తెలియచేశారు.

## చిరస్మరణీయుడు క్రొవ్విడి లింగరాజు
# జయంతి సభలో పలువురు నివాళి

### పాత్రికేయుడు, రచయిత బి.వి.రాఘవరావుకు క్రొవ్విడి లింగరాజు స్మారక పురస్కారం అందజేత





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధునిగా, అనువాద రచయితగా, పాత్రికేయుడుగా, ప్రజా ప్రతినిధిగా కీర్తి శేషులు క్రొవ్విడి లింగరాజు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. లింగరాజు 121వ జయంతి సందర్భంగా స్థానిక ఆర్యాపురం డాక్టర్ ఎ.బి నాగేశ్వరరావు పార్కులోని లింగరాజు విగ్రహానికి సోమవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆంధ్ర కేసరి యువజన సమితి, సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో లింగరాజు మనుమలు క్రొవ్విడి భాస్కరరావు, సుబ్రమణ్యం సోదరుల సారధ్యంలో 'సీనియర్ సిటిజన్స్ డే కేర్' భవనంలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ గాంధీ, నెహ్రూల తర్వాత తెలుగు రాష్ట్రాల్లోని స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల్లో తనదైన ముద్రవేసుకున్న ఘనత లింగరాజుకే దక్కుతుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ ఇవ్వడానికి లింగరాజు సర్టిఫికెట్ ఇస్తే సరిపోయేదని, అయితే సర్టిఫికెట్స్ ఇచ్చే విషయంలో ఖచ్చితంగా, నిస్వార్థంగా వ్యవహరించారని ఆయన పేర్కొన్నారు. ఎవరికీ భయపడకుండా, తనదైన బాణీలో లోపాలపై చురకలంటించేవారని సోదాహరణంగా పేర్కొన్నారు. అశోక్ కుమార్ జైన్ మాట్లాడుతూ గోర్కీ నవల మదర్‌ను అమ్మ పేరుతో లింగరాజు తెలుగులోకి అనువదించారని, ఆ నవల చదివిన ఎంతోమంది కమ్యూనిజం వైపు వెళ్లారని అన్నారు. ఎందరో స్వతంత్ర సమరయోధులకు లింగరాజు మార్గదర్శకులని, పురపాలక సంఘ అధ్యక్షుడిగా శాసన సభ్యుడిగా ప్రజలకు సేవలు అందించారని జైన్ పేర్కొంటూ అటువంటి మహానీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహంతి లక్ష్మణరావు, పెరుమాళ్ళ రఘునాథ్, ఆర్ ఎస్ ఎన్ మూర్తి తదితరులు మాట్లాడారు. ఈసందర్భంగా పాత్రికేయుడు,రచయిత బి.వి రాఘవరావుకు క్రొవ్విడి లింగరాజు స్మారక పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి పూర్వాధ్యక్షులు మాదిరాజు శ్రీనివాస్, దేశిరెడ్డి బలరామ నాయుడు, దూర్వాసుల సత్యనారాయణ, నల్లగొండ రవిప్రకాష్, ఏఆర్‌వి సత్యనారాయణ, ఎబి కృష్ణ శర్మ, సీనియర్ సీనియర్ సిటిజన్స్ నాయకులు మారిశెట్టి సత్యనారాయణ, కాసాని శంకరరావు, బండి నరేంద్రబాబు, ఆర్.సత్యనారాయణ, కె.మోహన మురళి కృష్ణ,కొల్లేపర బుల్లయ్య, జామిశెట్టి అప్పాజీ, యం.పార్వతి, కొప్పాడ రామచంద్ర రావు, బొంతు నాగ ముత్యం, బిఎస్ఎన్ ఎల్ సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యకార కుటుంబాలను ఆదుకున్న కూటమి ప్రభుత్వం

## ఎప్పుడూ అండగా ఉంటాం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - 145 కుటుంబాలకు నిత్యావసర సరుకులు సమర్పణ

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విపత్తు సమయంలో మత్స్యకార కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ సహకారంతో సమకూర్చిన 50 కేజీల బియ్యం, కేజీ పంచదార, లీటరు నూనె ప్యాకెట్, కేజీ కందిపప్పు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలును కోలింగాల పేటలోని 145 మత్స్యకార కుటుంబాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక నాయకులు, అర్బన్ తహసీల్దార్ తదితరులతో కలిసి సోమవారం ఆందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాను ప్రభావం వల్ల వేట నిషేధం సమయంలో ఇంటికే పరిమితమైన మత్స్యకార కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. కొద్ది రోజుల క్రితం తమ భవానీఛారిటబుల్ ట్రస్టు తరపున సహకారం అందించడం జరిగిందన్నారు. గట్టుపై ఉన్న బాధితులను ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ సహకారంలో నేడు బాధితులకు సహాయం అందించామన్నారు. ఇక నుంచి 145 కుటుంబాలకు అండగా ఉంటామని, కష్టసమయాల్లో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సాయం అందించామని ఈ విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తించుకోవాలని మత్స్యకార కుటుంబాలను కోరారు. కూటమి ప్రభుత్వం ఒక బాధ్యతగా ముందుకొచ్చి 145 కుటుంబాలకు సహాయ సహకారాలు అందించిందన్నారు. డిపార్టుమెంటు అధికారులు సానుకూలంగా స్పందించి ముందుకొచ్చారన్నారు. చంద్రబాబు సహకారంతో ఈ నిత్యావసర వస్తువులను అందిస్తున్నామని ఆదిరెడ్డి వాసు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో పాటు భవానీ ట్రస్టు తరపున ఎప్పుడూ అన్ని విధాలా మత్స్యకార కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం లంకల్లో ఉన్న తుపాను బాధితులను తీసుకొొచ్చి ఆర్థికసాయం అందించారే తప్ప గోదావరి గట్టుపై ఉన్న మత్స్యకార కుటుంబాలను, బాధితులకు ఎటువంటి సాయం అందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక యువకులు, మత్స్యకార కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

కళను కాపాడుకుంటే

# హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమే..

కంబాల శ్రీనివాసరావు

శివసాయి కూచిపూడి కళా క్షేత్రం తృతీయ వార్షికోత్సవ విజయవంతం





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ శివసాయి కూచిపూడి కళా క్షేత్రం తృతీయ వార్షికోత్సవ సభకు హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా హాజరై తనకు గల కళాభిమానాన్ని చాటుకున్నారు. హిందూ ధర్మంలో కూచిపూడి కళ ఒక భాగమని, ఈ కళను కాపాడుకుంటే హిందూ ధర్మాన్ని రక్షించుకున్నట్టేనని, యుక్త వయస్సులో హిందూ ధర్మంపై ఉన్నటువంటి భక్తితో నేను కూడా కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన వాడినేనని, కూచిపూడి నృత్యంలో నాకు గురువు తణుకు సాయి మాధవి నని చెప్పుకోవటానికి నాకు ఎంతో గర్వాంగ వుందని, వెనువెంటనే వేదికపై ఉన్నటువంటి గురువులు తణుకు సాయి మాదవికి పాదాభివందనం చేసి ఆమె ఆశీస్సులు పొందారు.మా గురువులు సాయి మాదవి ఆహ్వానం మేరకు నేను కూచిపూడిలో శిక్షణ పొందిన సంస్థకు ముఖ్య అతిధిగా విచ్చేయటం కూడా నాకు ఎంతగానో సంతోషంగా వుందని కంబాల శ్రీనివాసరావు తన ఆనందాన్ని వ్యక్త పరిచారు. శివసాయి కూచిపూడి కళా క్షేత్రం తృతీయ వార్షికోత్సవ సభను ఇంత గొప్పగా విజయవంతం చేసిన మా విద్యార్థినీల కుటుంబ సభ్యులుకు, మరి ముఖ్యంగా నాకు అత్యంత ప్రీతి పాత్రుడు, నా శిష్యుడు అని చెప్పుకోవటానికి ఎంత గానో సంతోష పడుతున్నాను. మా కంబాల శ్రీనివాసరావు ఇంత గొప్పవాడు అయినందుకు నాకు ఎంతో ఆనందంగా వుందని, మా కంబాల మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని తణుకు సాయి మాదవి ఆకాంక్షిస్తున్నారని తెలిపారు.

గాదరాడ ఓం శివశక్తి పీఠంలో

# వైభవంగా రుద్రాభిషేకం, గణపతి హోమం

నేడు శివ పార్వతుల కళ్యాణం





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గాదరాడ ఓం శివశక్తి పీఠంలో లోక కళ్యాణార్థం ఓం శివశక్తి పీఠం వ్యవస్థాపకులు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, గణపతి హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మీ దంపతులు లోక కళ్యాణార్థం, ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని సోమవారం నుండి బుధవారం వరకు మూడు రోజులపాటు వేద పండితులు ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా ఆయుష్ హోమాలు, ధన్వంతరి హోమాలు, శివపార్వతుల కళ్యాణం, జ్వాలాతోరణం, చండీ హోమాలు నిర్వహిస్తున్నట్లు బత్తుల తెలిపారు. కార్తీక మాసంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎన్నో రెట్ల ఫలితాన్ని ఇస్తాయని, యావన్మంది భక్తులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలను కనులారా తిలకించి, శివపార్వతుల ఆశీస్సులు మెండుగా పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కోకో, కబడ్డీ విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక : ఎంఈఓ సుజాత

పీఈటీల ఆధ్వర్యంలో చిరు సత్కారం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** బాలికల ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగిందని మండల విద్యాశాఖాధికారిణి సుజాత అన్నారు. సోమవారం గుమ్ములూరు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగా భవాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో సుమారు 20 పాఠశాలల చెందిన, 170 మంది విద్యార్థినిలు పాల్గొన్నారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలికలు అండర్ 14, అండర్ 17 పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎం షేక్ మేరబి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారని సుజాత తెలిపారు. అనంతరం పిఈటిల ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారిణి సుజాత, ప్రధానోపాధ్యాయురాలు గంగాభవానిలకు పూలమాలవేసి సాల్వతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిటికెన భాస్కరరావు, అధ్యక్షులు కొవ్వాడ రాజేంద్రప్రసాద్, కంచుమర్తి దుర్గా ప్రసాద్, గోపాల్ కృష్ణ, బాలిన వెంకటేశ్వరరావు, రాజు, హరి నారాయణ, పిఈటి, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కన్నబాబు, వైసిపి నేతల వ్యాఖ్యలకు

# కౌంటర్ ఇచ్చిన టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జి వర్మ కామెంట్స్



**కాకినాడ/పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కన్నబాబు రామాయణం భారతం చాలా చక్కగా చెప్పుతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా మీరు, సీఎంగా జగన్ రాష్ట్రానికి ఏం వెలగబెట్టారో చెప్పాలి.విపత్తుల సమయంలో జగన్ ఎప్పుడైనా పర్యటించాడా?. గాలిలో తిరగడం తప్ప ఏం చేశాడు.కష్టం వస్తే చంద్రబాబు 5 నిమిషాల్లో అక్కడ ఉంటున్నాడు.గత టిడిపి ప్రభుత్వంలో వరికి ఇచ్చే నష్టపరిహారం 20 వేలు ను మీ ప్రభుత్వంలో 15 వేలు చేసింది ఎవరు.మీరు ఇచ్చే 15 వేలను చంద్రబాబు 25 వేలు చేశారు.బీమాకు ప్రీమియం కట్టామని గతంలో అబద్దాలు చెప్పారు.చంద్రబాబు అసెంబ్లీలో ప్రశ్నిస్తే 590 కోట్లు ఇచ్చారు.డబ్బులు ఇవ్వకుండానే జీవో ఇచ్చిన ఘనత మీది.మీ ప్రభుత్వంలో ఐదు ప్రకృతి విపత్తులు వచ్చాయి, 60 లక్షలు ఎకరాల్లో పంట నాశనం అయింది. 30 వేల కోట్లు రైతుల నష్టపోతే మీరు ఇచ్చింది కేవలం 2 వేలు కోట్లు మాత్రమే.మొంథా తుఫాన్ ఇన్ ఫుట్ సబ్సిడీ 25వేలు చంద్రబాబు ఇస్తారు.మీ ప్రభుత్వంలో 48 లక్షలు మెట్రిక్ టన్నులు ధాన్యం కంటే ప్రస్తుతం 55.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటున్నారు. మీరు పెట్టిన 1600 కోట్లు ధాన్యం బకాయిలు చంద్రబాబు ఇచ్చారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు ధాన్యం కొన్న ఏడాది తర్వాత డబ్బులు ఇచ్చేవారు.. ఇప్పుడు 48 గంటల్లో ఇస్తున్నారు.ఎవరికి చిత్తశుద్ధి ఉందో ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.గత ప్రభుత్వంలో కేంద్రం ఇచ్చిన డబ్బులతో కలిపి రైతు భరోసా 13,500 ఇస్తే ఇప్పుడు చంద్రబాబు 20 వేలు ఇస్తున్నారు.కౌలు రైతులకు కూడా కార్డులు ఇస్తున్నారు.కన్నబాబు మాట్లాడింది కరెక్ట్ కాదు. ఏలేరు కింద ఉన్న నియోజకవర్గాలు పంట నష్టపోవడానికి జగన్ కారణం. ఏలేరు పేజ్ 2ఆధునీకరణ రద్దు చేసింది జగన్. మీ ప్రభుత్వంలో 1788 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ నిధులు బకాయిలు పెట్టారు.అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు వాటిని విడుదల చేసి పది లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పించారు.ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో ముందుకు వెళుతుంటే జగన్ & టీం వాటిని డైవర్ట్ చేస్తున్నారు. కన్నబాబు ఒత్తిడితో అబద్ధాలు మాట్లాడుతున్నారు. కర్నూలు సూపర్ సిక్స్ సభ హిట్ అయిన సింహాచలంలో గోడ కూలిపోయింది. ఆ గోడ కట్టింది వైసిపి కాంట్రాక్టర్ మొంథా తుఫాన్ వలన అలెర్ట్ అయితే ప్రాణ నష్టం జరగకుండా చంద్రబాబు ప్రభుత్వం అప్రమత్తం అయింది.వెంటనే శ్రీకాకుళం ఆలయంలో ప్రమాదం జరిగింది. చంద్రబాబు మంచి పని ప్రజల్లోకి వెళుతుంటే వెంటనే ఇన్సిడెంట్లు ఎందుకు అవుతున్నాయి. ఇటువంటి ఘటనలపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయి. డిజిపి ప్రజలకు ఉన్న అనుమానాలను ఎంక్వయిరీ చేయాలి.డైవర్ట్ చేయడానికి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని దురుద్దేశంతో చేస్తున్నారా? చంద్రబాబు నిమిషంలో ఫీల్డ్‌లో దిగాడు, జగన్ ప్యాలెస్‌లో కూర్చున్నాడు. రిస్క్ చేసి చంద్రబాబు ఫీల్డ్‌కి వచ్చారు. జగన్ ఇప్పటివరకు ప్యాలెస్ నుండి ఎందుకు బయటకు రాలేదు. కష్టంలో ఉన్నప్పుడు బయటకు వచ్చే వాడే నిజమైన రాజకీయ నాయకుడు. జగన్ ఇప్పుడు బయటికి వచ్చి ఏం మాట్లాడుతాడు. చంద్రబాబుకు జగన్ అభినందనలు తెలపడం తప్ప అని ఎద్దేవా చేశారు.

అంబేద్కర్ మహిళలకు ఇచ్చిన

# స్వేచ్ఛ వలన విజయానికి గర్వకారణం

భారత మహిళా జట్టు ప్రపంపకప్ గెలవడం చారిత్రాత్మక విజయం

మహిళల జట్టు ప్రపంచ కప్‌లో మనసత్తా ప్రపంచానికి తెలిసింది - మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

జయహో జయ జయహో భారత నారి రాజమహేంద్రి మహిళా కళాశాల విద్యార్థినిలు








**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత మహిళా జట్టు ప్రపంచ కప్ గెలవడం చారిత్రాత్మకమని దేశంలో ఉన్న మహిళలందరూ వారి విజయాన్ని చూసి గర్వపడుతున్నారని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆనందం వ్యక్తం చేసారు. భారత మహిళల జట్టు వరల్డ్ కప్ గెలిచిన సందర్భాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రి డిగ్రీ, పిజి కళాశాల విద్యార్థులు కళాశాల వద్ద నుంచి గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి అక్కడ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య ముఖ్య అతిథులుగా విచ్చేసారు. టీకే మాట్లాడుతూ భారత మహిళల జట్టు ప్రపంచకప్‌లో పోరాటం చేసి సౌత్ ఆఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించడం అందరికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. విమానాలు నడిపే పైలట్లుగా, రైళ్లు నడిపే లోకో పైలట్లుగా, ఆటోడ్రైవర్లుగా కూడా తాము సాధించలేని ఏది లేదన్నట్టుగా కుటుంబాన్ని ముందుకు నడిపించడానికి అన్ని విధాలుగాను ముందుకు సాగుతున్నారన్నారు. గెలిచిన భారత జట్టుకి బిసిసిఐ 37 కోట్లు ప్రైజ్ మనీగా ప్రకటించడం జరిగిందని, వారి విజయాన్ని చూసి ప్రపంచమంతా గర్వపడుతోందన్నారు. ప్రపంచమేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహిళలకు ఇచ్చిన స్వేచ్ఛ వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించడానికి మహిళల జట్టుకి శుభాకాంక్షలు తెలిపారు. తేతలి సత్య సౌందర్య మాట్లాడుతూ ఇండియా మహిళా జట్టు ఆల్‌రౌండర్లుగా అన్ని జట్లతో పోరాటం చేసి వరల్డ్ కప్‌ని సాధించడం గర్వకారమన్నారు. తమ కళాశాలలో విద్యార్థినులను కూడా ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దుతున్నామని, ఏ రంగమైనా మహిళలు తమను తాము నిరూపించుకునేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. దీనికి ముందుకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎంకెవిస్ ప్రసాద్, ఎన్.ఎస్.ఎస్. పిఓ దంటు వీర వెంకటరావు, కళాశాల అధ్యాపకులు జ్యోతిర్మయి, అనూష, శుభదేవి, కీర్తి అధ్యాపకేత్ర సిబ్బంది వీరస్వామి, శాంతి, నాగమ్మ, కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ యూత్ సర్వీస్ - 2025 పోటీలలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందించిన కళాశాల సిబ్బంది



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలో రోటరీ క్లబ్ వారు యూత్ సర్వీస్ 2025 నిర్వహించబడిన అనేక పోటీలలో "ఆదిత్య మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల "విద్యార్థునిలు ఘన విజయం సాధించారు. ఈ పోటీలలో భాగంగా బీఎస్సీ స్టాట్ మొదటి సంవత్సరం చెందిన గేదెల దీపికకు వక్తృత్వము పోటీలో మూడవ స్థానం, వ్యాస రచనలో మూడవ స్థానం, చిత్ర లేఖనంలో రెండవ స్థానం, మరియు బీఎస్సీ డేటా సైన్స్ మొదటి సంవత్సరానికి చెందిన కూచిబోట్ల సాత్విక శర్మకు వక్తృత్వములో ద్వితీయ స్థానంలో, బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరానికి చెందిన పాండ్రింకి హాసినికి చిత్రలేఖనంలో ప్రథమ స్థానం, బిఎస్సి కంప్యూటర్స్ మొదటి సంవత్సరానికి చెందిన షేక్ సాజిదకు వ్యాస రచనలో ప్రథమస్థానం సాధించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థినుల ను ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎస్‌పి గంగిరెడ్డి, ఆదిత్య మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె ఎన్.రెహమాన్, వైస్ ప్రిన్సిపాల్ కే.ఆనందరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

కార్తీక మాసం ఘాట్లు రద్దీ దృష్ట్యా

# భక్తులు క్రమశిక్షణ పాటించాలి

భక్తులు, భద్రతకు పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలి

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు

జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ సూచన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్తీక మాసం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న శివాలయాలు, ఇతర ఆలయాల వద్ద, ఘాట్ల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నచో ఎవరూ కంగారుపడి తోసుకోవద్దని, నెమ్మదిగా, క్రమశిక్షణతో క్యూ లైన్‌లలో వెళ్లాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, త్రొక్కిసలాటలు, తోపులాటలు జరగకుండా పోలీస్ వారు, దేవాదాయ శాఖ మరియు ఆలయ కమిటీ వారు ఇచ్చిన సూచనలు, జాగ్రత్తలు పాటిస్తూ క్యూ లైన్‌లో ప్రశాంతంగా దర్శనాలు చేసుకుంటూ పోలీసు వారికి సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేసినారు. కార్తీక వన భోజనాలు, పిక్నిక్ స్పాట్స్ వద్దకు వచ్చే ప్రజల సంఖ్యను బట్టి తోపులాటలు, తొక్కిసలాటలు జరగకుండా తగినన్ని భోజన కౌంటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయ్యప్ప పడి పూజలు నిర్వహించే సమయంలో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దీపాలు వెలిగించినప్పుడు అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి ఇసుక, డ్రమ్ములతో నీటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అవసరమైనచో పోలీస్, ఫైర్, రెవెన్యూ, సంబంధిత అధికారులకు ముందస్తుగా తెలియపరచాలన్నారు. పోలీసుల సహాయం కోసం డయల్ 112కు ఫోను చేయాలని ప్రజలను జిల్లా ఎస్పీ కోరారు.

మొంథా తుపాను ఎఫెక్ట్‌తో

# నీటమునిగిన వేలాది ఎకరాలు

సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల కేంద్రం సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యాలయం నందు జరిగిన మీడియా సమావేశంలో సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు విలేకరులతో మాట్లాడుతూ మొంథా తుఫాను ఎఫెక్ట్‌తో ఏపీలో ఎంతో ఆస్తి, పంట నష్టం జరిగిందని భారీ వర్షాలతో వందలాది ఎకరాల్లో వరి, అరటి, పలు రకాల వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయని దాంతో రైతులు, కౌలు రైతులు నష్టపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరాకు కనీసం 30,000 రూపాయలను అందజేసి ఆదుకోవాలని అలాగే తుఫాన్ వలన ఇల్లు పడిపోయిన వారికి గృహ నిర్మాణాలు రాష్ట్ర ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నానని పలివెల అన్నారు. దేశానికి వెన్నెముక లాంటి రైతు కష్టాల్లో ఉంటే ఆదుకోవాల్సిన బాధ్యత నేటి కూటమి ప్రభుత్వానికి ఉందని అన్నారు. తుఫాను కారణంగా సుమారు రూ.5,244 కోట్ల మేర నష్టం కలిగినట్లు ప్రాథమికంగా అంచనాలు ఉన్నాయని 4,794 కిలోమీటర్ల మేరకు రోడ్లు దెబ్బతిన్నాయని 1.38 లక్షల హెక్టార్లలో పంటలకు నష్టం జరిగిందని అధికారులు అంచనా వేయడం జరిగిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మొంథా తుఫాను వణికించిందని ప్రభుత్వం ముందస్తుగా చేపట్టిన చర్యలతో భాగంలో చాలా వరకూ ప్రాణనష్టం లేకుండా బయటపడినప్పటికీ రైతు కూలీలు నేడు ఆర్థిక ఇబ్బందులు పడక తప్పడం లేదని వీరబాబు అన్నారు. ఆక్వారంగంలో రూ.514 కోట్ల నష్టం జరిగిందని నీటిపారుదల శాఖకు రూ.234 కోట్లు, ఉద్యానవన పంటలకు రూ.40 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనాలు ఉన్నాయని సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారని అన్నారు. అలాగే కరెంట్ స్తంభాలు నేలకూలడం. విద్యుత్ వైర్లు తెగిపోవటం వంటి కారణాలతో విద్యుత్‌శాఖకు రూ.19 కోట్ల నష్టం జరిగిందని, అలాగే తుఫాను కారణంగా 23 జిల్లాల పరిధిలోని 3,045 ఇళ్లు ధ్వంసమయ్యాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారని, పంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా శాస్త్రవేత్తల సూచనలు రైతులకు తెలియజేయాలని కోరుతున్నానన్నారు. తడిచి ముద్దయిన ధాన్యాన్ని కూటమి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. లక్షల రూపాయలు అప్పులు తెచ్చి ఎన్నో ఆశలతో పంట వేస్తే,మ్నొంథా తుపాన్ తమను నిండా ముంచిందని అన్నదాతలు చెబుతున్నారని తెలిపారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు రైతులకు అండగా నిలబడి న్యాయం జరిగేంతవరకు పోరాటానికి వెనకాడబోమని పలివెల వీరబాబు తెలియజేశారు.

# జిల్లా పోలీస్ పిజిఆర్‌ఎస్‌కు 85 ఫిర్యాదులు

ప్రజా ఫిర్యాదుల వేదికలో 65 ఫిర్యాదుల స్వీకరణ..

సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాలు..



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక (పీజీ ఆర్ ఎస్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, మొత్తం 85 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు-42, కుటుంబ కలహాలు-24, ఇతర విభాగాలకు చెందినవి-19గా గుర్తించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశిస్తూ "ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని. 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి తగిన పరిష్కారం చూపాలని. చేపట్టిన చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఈ కార్యాలయంకు వచ్చిన ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఎస్పీ "ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి కట్టుబాటుతో పని చేస్తున్నారని తెలిపారు.

# ప్రతిరోజూ వేదనే

చాలామంది దృష్టిలో అతను "ప్రపంచంలోనే అత్యంత అదృష్టవంతుడు". కానీ 40 ఏళ్ల విశ్వాస్ కుమార్ రమేశ్ కు మాత్రం ఆ అదృష్టమే ఒక శాపంగా మారింది. 260 మందిని బలిగొన్న ఘోర విమాన ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన ఏకైక వ్యక్తి అతనే. ఆ ఘటనలో బతకడం ఒక అద్భుతమే అయినా, ఆ జ్ఞాపకాలతో జీవించడం మాత్రం నరకంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత జూన్ 12న అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం (బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్) టేకాఫ్ అయిన కొద్ది క్షణాలకే కుప్పకూలింది. సమీపంలోని బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాన్ని ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 241 మంది, కింద ఉన్న మరో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ దగ్గర 11 సీటులో కూర్చున్న విశ్వాస్ కుమార్ రమేశ్ మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. అదే విమానంలో ప్రయాణిస్తున్న ఆయన తమ్ముడు అజయ్ ఈ దుర్ఘటనలో మరణించారు. "ఆ ప్రమాదంలో బతికింది నేను ఒక్కడినే. ఇప్పటికీ దీన్ని నమ్మలేకపోతున్నాను. ఇది నిజంగా ఒక అద్భుతం. కానీ



నా సోదరుడిని కోల్పోయాను. అతడు నాకు వెన్నెముక లాంటివాడు. గడిచిన కొన్నేళ్లుగా నాకు అండగా నిలిచాడు," అని భారత సంతతికి చెందిన బ్రిటిష్ జాతీయుడైన రమేశ్ బీబీసీతో మాట్లాడుతూ ఆవేదన చెందారు. టేకాఫ్ అయిన వెంటనే రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికలో పేర్కొంది.
ప్రమాదం జరిగినప్పుడు పెద్ద శబ్దం వినిపించిందని, విమానం మంటల గోళంలా మారి హాస్టల్ భవనంపై పడిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే, ఒంటినిండా మసితో, దిగ్భ్రాంతిలో రమేశ్ నడుచుకుంటూ రావడం అక్కడి వీడియోలలో రికార్డయింది. ప్రమాదం జరిగిన మరుసటి రోజే ప్రధాని నరేంద్ర మోదీ ఆసుపత్రిలో రమేష్‌ను పరామర్శించారు. తాను ఎలా బతికానో కూడా తెలియదని అప్పుడు ప్రధానికి చెప్పినట్లు రమేశ్ గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం లీసెస్టర్‌లోని తన ఇంట్లో ఉంటున్న రమేశ్, ఆనాటి భయంకర జ్ఞాపకాలతో మానసిక క్షోభ అనుభవిస్తున్నట్లు తెలిపారు. "ఇప్పుడు నేను ఒంటరినయ్యాను. నా గదిలో ఒంటరిగా కూర్చుంటున్నాను. నా భార్యతో, కొడుకుతో కూడా మాట్లాడటం లేదు. మా అమ్మ నాలుగు నెలలుగా ఇంటి గుమ్మం వద్దే మౌనంగా కూర్చుంటోంది. ఆ ఘటన గురించి ఎవరితోనూ మాట్లాడలేకపోతున్నాను. రాత్రంతా అవే ఆలోచనలు, మానసికంగా కుంగిపోతున్నాను," అని బీబీసీకి వివరించారు. రమేశ్ పోస్ట్-ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్‌తో బాధపడుతున్నారని, సరిగ్గా నడవలేకపోతున్నారని ఆయన శ్రేయోభిలాషులు తెలిపారు. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా మధ్యంతర పరిహారంగా రూ. 22 లక్షలు (21,500 పౌండ్లు) అందించిందని, అయితే ఈ మొత్తం ఏమాత్రం సరిపోదని వారు అంటున్నారు.

# భారత పుత్రికలు చరిత్ర సృష్టించారు

న్యూఢిల్లీ

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించారు. ప్రైవేట్ రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా వాతావరణం కల్పించేందుకు రూ.లక్ష కోట్ల నిధిని ఉపయోగించనున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ సందర్భంగా ఐసీసీ వన్డే వరల్డ్ కప్ సాధించిన భారత జట్టును, బాహుబలి రాకెట్‌ను విజయవంతంగా నింగిలోకి పంపిన భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమం సైన్స్‌కు సంబంధించిందని.. కానీ తొలుత క్రికెట్‌లో భారత్ సాధించిన అద్భుతమైన విజయం గురించి మాట్లాడుతున్నా నన్నారు. భారత మొత్తం తమ జట్టు సాధించిన విషయంతో సంతోషంగా ఉందని.. మహిళల జట్టు తొలి ప్రపంచకప్‌ని సాధించిందని.. ఇందుకు తాను మహిళా జట్టును హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాన్నారు. విజయాన్ని చూసి గర్విస్తు న్నానని.. ఈ విజయం దేశంలోని కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.ఆ తర్వాత భారీ ఉపగ్రహాన్ని అత్యంత బరువైన ఉపగ్రహాన్ని ప్రయోగించినం దుకు ఇస్రోను అభినందించారు. నిన్న భారత్ శాస్త్ర సాంకేతిక రంగంలో జెండా ఎగుర వేసిందని.. శాస్త్రవేత్తలు అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగిం చారన్నారు. ఈ మిషన్, ఇస్రోతో సంబంధం ఉ?న శాస్త్రవేత్తలందరినీ తాను అభినందిస్తున్నానన్నారు. రూ.లక్ష కోట్ల నిధి ప్రైవేట్‌రంగంలో పరిశోధనలను ప్రోత్సహిస్తుం దన్నారు. ఈ రోజు శాస్త్ర సాంకేతిక ప్రపంచంలో కూడా గొప్పరోజని.. 21వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు కలిసి కొత్తతరం శాస్త్ర సాంకేతిక రంగాలకు



మార్గదర్శకత్వం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన అభివృద్ధి ఆవిష్కరణ పథకాన్ని ప్రారంభించామని.. దానికి రూ.లక్ష కోట్ల నిధిని కేటాయించామన్నారు.'రూ.లక్ష కోట్లు మోదీ వద్దే ఉంటుందని మీరు అనుకోవచ్చు. అందుకే మీరు చప్పట్లు కొట్టడం లేదు. ఈ లక్ష కోట్లు మీ కోసం (శాస్త్రవేత్తలు). ఇది మీ సామర్థ్యాలను పెంపొందించడానికి. ఇది మీ కోసం కొత్త అవకాశాలను తెరవడానికి. ప్రైవేట్ రంగంలో కూడా పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడమే మా ప్రయత్నం' అని పేర్కొన్నారు. భారతదేశం హై రిస్క్, అధిక ప్రభావ పరిశోధన ప్రాజెక్టులకు మద్దతు ఇస్తోందని ప్రధాని తెలిపారు. ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను సైన్స్ అండ్ టెక్నాలజీకి శక్తి కేంద్రంగా ఎదగడానికి ప్రోత్సహిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో ఆధునిక ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి తమ ప్రభుత్వం గణనీయమైన సంస్కరణలను చేపట్టిందన్నారు.ఒక దశాబ్దంలో పరిశోధన వ్యయం రెట్టింపు అయ్యిందని.. మా ప్రభుత్వం ఆర్థిక నియంత్రణ, సముపార్జన విధానంలో గణనీయమైన సంస్కరణలు చేసిందని చెప్పారు.ఇది భారత్ ఆవిష్కరణ పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, వృద్ధి-అభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించడానికి ప్రభుత్వం అనుసంధాన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించిందని తెలిపారు. దశాబ్దం కిందట భారత్‌లో మహిళలు దాఖలు చేసే పేటెంట్ల సంఖ్య ఏటా వంద కంటే తక్కువగా ఉండేదని.. ప్రస్తుతం ఈ సంఖ్య 5వేలకు పెరిగిందన్నారు. భారత్‌లో ౹ఐఓ విద్యను అభ్యసిస్తున్న వారిలో 43శాతం మంది మహిళలు ఉన్నారని.. ఇది ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ అని ప్రధాని వివరించారు.

**దేశ మహిళల్లో ఆత్మవిశ్వాసానికి చిహ్నం**

క్రికెట్‌లో భారత పుత్రికలు చరిత్ర సృష్టించారని ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ విజయం దేశ మహిళల్లో ఆత్మవిశ్వాసానికి చిహ్నమని అభివర్ణించారు. భారత మహిళా జట్టు తొలిసారి వన్డే ప్రపంచకప్ విజేతగా నిల వడంపై ఈ విధంగా స్పందించారు. బిహార్‌లోని సహర్సాలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడు తూ.. ఎన్డీయే అంటే వికాసమని, మహాగర్ బంధన్ అంటే వినాశనమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మరోసారి ఏన్డీయే ప్రభుత్వం ఏర్పడేలా తొలిసారి ఓటువేసే వారు తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు. "నేను విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడి నేతలకు మఖానా బాక్స్‌లను కానుకగా అందజేశాను. ఇది బిహార్ కార్మికుల శ్రమకు నిదర్శనమని చెప్పాను. అలాగే కోసి నది వరదల ప్రభావాన్ని తగ్గించేలా శాశ్వత పరిష్కారం కోసం మేం కృషి చేస్తున్నాం" అని మోదీ అన్నారు. ఆర్జేడీ 'జంగల్ రాజ్'లో పోలీసులు కూడా సురక్షితంగా లేరని, చట్టాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకున్న డీఎస్పీ సత్యపాల్‌సింగ్‌ను హత్య చేశారని విమర్శించారు.

## పరిస్థితి దిగజారినప్పుడు కాదు

# ముందుగానే సిద్ధం కావాలి

ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా అఫిడవిట్ దాఖలు చేయాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ని ఆదేశించింది. కాలుష్యాన్ని అరికట్టేందుకు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని కమిషన్‌ను ప్రశ్నించింది. పరిస్థితి మరింత దిగజారినప్పుడు మాత్రమే అధికారులు చర్యలు తీసుకోకూడదని.. అంతకు ముందు సిద్ధం కావాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. విచారణ సందర్భంగా కోర్టుకు అమికస్ క్యూరీగా సహాయం చేస్తున్న సీనియర్ న్యాయవాది అపరాజిత సింగ్ దీపావళి తర్వాత ఢిల్లీలోని అనేక వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు పని చేయడం లేదంటూ కోర్టుకు తెలిపారు.
37 స్టేషన్లలో తొమ్మిది మాత్రమే నిరంతరాయంగా పని చేస్తున్నాయని.. ఈ కేంద్రాలు సరిగా పని చేయకపోతే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ ను ఎప్పుడు అమలు చేయాలో నిర్ణయించడం కష్టమవుతుందని అపరాజిత సింగ్ తెలిపారు. పరిస్థితి క్లిష్ట స్థాయికి చేరుకోకుండా నిరోధానికి కమిషన్ ఏం చర్యలు తీసుకుందో చెప్పాలని.. ఇప్పటికే తీసుకున్న, ప్రతిపాదిన చర్యలను వివరించే వివరణాత్మక అఫిడవిట్‌ను దాఖలు



చేయాలని కమిషన్‌ను ఆదేశించింది. ఏజెన్సీలు 'ప్రతిస్పందించడానికి బదులు'గా.. 'ముందుగానే సిద్ధం' కావాలని స్పష్టం చేసింది. కాలుష్య డేటాను పర్యవేక్షించే బాధ్యత కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డుదేనని కమిషన్ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. అన్ని ఏజెన్సీలు త్వరలో తమ నివేదికలను సమర్పిస్తాయని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు హామీ ఇచ్చారు. కాలుష్యం పెరిగినప్పుడు ఏజెన్సీలు చర్యలు తీసుకోవడమే కాకుండా.. దాన్ని నివారించడానికి సకాలంలో చర్యలు తీసుకోవాలని గతంలో ఆదేశించినట్లుగా కోర్టు గుర్తు చేసింది. అయితే, అక్టోబర్ 15న దీపావళి సందర్భంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో పరిమిత స్థాయిలో గ్రీన్ క్రాకర్స్ అమ్మకాలు, వినియోగానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. సాంప్రదాయ ఉత్సవాలు, పర్యావరణ సమస్యల మధ్య సమతుల్యత అవసరమని కోర్టు పేర్కొంది. గ్రీన్ క్రాకర్స్ అక్టోబర్ 18 నుంచి 20 మధ్య మాత్రమే విక్రయించవచ్చని.. నిర్దిష్ట సమయాల్లో మాత్రమే కాల్చేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మినహాయింపును టెస్ట్ కేసు ప్రాతిపదికన ఇస్తున్నట్లు కోర్టు పేర్కొంది. అలాగే, అక్టోబర్ 14 నుంచి 25 వరకు గాలి నాణ్యతను పర్యవేక్షించి.. రోజువారీ నివేదికలను సమర్పిం చాలని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులను కోర్టు ఆదేశించింది.

## 9 రాష్ట్రాలు, 3 యూటీల్లో నేటి నుంచే సర్




న్యూఢిల్లీ/చెన్నై

దేశవ్యాప్తంగా ఓటరు సమగ్ర సవరణ(సర్) ప్రక్రియకు భారత ఎన్నికల సంఘం(ఈసీ) మంగళవారం నుంచి శ్రీకారం చుట్టనుంది. 9 రాష్ట్రాలు, 3యూటీల్లో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఏడో తేదీ వరకు కొనసాగే ఈ ప్రక్రియలో 51 కోట్ల మంది ఓటర్లు పాలుపంచుకోనున్నారు. ఈ రెండో దశ 'సర్' ప్రక్రియ కిందకు వచ్చే యూటీలు, రాష్ట్రాలు ఏవనేది ఈసీ వర్గాలు వెల్లడించాయి. అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్, పాండిచ్చేరి యూటీ జాబితాలో, ఛత్తీసగఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లు రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి. సర్ ప్రక్రియ అనేక దశల్లో కొనసాగనుంది. ఎన్యుమరేషన్ ప్రక్రియ మంగళవారం మొదలై డిసెంబరు 4వ తేదీ వరకు కొనసాగుతుంది. అనంతరం ముసాయిదా ఓటరు జాబితాను డిసెంబరు 9వ తేదీన, తుది జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ఈసీ విడుదల చేస్తుంది. స్వాతంత్ర్య భారతంలో 'సర్' ప్రక్రియను ఈసీ చేపట్టడం ఇది తొమ్మిదోసారి. చివరిగా 2002-04 మధ్య చేపట్టింది. మరోవైపు, తమిళనాడులో 'సర్' ప్రక్రియను అడ్డుకోవాలంటూ అధికార డీఎంకే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమిళనాట ఆరుమాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పరిస్థితుల్లో అత్యవసరంగా సర్ ప్రక్రియను చేపట్టడం ప్రజాప్రాతిని?ధ్య చట్టానికి వ్యతిరేకమని ఆ పిటిషన్‌లో భారతి తెలిపారు.

**పారదర్శకంగా 'సర్': ఈసీ**

'సర్' ప్రక్రియను పారదర్శకంగా చేపడతామని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఈసీ మద్రాస్ హైకోర్టుకు నివేదించింది. మృతులు, నివాసం మారినవారు, అర్హతలేనివారు, రెండు ప్రాంతాల్లో ఓటుహక్కు కలిగిన వారి పేర్లను తొలగించేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలంటూ టీ నగర్‌కు చెందిన అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, తాంబరం అన్నాడీఎంకే న్యాయవాది వినాయగం వేర్వేరుగా దాఖలు చేసిన పిల్‌పై ఇటీవల విచారణ చేపట్టిన హైకోర్టు.. ఈసీని వివరణ అడిగిన విషయం తెలిసిందే. భారత ఎన్నికలసంఘం తరఫున స్టాండింగ్ కౌన్సిల్ నిరంజన్ రాజగోపాలన్ హాజరయి దీనిపై వివరణ ఇచ్చారు.

## ట్రక్ బీభత్సం

జైపూర్





రాజస్థాన్‌లో మరో ఘోర ప్రమాదం జరిగింది. సోమవారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ప్రయాణిస్తున్న వాహనాలపై డంపర్ ట్రక్ దూసుకెళ్లింది. ఐదుకిలోమీటర్ల మేర వాహనాలను ఢీకొట్టుకుంటూ వెళ్లింది.
ఈ ప్రమాదంలో 19 మందికి పైగా మృతి చెందారు. యాభై మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. 17కు పైగా వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. జైపూర్ నగరంలోని హర్మదా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ డంపర్ ట్రక్ బీభత్సం సృష్టించింది. అతి వేగంతో వచ్చిన డంపర్ ట్రక్ ముందుగా ఓ కారును ఢీకొట్టింది. ఆ తర్వాత పల్టీ కొడుతూ మరో రెండు వాహనాలపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కార్లు, బైకులు, పాదచారులు అన్నీ డంపర్ ట్రక్ కిందపడి నుజ్జునుజ్జ య్యాయి. అయినప్పటికీ ట్రక్ డ్రైవర్ వాహనం ఆపకుండా ముందుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంతో అప్రమత్తమైన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో డంపర్ డ్రైవర్ మద్యం సేవించినట్లు సమాచారం. ఐదు కిలోమీటర్ల మేర అతను వాహనాలను ఢీకొంటూ ముందుకు సాగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 'డంపర్ ట్రక్ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడు. రోడ్డుమీద వాహనాల్ని ఢీకొట్టుకుంటూ వెళ్లాడు. వాహనాలు ప్రమాదానికి గురవుతున్నా ఆపకుండా ముందుకు వెళ్లాడని ' వారు పేర్కొన్నారు.
పోలీసుల దర్యాప్తు
ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డంపర్ డ్రైవర్ మద్యం సేవించాడా? లేక వాహనంలో బ్రేక్ ఫెయిల్యూర్ జరిగిందా? అనే కోణాల్లో పూర్తి స్థాయిలో దర్యాప్తు ప్రారంభించారు.

## రూ.3 వేల కోట్లు కొల్లగొట్టారు

దిల్లీ

దేశవ్యాప్తంగా ఇటీవలి కాలంలో పెచ్చుమీరుతున్న 'డిజిటల్ అరెస్టు' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠినచర్యలు తీసుకుంటామని పేర్కొంది. డిజిటల్ అరెస్టు స్కామ్‌లపై కొద్దిరోజులుగా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. "ఒక్క మనదేశంలోనే ఈ అరెస్టు బాధితుల నుంచి రూ.3వేల కోట్లు కొల్లగొట్టడం దిగ్భ్రాంతికరం. ఇప్పుడు వీటిని మనం తీవ్రంగా తీసుకోకపోతే.. ఈ నేరగాళ్లు పెచ్చుమీరిపోతారు. వీటికి అడ్డుకట్టవేసేలా కఠినచర్యలు తీసుకోవాలని నిశ్చయించుకున్నాం" అని సుప్రీంకోర్టు పేర్కొంది. "డిజిటల్ అరెస్ట్ సమస్య పెద్దస వాల్‌గా ఉంది. ఇతర దేశాల్లో ఎలాంటి పరిస్థితి ఉందో తెలియదు. సాంకేతిక, ఆర్థిక విభాగాలు ఎలా పనిచేస్తున్నాయో తెలియదు. ఆ విభాగాలు మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని హెచ్చరించింది. ఇలాంటి కేసుల్లో బాధితులు ఎక్కువగా వయోధికులే ఉండటం అత్యంత దయనీయమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానానికి వెల్లడించారు. అలాగే ఈ కేసుల్లో ఫిర్యాదులపై దర్యాప్తు చేసేందుకు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యూనిట్ ఉందని తెలిపిన మెహతా.. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు వివరాలు దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. ఈ మోసాలు దేశవ్యాప్తంగా చోటుచేసుకుం టున్న నేపథ్యంలో మొత్తం వ్యవహారంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని యోచిస్తున్నట్లు గత విచారణలో సుప్రీంకోర్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా విభిన్న రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విస్తృతస్థాయిలో దర్యాప్తు జరిపే సాంకేతిక, సిబ్బందిపరమైన వనరులు సీబీఐకి ఉన్నాయా? అని కూడా ఆరా తీసింది. ఇందుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమాధానం ఇస్తూ ఇప్పటికే సీబీఐ ఇలాంటి మోసాలపై దర్యాప్తు చేస్తోందని చెప్పారు. కేంద్రహోంశాఖ పరిధిలోని సైబర్ క్రైమ్ డివిజన్ నుంచి ఇందుకు అవసరమైన సాంకేతిక సాయం అందుతున్నట్లు వివరించారు.

### రాజమండ్రిలో అధికార పార్టీ వాళ్లే

# మద్యం వ్యవహారంలో బరితెగింపు

**ఇప్పుడు మజ్జి రాంబాబు, ఇప్పుడు కిలపర్తి శ్రీనివాస్ మాట్లాడిన మాటల సంగతేంటి.. - రాజమండ్రి ప్రతిష్ట మంటగలుపుతున్న టీడీపీ నేతలు**

**ఆ వాయిస్లు మావి కాదు అనడం కాదు నిర్ధారించుకోండి - కాశీబుగ్గ ఘటనకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి - మరి తిరుపతి, సింహాచలం ఘటనలలో చైర్మన్స్ పై చర్యలేవి**

**సమస్యను పక్కదారి పట్టించడానికే జోగి రమేష్ అరెస్టు -వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ జాతీయఅధికార ప్రతినిధి మార్గాని భరత్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేసారు. ఇది ప్రయివేటు టెంపుల్ కనుక ప్రభుత్వానికి బాధ్యత లేదనడం దారుణమన్నారు. మరి ప్రభుత్వం ఎందుకున్నట్టు అని ఆయన ప్రశ్నించారు. సిటీ వైస్సార్ సిపి కార్యాలయంలో సోమవారం సాయంత్రం మాజీ ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు, సింహాచలం దేవస్థానం దగ్గర 8మంది ప్రాణాలు కోల్పోయారని, ఇప్పుడు కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాటలో 9మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారని భారత్ ప్రస్తావించారు. ఒక గ్రామంలో పాతిక వేలమంది భక్తులు గుడికి వచ్చారంటే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియదా అని భరత్ ప్రశ్నించారు. వరుసగా దుస్సంఘటనలు జరుగుతున్నా ఇంకా నిర్లక్ష్యమేనా అని ఆయన పేర్కొన్నారు. గత పుష్కరాల్లో 29మంది చనిపోవడానికి చంద్రబాబు ప్రభుత్వం కారణం కాదా అన్నారు. కేవలం మీడియా పబ్లిసిటీ యావ కారణంగానే ఈ ఘటన జరిగిందన్నారు. కాశీబుగ్గలో గుడి కట్టిన 90ఏళ్ల వృద్ధునిపై కేసు కట్టి చేతులు దులిపేసుకుంటారా అని భరత్ ప్రశ్నించారు. మరి తిరుపతిలో ఘటనకు కారణమైన చైర్మన్ పై చర్యలేవన్నారు. ఆయనపై కేసు కట్టారా అన్నారు. అలాగే సింహాచల క్షేత్రం చైర్మన్ పై కేసు ఎందుకు కట్టలేదన్నారు. ఎండోమెంట్స్ డిపార్ట్ మెంట్ పరిధిలో గల ఆలయాల్లో సంఘటనలపై ఎందుకు కేసు కట్టలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు.మరి పందు ముసలయంపై ఎలా కేసు కడతారని ఆయన నిలదీశారు. ఈ ఘటనలపై ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, అందులో భాగంగానే జోగి రమేష్ వ్యవహారమని భరత్ అన్నారు. మద్యం కేసులో ఎలా అరెస్టు చేస్తారని అన్నారు. జనార్ధనరావు అనే నిందితుడు నోటికొచ్చినట్లు పేర్లు చెబితే అరెస్టు చేసేస్తారా అని ఆయన ప్రశ్నించారు. జయచంద్రారెడ్డి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చి, ఆయనను, ఆయన బావమరిదిని ఎందుకు పట్టుకోలేదని ఆయన ప్రశ్నించారు. జనార్ధన తెలుగుదేశం కండువా వేసుకుని ఉన్న ఫోటోని భరత్ చూపిస్తూ మరి దీన్ని ఏమనాలని ప్రశ్నించారు. మద్యం సిండికేట్ తో మంతనాలు జరిపినట్లు ఆడియో వైరల్ అయితే అది తనది కాదని సిటీ టీడీపి ప్రెసిడెంట్ మజ్జి రాంబాబు చెబితే, ఏఐ ద్వారా మార్ఫింగ్ చేసారని ఎమ్మెల్యే చెబుతున్నారని భరత్ పేర్కొన్నారు. ఇప్పుడు మాజీ కార్పొరేటర్ కిలపర్తి శ్రీనివాస్ మాట్లాడిన మాటల సంగతేంటని ఆయన నిలదీశారు. షాపునకు లక్ష 40వేలరూపాయలు ఎమ్మెల్యేకి ఇవ్వాలని ఆ వాయిస్ లో ఉందని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన ఆడియో వినిపించారు. పైగా కిలపర్తి శ్రీనివాస్ ని ఈవిఎం ఎమ్మెల్యే దగ్గరుండి తీసుకెళ్లి చంద్రబాబుతో ఫోటో దిగారని ఆయన అన్నారు. ఒకపక్క రాజమండ్రిలో అధికార పార్టీ వాళ్లే మద్యం వ్యవహారంలో విచ్చలవిడిగా బరితెగించి వ్యవహరిస్తుంటే, మరోపక్క జోగి రమేష్ ని ఎలా అరెస్టు చేస్తారండి అని భరత్ ప్రశ్నించారు. ఇంతదారుణంగా ఈవీఎం ఎమ్మెల్యే ఆయన అనుచరులు వ్యవహరిస్తూ, రాజమండ్రి ప్రతిష్టను మంటగలుపుతుంటే ఇంకా ఎందుకు ఉపేక్షిస్తున్నారని ఆయన అన్నారు. తక్షణం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ని సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ లను ఆయన డిమాండ్ చేసారు. ఇసుక, మద్యం సిండికేట్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లు రెచ్చిపోతుంటే, అధికార యంత్రాంగం ఏమి చేస్తోందని భరత్ ప్రశ్నించారు. నగర టీడీపి అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ల వాయిస్‌లు దొరికినపుడు ఎందుకు దర్యాప్తు చేయడం లేదని, ఆ వాయిస్‌లు ఎందుకు నిర్ధారించడం లేదని ఆయన ప్రశ్నించారు. హాస్టల్ బాలికకు అన్యాయం జరిగిందని అందోళన చేస్తే కేసులు కడుతున్నారని, మరి ఫ్లయ్ ఓవర్ దగ్గర శిలాఫలకం ధ్వంసం చేస్తే కేసులు పెట్టలేదని ఆయన పేర్కొన్నారు.రాజమండ్రి నియోజక వర్గాన్ని కాదు, రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించేలా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేను ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని భరత్ డిమాండ్ చేసారు.

### ఎమ్మెల్యే బత్తుల ఆదేశాలతో మత్స్యకారులకు నిత్యవసరాలు పంపిణీ చేసిన

# జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కారిచర్ల విజయ శంకర్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డియే కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాల మేరకు పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన మత్స్యకార 70 కుటుంబాలకు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కారిచర్ల విజయశంకర్ ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల రైస్, పంచదార, కందిపప్పు, మంచి నూనె, శనగల వంటి నిత్యవసరాలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని విజయ శంకర్ విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ శంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మండలంలో ఎవరికి ఎలాంటి ఏ చిన్న కష్టం వచ్చినా ఆయనే దగ్గరుండి చూసుకుంటూ సీతానగరం మండలంలో ప్రజా సేవలో ముందుకు సాగుతూ తనదైన శైలిలో ప్రజల యొక్క ఆదరాభిమానాలు పొందుతు న్నారని అన్నారు. మండలంలో పేద ప్రజలకు సేవలు అందించడానికి జనసేన పార్టీ తరఫునుంచి జన సైనికులు ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నారని తెలియజేశారు. పవన్ కళ్యాణ్ ఎలాంటి స్వార్థం లేకుండా పేద ప్రజలకు రాష్ట్రవ్యాప్తంగా సేవలు అందిస్తున్నారని అదే భావంతో నియోజకవర్గ ఎమ్మెల్యే అంకితభావంతో ఏమీ ఆశించకుండా పని చేస్తున్నారని ఈ సందర్భంగా విజయ శంకర్ గుర్తు చేశారు. ఎన్నికవకముందు ఎన్నికైన తర్వాత ఎమ్మెల్యే బలరామకృష్ణ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి ఆయన తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారని అన్నారు. సేవా కార్యక్రమాలు అంటేనే బలరామకృష్ణ అని రాజానగరం నియోజకవర్గంలో మునుపెన్నడూ ఏ ఎమ్మెల్యే ప్రజల కోసం పనిచేయలేదని కానీ జనసేన పార్టీ ఎమ్మెల్యే ప్రజల కోసమే తపిస్తూ నిస్వార్థ సేవలు అందించుటలో బత్తుల బలరామకృష్ణకు సాటి పోటీ ఎవరూ లేరని అన్నారు. రాబోయే రోజుల్లో నేటి ఎమ్మెల్యే బలరామకృష్ణ ఇలాంటి ఎన్నో మంచి పదవులను ఆయన దక్కించుకోవా లని ఆ భగవంతుడుని కోరుకుం టున్నానని కారిచర్ల అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమైక్య అధ్యక్షురాలు కందికట్ల అరుణకుమారి, ఉందుర్తి ఇస్సాకు, పలువురు కూటమి నాయకులు, వీర మహిళలు, మత్స్యకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

**ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరిత విచారణ చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలి**
**ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్**




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ. పోలవరం మండలం బాణాపురంలో 10 ఏళ్ల బాలికపై జరిగిన పైశాచిక అఘాయిత్యాన్ని ప్రజా సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా సోమవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది ఈ అమానుష ఘటన మన సమాజానికి సిగ్గుచేటు. బాలికల భద్రతకు భంగం కలిగించే ఇటువంటి చర్యలు అత్యంత హేయమైనవి. తుని ఘటన మరువక ముందే ఇటువంటి ఘటన జరగడం చాలా దారుణం. ఈ ఘటనను అందరూ ఖండించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ నిందితుడు రాయపురెడ్డి సత్య వెంకట కృష్ణ (బాబీ)ని కఠినంగా శిక్షించాలి. ఇటువంటి పైశాచిక చర్యలకు పాల్పడేవారికి సమాజంలో స్థానం లేదని తేల్చి చెప్పాలి. బాలికకు మెరుగైన వైద్యం, మానసిక ధైర్యం అందించాలి. మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే గ్రామంలో నిందితుడు భారీ నేరాలకు పాల్పడిన మరికొంతమంది బాలికలు ఉన్నట్టు సమాచారం వస్తుందని, ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని పోలీసు అధికారులను కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబానికి తక్షణమే రూ. 50 లక్షల ఆర్థిక సహాయం అందించాలి. బాధిత బాలికకు ఉచిత విద్య, బాలిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగ భద్రత కల్పించాలి. బాలిక విద్య అనంతరం ప్రభుత్వం ఉద్యోగం కల్పించే చర్యలు ఇప్పుడే చేయాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసు విచారణను 90 రోజులలో పూర్తి చేసి, నిందితుడికి కఠినమైన శిక్ష విధించాలి విధించాలి. ప్రతి గ్రామం, పట్టణంలో మహిళలు, బాలికల భద్రత కోసం ప్రత్యేక భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలి. అత్యంత సున్నితమైన ఈ కేసు విచారణను పర్యవేక్షించడానికి ఒక ఉన్నత స్థాయి మహిళా అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు ఈ ధర్నాలో పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా శెట్టి బత్తుల తులసిరావు, బిఎస్పి నియోజకవర్గ నాయకులు పి. మోహన్ బాబు, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు బంగారు రాజు, నకుల రాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, కార్యదర్శి ఎన్.బలరాం, కోశాధికారి కే.కృష్ణవేణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కే.శంకర్, యూటిఫ్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ఎంటివి సుబ్బారావు, రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, జి.గోపాలకృష్ణ, సిపిఐ సీనియర్ నాయకులు కే సత్తిబాబు, జిల్లా కార్యదర్శి రాజేంద్ర, బొంతు రమణ, వీసీకే రాష్ట్ర కార్యదర్శి, ఐద్వా జిల్లా అధ్యక్షులు కార్యదర్శి జి.దైవ కృప, డి.ఆదిలక్ష్మి, పి.అమూల్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, తాడి శ్రీరామ్మూర్తి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఏ.రవి రాజేష్, పౌర హక్కుల నాయకులు అమరదాసు బాబురావు, గిడ్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి బాబురావు మానవ హక్కుల వేదిక నామాడి శ్రీధర్ పిడిఎం నాయకులు శివప్రసాద్ జిల్లా కార్యదర్శి చంద్రకళ అంగన్వాడి జిల్లా కోశాధికారి పి.అమూల్య కే.బేబీ గంగారత్నం మాలమహానాడు సీనియర్ నాయకులు యలంగి సత్యనారాయణ, కెవిపిఎస్ లీగల్ అడ్వాజర్ జీత్తుక సత్యనారాయణ, బిఎస్పి నాయకులు మెండి డేవిడ్, దళిత సేన నాయకులు వాకాపల్లి హరీష్, బిఎస్పి నాయకులు సాపే రమేష్, బిఎస్పి యువ నాయకులు గెడ్డం విజయ్ కుమార్ పిడిఎఫ్యూ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, కెవిపిఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# అభినందనలు..




అమ్మాయిల ప్రపంచ క్రికెట్‌లో విజయం సాధించి విశ్వవిజేతలకు వందనం.. అభివందనం...

ఓర్పు నేర్పులతో క్రికెట్ యుద్ధంలో విజయం సాధించిన మీకు వందనం అభివందనం..

మైదానంలో అద్భుత బ్యాటింగ్ బౌలింగ్ విన్యాసాలతో విజయం సాధించి దేశ గౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటిన మీకు అభినందన మందార చందన మాలలు..

విజయోస్తు మహిళా భారత క్రికెట్ సభ్యులకు
జయహెూ భరతమాత ముద్దు బిడ్డలకు

మహిళలు అబలలు కాదు, సబలలు అని నిరూపించి త్రివర్ణ పతాకం సగర్వంగా ఎగిరెలా చేసిన మహిళా భారత క్రికెట్ సభ్యులకు అభినందనలు..



రచన:
**మంజుల పత్తిపాటి,**
**మాజీ డైరెక్టర్**
**ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ,**
**యాదాద్రి, భువనగిరి జిల్లా,**
**తెలంగాణ రాష్ట్రం,**
**చరవాణి 9347042218.**

# ప్రజల నుంచి అర్జీల స్వీకరణ..

**సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటాం : ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్ సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ప్రజల నుంచి ఆరు అర్జీలను స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన, వేగవంతమైన పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను తక్షణమే సంబంధిత విభాగాధి కారులకు పంపించి సమయానుకూలంగా పరిష్కారం కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం కు చెందిన నందూరి సూర్య లక్ష్మీ ఇంటి నిర్మాణం కోసం స్థలం కేటాయించ వలసిందిగా అర్జీ సమర్పించారు. అదనంగా మరికొందరు కూడా భూమి, పెన్షన్, ఆదాయ ధృవపత్రాలు, వ్యక్తిగత అంశాలకు సంబంధించిన వినతిపత్రాలు అందజేశారు. ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీపై ఫాలోఅప్ చర్యలు తీసుకొని, నిర్ణీత గడువులోపు పరిష్కారాన్ని సాధించాలన్నారు. ప్రజలతో నేరుగా మమేకమవడం ద్వారా సమస్యలు తెలుసుకొని పరిష్కారం చూపడమే లక్ష్యమని తెలిపారు.

# భీమేశ్వర స్వామి వారి ఆలయంలో భారీ అన్నసమారాధన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం హసన్ బాద గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని చింతపల్లి చిన వెంకరెడ్డి కుమారుడు చింతపల్లి నాగ సత్య సూర్య శివప్రసాద్ (సతీష్) నాగదేవీ దంపతుల సౌజన్యంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి ఆలయ అర్చకులు ఉండి వీరభద్రశర్మ బ్రహ్మత్వంలో స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.చింతపల్లి నాగ సత్య సూర్య శివప్రసాద్ దేవీ దంపతులు స్వామి వారికి అన్నాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాధన దాత చిన వెంకటరెడ్డి పరమహంస దంపతులు, నాగ సత్య సూర్య శివప్రసాద్ దేవీ దంపతులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చింతపల్లి వీరభద్రరావు, చోడిశెట్టి వీరభద్రరావు, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు,బొల్లం సత్తిరాజు, వార్డు సభ్యులు రాంబాబు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్ వరల్డ్ కప్ గెలిచిన సందర్భంగా విద్యార్థినుల భారీ ర్యాలీ




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం జరిగిన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై అద్భుతమైన విజయాన్ని సాధించి విశ్వవిజేతగా నిలిచిన భారత మహిళల జట్టుకు అభినందనలు తెలియజేస్తూ రామచంద్రపురంలో మోడరన్ జూనియర్ కాలేజ్ విద్యార్థినిలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జయహెూ భారత్,కంగ్రాట్యూలేషన్స్ టీం ఇండియా అని నినాదాలు చేస్తూ సందడి చేశారు.

# ఘనంగా శ్రీ మహాగణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహేత శ్రీ బసవేశ్వర సంబరం

**బసవేశ్వర స్వామి సేవలో పట్టణ ప్రముఖులు**





**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం రావి చెట్టు సెంటర్ వద్ద మున్సిపల్ లైబ్రరీ వెనుక గల తమ్మవారి వీధి లో ఘనంగా శ్రీ మహాగణపతి సుబ్రహ్మణ్యేశ్వర సహేత శ్రీ బసవేశ్వర సంబరం జరిగింది. బసవేశ్వర స్వామికి సులలతో సంబరం చేయించారు. బ్రహ్మాండమైన బాణసంచా కాల్పులతో, కళ్ళు మిరిమెట్లు గొలిపే లైటింగ్ తో సంబరానికి కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ సంబరం రాత్రి 7 గంటల నుండి మొదలై మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటల వరకు జరుగును అని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సంబరానికి ముఖ్య అతిథులుగా అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వరప్రకాష్ లు పాల్గొని బసవేశ్వర స్వామి దర్శించుకుని స్వామి కరుణ కటాక్షం ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం గుడి పూజారులు భక్తులకు ప్రసాదా వితరణ కార్యక్రమం చేశారు.డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో టౌన్ సిఐ దారం సురేష్, ఎస్సై బి.రాములు పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మెడింటి సూర్య ప్రకాష్, చాపల వీరబాబు,తమ్మా బాల సుబ్రహ్మణ్యం (ధర్మకర్త), తమ్మా నాగార్జునరావు, తమ్మా వెంకటేశ్వర రావు, తమ్మా శివ శ్రీ, దొడ్డిపట్ల సూర్య ప్రకాశ్, దొడ్డిపట్ల సత్య బాలాజి, దొడ్డిపట్ల వీర వెంకట రాఘవేంద్రా (రఘు), దొడ్డిపట్ల సాయి, సిద్దాని సత్యనారాయణ, రుద్రక్షుల మరిడియ్య, దొడ్డిపట్ల ధన గంగారాజు గుడిమెట్ల రవి, గుడిమెట్ల నాగు, నిల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ ముందస్తు జాగ్రత్త చర్యలకు సత్కారం

**కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న కమిషనర్ టీవీ రంగారావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకున్నారు. మొంధా తుఫాన్ లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పట్టణ పరిధిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నందుకుగాను ఈ అవార్డును కలెక్టర్, కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాను సహాయక చర్యల్లో సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ఈ అవార్డు అంకితమని రంగారావు అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఎస్పీ మీనా, డీ.ఆర్.ఓ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరల్డ్ ఫంగస్ డే

**సుమారు రెండు వందల మందితో ఆన్లైన్ జూమ్ మీటింగ్ - ముఖ్య అతిథులుగా పాల్గొన్న సైంటిస్టు**




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ కృత్తివెంటి పెర్రాజు పంతులు డిగ్రీ కళాశాలలో వరల్డ్ ఫంగస్ డే సందర్భంగా ఆన్లైన్ జూమ్ మీటింగ్ నిరహించడం జరిగింది.దినికి ముఖ్య అధితులుగా డాక్టర్ పిల్లే దామోదర్ పిచ్చాయ్,నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఫోషోనోగ్రాఫి,సిఎస్ఐఆర్ సంస్థ సైన్సిస్ట్ మరియు ప్రొఫెసర్ పెద్దయ్య డిపార్ట్మెంట్ అఫ్ హ్యూమన్ జెన్నిటిక్ ఆంధ్ర యూనివర్సిటీ అఫ్ విశాఖపట్నం,డాక్టర్ ఎస్ ఎస్ ఎస్విని విడాసిటీ ఫౌండర్ మైసూర్,విప్లాప్ మహాతో మైకాలజిస్ట్ బెంగళూర్ ముఖ్య అధితులుగా వ్యవహరించారు.సుమారు రెండు వందలకు పైగా ఫ్యాకల్టీ,సూటెండ్స్ పాలొగొన్నారు.దినికి ముఖ్య అధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిఎచ్ రామకృష్ణ వ్యవహారించారు.వైస్ ప్రిన్సిపాల్ పద్మజ,ఐక్యూఐసి శ్రీనివాస్, బోటనీ విభాగ అధిపతి డాక్టర్ శారా పాలపర్తి పాల్గొన్నారు.ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉదేశం ఏమిటి అంటే సిలిద్రము వాతావరణంపై చూపించే ప్రభావం మరియు భవిష్యత్తులో ఆహారంగా ఏలా పనికొస్తాయి. అలానే పుట్ట గొడుగుల పెంపకం, ప్రయోజనాలు వీటి గురించి నిపుణులు మాట్లాడారు. విద్యారర్థిని విద్యార్థులు ఎంతో ఆశక్తిగా వింటూ అనేక కొత్త విషయాలపై చర్చిస్తూ నేర్చుకున్నారు.

# రఘుదేవపురంలో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అభిరామ్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామంలో తొర్రిగడ్డ చైర్మన్ వేగి శ్రీనివాసరావు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో రాజానగరం నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్ పాల్గొన్నారు.

## బిజినెస్ వాయిస్

### మరోసారి షాకిచ్చిన బంగారం, వెండి ధరలు



మన ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఇక అందులోనూ మన దేశంలో గోల్డ్‌కి మరింత పాపులారిటీ ఎక్కువ. ఇక ఈ మధ్య కాలంలో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరోజు రేట్లు తగ్గి కాస్త ఊరటనిస్తుంటే మరో రోజు పెరిగి అమ్మో అనిపిస్తున్నాయి. అయితే గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలు రెండు రోజుల నుంచి కాస్త తగ్గుముఖం పట్టాయి. దీంతో పసిడి ప్రియులు కాస్త ఊపిరి పీల్చుకునే లోపే మళ్లీ బంగారం ధరలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో నేడు బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. ఇక ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో నిన్న రూ.1,23,000 ఉన్న 24 క్యారెట్ల బంగారం ధర పై నేడు రూ.170 పెరిగి రూ. 1,23,170గా ఉంది. అలాగే నిన్న రూ.1,12,750 ఉన్న 22 క్యారెట్ల బంగారం ధర పై నేడు రూ.150 పెరిగి రూ.1,12,900 గా ఉంది. ఇక అటు వెండి ధర రూ.2000 పెరిగి కిలో రూ. 1,68,000గా ఉంది.

### విదేశీ మారకం నిల్వల్లో భారీ పతనం



భారతదేశ విదేశీ మారకం నిల్వల్లో భారీ తగ్గుదల చోటు చేసుకుంది. అక్టోబర్ 24తో ముగిసిన వారంలో ఏకంగా 6.9 బిలియన్ డాలర్లు తగ్గి 695.355 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. ఇది ఇంతక్రితం వారంలో నమోదైన 702.28 బిలియన్లతో పోల్చితే తగ్గుదలను సూచిస్తుందని వెల్లడించింది. ఫారెక్స్ నిల్వలలో ప్రధాన భాగం అయినా విదేశీ కరెన్సీ ఆస్తులు సమీక్షా వారంలో 3.862 బిలియన్ డాలర్లు తగ్గి 566.548 బిలియన్లకు పరిమితమయినట్టు ఆర్బీఐ తెలిపింది. ఈ ఆస్తులలో యూరో, యెన్, పౌండ్ వంటి కరెన్సీలు డాలర్‌తో పోలిస్తే విలువలో హెచ్చు తగ్గులు చెందడం ఈ తగ్గుదలకు కారణం. ఇటీవల డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడంతో ఈ విలువ తగ్గింది. అదే సమయంలో బంగారం నిల్వలు 3.01 బిలియన్లు తగ్గి 105.536 బిలియన్లకు చేరాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) 58 మిలియన్లు తగ్గి 18.664 బిలియన్ డాలర్లకు తగ్గాయని వెల్లడించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో భారతదేశ నిల్వలు 6 మిలియన్ డాలర్లు పెరిగి 4.608 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. భారత విదేశీ మారకం నిల్వలు తగ్గితే ప్రధానంగా రూపాయిపై ఒత్తిడి పెరగనుంది.

# మైక్రోసాఫ్ట్‌లో ఐటీ ఉద్యోగుల నియామకాలు షురూ




ఐటీ, టెక్ రంగంలో లేఆఫ్స్ కారణంగా గత కొన్ని నెలలుగా ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న సంగతి తెలిసిందే. ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో చెప్పలేని పరిస్థితులు. కరోనా మహమ్మారి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కారణాలతో ప్రపంచ స్థాయి టెక్ దిగ్గజ సంస్థల్లో ఒకటైన మైక్రోసాఫ్ట్ సైతం భారీగానే ఉద్యోగులను తొలగించింది. ఆ కంపెనీలో కొత్తగా చేరాలంటో ఉద్యోగానికి గ్యారెంటీ లేదనే మాట స్థాయికి వచ్చింది. అయితే, ఇకపై అలా ఉండదు. ఐటీ, టెక్ రంగంలోని వారు ఎగిరి గంతేసే మాట చెప్పారు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల . త్వరలోనే తమ కంపెనీ భారీగా నియామకాలు చేపట్టనుందని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో దూసుకెళ్లడమే లక్ష్యంగా మైక్రోసాఫ్ట్ అతి త్వరలో నియామకాలు మొదలుపెడుతుందని ఆ సంస్థ సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. ఇన్నాళ్లు వివిధ విభాగాల్లో లేఆఫ్స్ చేపట్టిన ఈ కంపెనీ ఇప్పుడు ఏఐని దృష్టిలో పెట్టుకుని నియామకాలు ప్రారంభిస్తుండడం గమనార్హం. బీజీ2 పాడ్ కాస్ట్‌లో పాల్గొన్న సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించారు. భవిష్యత్తులో కంపెనీ విస్తరణ ఆటోమేషన్ ఆధారంగానే మరింత స్మార్ట్‌గా, వ్యూహాత్మకంగా ఉంటుందన్నారు. ప్రస్తుత మార్పులను గతంలో ఫ్యాక్స్‌ల నుంచి ఇ-మెయిల్స్, స్ప్రెడ్ షీట్లకు మారిన విప్లవంతో ఆయన పోల్చారు. 'మా కంపెనీలో ఉద్యోగుల సంఖ్య పెంచబోతున్నాం. అయితే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శకానికి ముందు ఉన్నట్లుగా మాత్రం ఉండదు. అంటే వచ్చే నియామకాలు ఏఐ ప్రభావాన్ని పెంచనున్నాయే తప్పా ప్రస్తుతం ఉన్న మాదిరిగా యాంత్రికంగా మాత్రం ఉండదు' అని సత్య నాదెళ్ల వెల్లడించారు. ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్ హబ్ ఏఐ కోడింగ్ హెల్పర్ వంటి యాక్సెస్ ఇస్తామన్నారు. ఏఐ సాయంతో మరింత వేగంగా పని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన వెల్లడించారు. దాదాపు ఏడాది నుంచి మైక్రోసాఫ్ట్ కంపెనీ ఉద్యోగుల సంఖ్యలో మార్పులు లేవు. 2022 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఆ కంపెనీలో ఉద్యోగుల సంఖ్య ప్రతి సంవత్సరం 22 శాతం మేర పెరుగుతూ వచ్చింది.

## అక్టోబర్‌లో 13 శాతం పెరిగిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు



ప్రముఖ ద్విచక్రవాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ అక్టోబర్ నెలలో అమ్మకాల్లో సత్తా చాటింది. పండగ సీజన్ డిమాండ్, మార్కెట్‌లో సానుకూల సెంటిమెంట్ కారణంగా గతేడాది ఇదే నెలతో పోలిస్తే మొత్తం విక్రయాల్లో 13 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది అక్టోబర్‌లో 1,24,951 యూనిట్లను విక్రయించగా, గతేడాది ఇదే సమయంలో ఈ సంఖ్య 1,10,574 యూనిట్లుగా ఉంది. కంపెనీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, దేశీయ అమ్మకాలు 15 శాతం పెరిగి 1,01,886 యూనిట్ల నుంచి 1,16,844 యూనిట్లకు చేరాయి. అయితే, ఎగుమతులు మాత్రం నిరాశపరిచాయి. గతేడాది 8,688 యూనిట్లుగా ఉన్న ఎగుమతులు, ఈసారి 7 శాతం తగ్గి 8,107 యూనిట్లకు పరిమితమయ్యాయి. పండగ సీజన్ ఉత్సాహం దేశవ్యాప్తంగా అమ్మకాలకు ఊతమిచ్చిందని ఐషర్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్, రాయల్ ఎన్‌ఫీల్డ్ సీఈఓ బి. గోవిందరాజన్ తెలిపారు. "సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 2.49 లక్షల మోటార్‌సైకిళ్లను విక్రయించి రికార్డు సృష్టించాం. మా కంపెనీ చరిత్రలో పండగ సీజన్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన. మా బ్రాండ్‌పై రైడర్లకు ఉన్న అచంచలమైన అభిమానానికి ఇది నిదర్శనం" అని ఆయన వివరించారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాల వృద్ధి, దేశంలోని టూవీలర్ పరిశ్రమ మొత్తం పుంజుకుంటున్న తరుణంలో జరగడం గమనార్హం. జీఎస్టీ సంస్కరణలు, పండగ డిమాండ్‌తో టీవీఎస్ మోటార్, సుజుకి మోటార్‌సైకిల్ వంటి ఇతర ప్రముఖ కంపెనీలు కూడా అక్టోబర్‌లో 8 నుంచి 11 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సెంటిమెంట్, కొత్త మోడళ్ల విడుదల వంటి అంశాలు దీపావళికి ముందు టూవీలర్ అమ్మకాలకు మరింత ఊపునిచ్చాయని విశ్లేషకులు భావిస్తున్నారు. క్లాసిక్ 350, బుల్లెట్, హంటర్ 350, హిమాలయన్ వంటి మోడళ్లతో మిడ్-సైజ్ మోటార్‌సైకిల్ సెగ్మెంట్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది.

# 'వరల్డ్ కప్ టీమ్'లో ఆ నలుగురు.. ఓపెనర్‌గా మంధాన!

వన్డే ప్రపంచకప్‌లో తడబాటు నుంచి గొప్పగా పుంజుకొన్న భారత జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. భావి తరాలకు స్ఫూర్తినిచ్చే విజయంతో మహిళా క్రికెట్ చరిత్రలో కొత్త చరిత్రను సృష్టించింది. దశాబ్దాల కలను సాకారం చేసుకునేందుకు మైదానంలో సర్వశక్తులు ఒడ్డిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం.. విజయంతో మెగా టోర్నీకి వీడ్కోలు పలికింది. ఈ పదమూడో సీజన్‌లో అద్భుత ప్రదర్శన చేసిన నలుగురు భారత క్రికెటర్లు వరల్డ్ కప్ టీమ్ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌లో చోటు దక్కించుకున్నారు. క్రీడాభిమానులను అలరించిన వన్డే ప్రపంచకప్ ముగియడంతో ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో జట్టును ప్రకటించింది. ఇందులో భారత్ నుంచి నలుగురు, రన్నరప్ దక్షిణాఫ్రికా జట్టు నుంచి ముగ్గురు ఎంపికవ్వగా.. ఆస్ట్రేలియా జట్టులోని ముగ్గురు, ఇంగ్లండ్ నుంచి ఒకరికి చోటు లభించింది. టీమిండియా టీమిండియా విజేతగా నిలవడంలో కీలకమైన స్మృతి మంధాన ఓపెనర్‌గా, మిడిలార్డర్ బ్యాటర్‌గా జెమీమా రోడ్రిగ్స్, వికెట్ కీపర్‌గా రీచా ఘోష్.. స్పిన్ ఆల్‌రౌండర్‌గా దీప్తి శర్మలు ఎంపికయ్యారు. మెగా టోర్నీలో నాకౌట్స్‌లో శతకాలతో రెచ్చిపోయిన లారా వొల్వార్డ్ కెప్టెన్, ఓపెనర్‌గా సెలెక్ట్ అయింది. రెండు సెంచరీలు బాదిన అష్ గార్డ్‌నర్, సథర్‌లాండ్, అలనా కింగ్(ఆస్ట్రేలియా), సోఫీ ఎకిల్‌స్టోన్(ఇంగ్లండ్)లు తుది జట్టులో నిలిచారు. వరల్డ్ కప్‌తో వన్డేలకు వీడ్కోలు పలికిన న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవినె పన్నెండో ప్లేయర్‌గా ఎంపికైంది. వన్డే వరల్డ్ కప్ టీమ్: స్మృతి మంధాన, లారా వొల్వార్డ్(కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, మరిజానే కాప్, అనబెల్ సథర్‌లాండ్, అష్ గార్డ్‌నర్, రీచా ఘోష్(వికెట్ కీపర్), నడినే డీక్లెర్క్, దీప్తి శర్మ, అలనా కింగ్, సోఫీ ఎకిల్‌స్టోన్. 12వ ప్లేయర్ – సోఫీ డెవినె.



### క్రాంతి గౌడ్‌కు రూ.కోటి నజరానా ప్రకటించిన మధ్యప్రదేశ్ ప్రభుత్వం!



ఐసీసీ వన్డే ప్రపంచ కప్‌లో అద్భుతంగా రాణించిన టీమిండియా క్రికెటర్ క్రాంతి గౌడ్‌కు మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించింది. 22 ఏళ్ల యువ బౌలర్ ఎనిమిది మ్యాచుల్లో 5.73 ఎకానమీ రేటుతో బౌలింగ్ చేస్తూ తొమ్మిది వికెట్లు పడగొట్టింది. మెగా ఈవెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చినందుకు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ భారత జట్టుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ స్టార్ కాంతి గౌడ్‌కు రివార్డును ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో మన అమ్మాయిలు అద్భుతంగా రాణించినందుకు ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నానన్నారు. క్రాంతి గౌడ్ మహిళల ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగమైనందున సత్కరించాలనుకుంటు న్నానని.. ప్రభుత్వం తరఫున రూ.కోటి ప్రోత్సాహకాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మ్యాచ్‌లో క్రాంతి అందించిన సహకారాన్ని ప్రశంసించారు. ఆమె ఛతర్‌పూర్, మధ్యప్రదేశ్‌కు గర్వకారణంగా నిలిచిందని.. భారత క్రికెటర్లు ప్రపంచవేదికపై భారతదేశం గర్వపడేలా చేశారన్నారు. కృషి, పట్టుదల, అభిరుచి ఉంటే ఏదైనా సాధించగలరన్న దానికి క్రాంతి సాధించిన విజయం ఉదాహరణ ని సీఎం యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సరికొత్త శిఖరాలను అందుకునేందుకు అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసింది క్రాంతి గౌడ్. ప్రపంచకప్‌లో ఏడు వన్డేలు ఆడింది. అక్టోబర్ 5న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో పాకిస్తాన్‌తో జరిగిన హై వోల్టేజ్ మ్యాచ్‌లో పది ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసింది. ఆ మ్యాచ్‌లో భారత జట్టు 88 పరుగుల తేడాతో గెలిచింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శనకు ఆ మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నది. ఇక ఇప్పటి వరకు 15 వన్డేలు ఆడిన క్రాంతి 5.79 ఎకానమీతో 23 మూడు వికెట్లు తీసింది. ఒక మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసింది. బెస్ట్ బౌలింగ్ ఫిగర్స్ 6/52. బ్యాట్‌తోనూ 682 పరుగులు చేసింది.


## క్రీడా వాయిస్

# ఊడ్చేసిన ఆఫ్ఘనిస్తాన్



ఆఫ్ఘనిస్తాన్ జట్టు జింబాబ్వేను వారి సొంత గడ్డపై ఊడ్చేసింది. 3 మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. నిన్న (నవంబర్ 2) జరిగిన నామమాత్రపు మూడో మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. ఓపెనర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (92), ఇ?బ్రహీం జద్రాన్ (60) చెలరేగారు. ఆఖర్లో సెదిఖుల్లా అటల్ (35 నాటౌట్) సైతం మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జింబాబ్వే బౌలర్లలో ఈవాన్స్ 2, నగరవ ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే సైతం అద్భుతంగా పోరాడింది. నిర్ణీత ఓవర్లు బ్యాటింగ్ చేసి 201 పరుగులకు ఆలౌటైంది. సికందర్ రజా (51), బ్రియాన్ బెన్నెట్ (47), ర్యాన్ బర్ల్ (37), ముసేకివా (28) పోరాడారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో అహ్మద్‌జాయ్ 3, ఫజల్ హక్ ఫారూకీ, ఫరీద్ అహ్మద్ మాలిక్ తలో 2, ముజీబ్, నబీ చెరో వికెట్ తీశారు. ఈ సిరీస్‌కు ముందు ఇరు జట్ల మధ్య జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

# గోండు గిరిజన మహిళగా రష్మిక మందన్నా




కన్నడ హీరోయిన్ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం మైసా ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట రౌండప్ చేస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. రష్మిక మందన్నా టీం అధికారికంగా షూటింగ్ మొదలు పెట్టేసినట్టు తాజాగా వార్త తెరపైకి వచ్చింది. కేరళలోని అథిరప్పిల్లీలో అధికారికంగా నేడు షూటింగ్ మొదలైనట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అంతేకాదు ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందట. ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో మెస్మరైజ్ చేయబోతున్నట్టు ఫస్ట్ లుక్ హింట్ ఇచ్చేస్తుంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో ఇరగదీసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా మైసా సినిమాలో ఎలా మెప్పించబోతున్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. రష్మిక మందన్నా సినిమాలో తారక్ పొన్నప్ప నటించడం ఇది రెండోసారి. ఈ మూవీకి ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రాజెక్ట్‌కు పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని సమాచారం.



# రమ్యకృష్ణని ఇలా ఎప్పుడూ చూడలేదు!

రమ్యకృష్ణ పేరు చెప్పగానే ఇప్పటి జనరేషన్‌కి అయితే శివగామి పాత్ర గుర్తొస్తుంది. ఎందుకంటే 'బాహుబలి'లో ప్రభాస్, రానానే కాదు రమ్యకృష్ణ తన యాక్టింగ్‌తో చూపించిన డామినేషన్.. ఈమె సెకండ్ ఇన్నింగ్స్‌కి మంచి పునాది వేసింది. ఇప్పటికీ వరస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న రమ్యకృష్ణ.. మునుపెన్నడూ లేని విధంగా ఓ దెయ్యం సినిమా కోసం కనిపించనుంది. ఆ లుక్స్ ఇప్పుడు తెగ వైరల్ అయిపోతున్నాయి. గత కొన్నాళ్లుగా సినిమాలైతే చేస్తున్నాడు గానీ ఒక్క హిట్ కూడా కొట్టలేకపోతున్న డైరెక్టర్ రాంగోపాల్ వర్మ.. ప్రస్తుతం 'పోలీస్ స్టేషన్ మైన్ భూత్' అనే హారర్ మూవీ తీస్తున్నాడు. మనోజ్ బాజ్‌పాయ్ పోలీస్‌గా చేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం ఈ చిత్రం గురించి చెప్పిన ఆర్జీవీ.. ఓ డాన్ చనిపోయి దెయ్యమవుతాడని, తర్వాత పోలీసులని ఎలా ఇబ్బంది పెట్టాడనేది కాన్సెప్ట్ అని చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో రమ్యకృష్ణ కూడా నటిస్తోందని, ఆమె లుక్ ఇదేనంటూ ఆర్జీవీ రెండు ఫొటోలని పోస్ట్ చేశాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా మాసీగా కనిపించింది. చేతిలో సిగరెట్, ముఖంపై బొట్లు, జీన్స్ ప్యాంట్ ఇలా టామ్ బాయ్ తరహాలో కనిపించింది. అయితే ఈమెది దెయ్యం పాత్ర కాదని ఆర్జీవీ క్లారిటీ ఇచ్చాడు. రీసెంట్‌గానే 'బాహుబలి' మూవీ ఎపిక్ పేరిట రిలీజైంది. దీంతో ఆ మూవీ లవర్స్.. మా శివగామిని ఇలా మార్చేశారేంటి? అని మాట్లాడుకుంటున్నారు.



# ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ సినిమాపై తప్పుడు ప్రచారం

జూనియర్ ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై ఈ మధ్య చాలా రూమర్స్ వస్తూనే ఉన్నాయి. మూవీ షూటింగ్ ఆగిపోయిందని కొద్దిరోజులుగా ప్రచారం అయింది. అయితే, ఈ మూవీ రెండు భాగాలుగా రానుందని సోషల్‌మీడియాలో కొత్త ప్రచారం తెరపైకి తీసుకొచ్చారు. 'డ్రాగన్' పేరుతో తెరకెక్కుతున్న ఈ మూవీని మొదట ఒకే భాగంగా నిర్మించాలని మేకర్స్ అనుకున్నారట.. కానీ, రన్ టైమ్ ఎక్కువ రావడంతో రెండు పార్ట్స్‌గా విడుదల చేసేందుకు వారు ప్లాన్ చేసినట్టు ప్రచారం జరిగింది. అయితే, అందులో ఎలాంటి నిజం లేదని ప్రశాంత్ నీల్ టీమ్ తాజాగా ఒక పోస్ట్ చేసింది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పటికే కేజీఎఫ్ చిత్రాలను రెండు భాగాలుగా నిర్మించి భారీ విజయాన్ని అందుకున్నారు. సలార్ మూవీని కూడ రెండు పార్ట్స్‌గా విడుదల చేస్తామని తెలిపారు. ఇదే క్రమలో తారక్ సినిమాను కూడా సీక్వెల్ ప్లాన్ చేసే పనిలో ఉన్నారని ఒక వార్త ట్రెండ్ అయింది. అయితే, తాజాగా ప్రశాంత్ నీల్ టీమ్ ఖండించింది. '





# చిరు సినిమాలో వెంకీ పాత్ర ఇదే.. మెగాస్టార్‌తో కలిసి ఓ రేంజ్‌లో సందడి

మెగాస్టార్ చిరంజీవి విక్టరీ వెంకటేష్ కలయికలో భారీ ఎంటర్టైనర్ రానుందనే వార్తతో టాలీవుడ్ అభిమానుల్లో జోష్ మొదలైంది. ఈ ఇద్దరు స్టార్ హీరోలు కలిసి తెరపై కనిపించబోతున్న చిత్రం "మన శంకర వర ప్రసాద్ గారు". ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ చిత్రం తెలుగు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా కూడా మారింది. ఈ చిత్రానికి హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, పాజిటివ్ ఎనర్జీతో నిండిన కథలను చెప్పడంలో దిట్ట అయిన ఆయన, ఈసారి చిరంజీవి - వెంకటేష్‌ల కలయికను మరింత స్పెషల్‌గా మలచబోతున్నారని సమాచారం. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, వెంకటేష్ ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. అయితే అది సాధారణ పాత్ర కాదు. ఆయన పాత్రలో వినోదంతో పాటు కథను కీలక మలుపు తిప్పే ఎమోషనల్ ఎడ్జ్ కూడా ఉంటుందట. ఆయన ఎంట్రీ తర్వాత సినిమా నరేషన్ మరింత ఉత్సాహంగా మారుతుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి, వెంకటేష్ కలిసి నటించిన కొన్ని సన్నివేశాలు ఇప్పటికే షూట్ పూర్తయ్యాయి. వాటిలో ఒక పాటను కూడా చిత్రీకరించారు. ఆ పాట సినిమాకు హైలైట్‌గా నిలవనుందని టీమ్ విశ్వాసం. మెగాస్టార్ మాస్ అటిట్యూడ్, వెంకటేష్ కూల్ కామెడీ, అనిల్ రావిపూడి ప్రత్యేక నేరేషన్ స్టైల్ కలగలిపి ఈ సినిమా పూర్తి ప్యాకేజీ ఎంటర్టైనర్‌గా రానుందని తెలుస్తోంది. చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని భారీ సెట్స్‌లో వేగంగా జరుగుతోంది. అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా భావోద్వేగాలు, కామెడీ, ఫ్యామిలీ ఎలిమెంట్స్ మేళవింపుతో స్క్రిప్ట్ రూపొందించబడిందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి %–% విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం టాలీవుడ్‌లో అత్యంత పెద్ద మల్టీస్టారర్‌గా నిలవనుంది. అభిమానుల అంచనాల ప్రకారం, "మన శంకర వర ప్రసాద్ గారు" వచ్చే ఏడాది బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ సినిమాకి పోటీగా పలు చిత్రాలు విడుదల అవుతున్నా, అందరి దృష్టి ఈ మూవీపైనే ఉంది.

# నాని తల్లిగా సోనాలి కులకర్ణి

## ది ప్యారడైజ్ టీం కొత్త వార్త ఇదే..!



దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్ ఈ చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఇప్పటికే విడుదల చేసిన లుక్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. చాలా రోజుల తర్వాత ఈ చిత్రం నుంచి ఆసక్తికర అప్‌డేట్‌తో అభిమానుల్లో జోష్ నింపుతున్నాడు నాని. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మేకర్స్ అధికారికంగా బర్త్ డే విషెస్ తెలియజేస్తూ స్పెషల్ విషెస్ తెలియజేశారు. ఈ చిత్రంలో సోనాలి కులకర్ణి నాని తల్లిగా కనిపించనుంది. రా స్టేట్‌మెంట్ గ్లింప్స్‌లో లో ఆమె వాయిస్ ఇంటర్‌నెట్‌లో సంచలనం సృష్టించింది. సినిమాలో ఆమె నటన సెన్సేషన్ సృష్టించడం ఖాయం.. అంటూ మేకర్స్ షేర్ చేసిన పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. పూణేకు చెందిన సోనాలి కులకర్ణి తెలుగులో నటిస్తోన్న తొలి సినిమా ఇదే. మరాఠీ, హిందీ, గుజరాతీ, ఇంగ్లీష్, ఇటాలియన్ భాషల్లో పలు సినిమాలు చేసింది సోనాలి కులకర్ణి. మరి శ్రీకాంత్ ఓదెల ఈ సీనియర్ నటిని సిల్వర్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. కిల్ యాక్టర్ రాఘవ ఈ సినిమాలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో కావడం, మరోవైపు నాని-అనిరుధ్ కాంబోలో జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత వస్తున్న సినిమా అవడంతో ది ప్యారడైజ్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com